

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 12-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 135

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 7.55 తదుపరి అష్టమి; నక్షత్రం: స్వాతి ఉ. 8.33 తదుపరి విశాఖ; వర్జ్యం: మ.2.39-4.24; దుర్ముహూర్తం: మ.12.45-1.35, మ.3.16-4.07; అమృతఘడియలు: రా.1.07-2.52; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.38

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





దేశం	స్వ	ర	కా	మొ
అమెరికా	40	44	42	126
చైనా	40	27	24	91
జపాన్	20	12	13	45
ఆస్ట్రేలియా	18	19	16	53
ఫ్రాన్స్	16	26	22	64
నెదర్లాండ్స్	15	7	12	34
బ్రిటన్	14	22	29	65
కొరియా	13	9	10	32
ఇటలీ	12	13	15	40
జర్మనీ	12	13	8	33
న్యూజిలాండ్	10	7	3	20
కెనడా	9	7	11	27
ఉజ్బెకిస్థాన్	8	2	3	13
హంగేరి	6	7	6	19
స్పెయిన్	5	4	9	18
స్వీడన్	4	4	3	11
కెన్యా	4	2	5	11
నార్వే	4	1	3	8
ఐర్లాండ్	4	0	3	7
బ్రెజిల్	3	7	10	20
71 భారత్	0	1	5	6

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

స్వీడన్‌కు బీచ్ వాలీబాల్ టైటిల్

బీచ్ వాలీబాల్ స్వర్ణాన్ని స్వీడన్ జోడీ డేవిడ్-జొనాటన్ సొంతం చేసుకొంది. పురుషుల ఫైనల్లో స్వీడన్ 2-0తో జర్మనీపై విజయం సాధించింది. కతార్‌పై 2-0తో గెలిచిన నార్వే కాంస్య పతకాన్ని దక్కించుకొంది. హ్యాండ్‌బాల్ టైటిల్‌ను డెన్మార్క్ ఎగరేసుకు పోయింది. పురుషుల ఫైనల్లో డెన్మార్క్ 39-26తో జర్మనీని ఓడించింది. ఉత్కంఠభరితంగా జరిగిన కాంస్య పోరులో స్పెయిన్ 23-22తో స్లొవేనియాపై గెలిచింది.

స్వర్ణాలలో సమం !

ఓవరాల్‌గా అగ్ర పీఠంపై అమెరికా ● చైనాకు రెండో స్థానం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒలింపిక్స్ ముగిశాయి. రెండు వారాలకుపైగా..వేలాదిమంది అథ్లెట్లు తమ అద్భుత నైపుణ్యాలను ప్రదర్శించి విశ్వవ్యాప్తంగా కోట్లాదిమందిని అలరించారు. ఏ ఆటగాడైనా..ఏ జట్టయినా..ఎంత బాగా ఆడారన్నది అంతిమంగా వారు సాధించే పతకాన్ని చూసి నిర్ధారిస్తారు. ఒకప్పుడు ప్రపంచ రాజకీయాల్లో మాదిరే అమెరికా, సోవియట్ రష్యా విశ్వక్రీడల్లోనూ నువ్వా..నేనా..అనేలా ఢీకొనేవి. కానీ కాలం మారింది. ప్రస్తుతం అగ్రదేశం అమెరికాకు అన్ని రంగాల్లో చైనా సవాలు విసురుతోంది. ఆ క్రమంలో ఒలింపిక్స్‌లోనూ అమెరికాతో సై అంది. దాంతో ఈసారి స్వర్ణ పతకాలకోసం రెండు దేశాలు హోరాహోరీగా తలపడ్డాయి. శనివారం పోటీలు ముగిసే సరికి 39 స్వర్ణాలతో చైనా ఆధిపత్యం చెలాయించింది. అమెరికా ఒకటి తక్కువగా అంటే..38 పసిడి పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. దాంతో ఆఖరి రోజు.. ఆదివారం జరిగే ఈవెంట్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చైనాను దాటేసి అమెరికా పతక రేస్‌లో 'అగ్ర' స్థానంలో నిలుస్తుందా..లేదంటే డ్రాగన్ ఆధిపత్యం కొనసాగుతుందా..అనే విషయమై జోరుగా చర్చలు. చివరి రోజు వెయిట్ లిఫ్టింగ్ మహిళల 81 +కిలోల విభాగంలో లీ వెన్ వెన్ స్వర్ణం సాధించడంతో చైనా పతకాల సంఖ్య 40కి చేరింది. అయితే సైక్లింగ్ మహిళల ఓమ్నియమ్ కేటగిరీలో జెన్నిఫర్ వాలెంటె తన పసిడి పతకాన్ని నిలబెట్టుకుంది. దాంతో అమెరికా స్వర్ణాల సంఖ్య 39కి చేరింది. ఈనేపథ్యంలో మహిళల బాస్కెట్‌బాల్ స్వర్ణ పతక పోరుపై ఆసక్తి పెరిగిపోయింది. అందుకుతగ్గట్టుగానే..అమెరికా-ఫ్రాన్స్ ఆ మ్యాచ్‌లో తగ్గేదేలే అన్నట్టు ఆడాయి. చివరకు ఒక పాయింట్ (67-66)తో జయకేతనం ఎగురవేసిన అమెరికా బంగారు పతకం దేజిక్కించుకుంది. దాంతో అమెరికా, చైనా చెరో 40 స్వర్ణ పతకాలతో సమంగా నిలిచాయి.



ఆఖరి రోజు అమెరికా మొత్తం ఐదు పతకాలు తన ఖాతాలో వేసుకుంది. బాస్కెట్‌బాల్, సైక్లింగ్ స్వర్ణాలుగాక, రెజ్లింగ్ మహిళల 76 కిలోలు, మహిళల వాలీబాల్‌లో రజతాలు, పురుషుల వాటర్ పోలోలో కాంస్య పతకం సొంతం చేసుకుంది. కాగా..అమెరికా కాంస్య పతకాలలో ఆదివారంనాడు ఒకటి తగ్గింది. జిమ్నాస్టిక్స్ మహిళ ఫ్లోర్ ఫైనల్లో అమెరికాకు చెందిన జోర్డాన్ చైల్స్ అందుకున్న కాంస్యాన్ని..రుమేనియా జిమ్నాస్ట్ అనాకు ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టు తీర్పు మేరకు పారిస్ క్రీడల నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక..మొత్తం 126 (40-44-42) మెడల్స్‌తో అమెరికా తనకు తిరుగులేదని మరోసారి నిరూపించుకుంది. టోక్యో విశ్వక్రీడల పసిడి పతకాల్లోనూ అమెరికా (39)దే పైచేయి. అప్పుడూ చైనా (38) రెండో స్థానంతో సరిపెట్టుకుంది. రియోలో అయితే అమెరికా (46 స్వర్ణాలు) ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో నిలిచింది.

చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా 117 మంది అథ్లెట్లతో పయనం.. ఈసారి రెండంకెల పతకాలు ఖాయమని అంచనాలు.. తీరా చూస్తే టోక్యో గేమ్స్‌కన్నా ఒకటి తక్కువగా ఆరు మెడల్స్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కచ్చితంగా పోడియంపై నిలబడతారనుకున్న అథ్లెట్లు నిరాశపరిచారు. మరి పారిస్ గేమ్స్‌ను ఏ విధంగా చూడాలి? ఒక్క స్వర్ణం కూడా లేకుండా వెనుదిరిగిన మనోళ్లు విజయవంతమైనట్టా.. లేదా? ఏ దేశ క్రీడా ప్రతిభ అయినా ఒలింపిక్స్ పతకాల పట్టిక చూస్తే తెలుస్తుంది. టోక్యోలో 48వ స్థానంతో మురిపిస్తే.. ఈసారి పతకాలు సాధించిన 91 దేశాల్లో మనది 71వ స్థానం. అయితే ఆరుగురు అథ్లెట్లు నాలుగో స్థానంలో నిలిచి భవిష్యత్‌పై భరోసా పెంచగలిగారు. ఈ నేపథ్యంలో తాజా ఒలింపిక్స్‌లో భారత ప్రస్థానం గురించి విశ్లేషించుకుంటే..

కాస్త మోదం.. ఇంకాస్త ఖేదం

ఆరు పతకాలతో సంతృప్తి

గురి తప్పని షూటర్లు

పారిస్ గేమ్స్‌లో భారత పతకాల పరువు కాపాడింది మాత్రం కచ్చితంగా షూటర్లే. రియో, టోక్యోల్లో ఒక్క పతకం కూడా తేలేకపోయిన వీరు.. పారిస్‌లో మాత్రం అభిమానులను ఖుషీ చేస్తూ ఏకంగా మూడు మెడల్స్‌ను ఖాతాలో వేసుకున్నారు. ఒకే గేమ్స్‌లో భారత్‌కు గతంలో ఇన్ని పతకాలు ఏ క్రీడాంశంలోనూ రాకపోవడం గమనార్హం. పోటీల రెండో రోజే స్టార్ షూటర్ మను భాకర్ 10మీటర్ల వ్యక్తిగత ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్యంతో బోణీ చేసింది. అనంతరం మిక్స్‌డ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్‌తో కలిసి మను మరో కాంస్యం దక్కించుకుంది. ఇక రైఫిల్ 3 పొజిషన్‌లో ఎలాంటి అంచనాలూ లేని స్వప్నిల్ కుశాలె కంచు పతకంతో వహ్వా అనిపించుకున్నాడు.



అంచనాలు తప్పారు..

పారిస్‌కు ముందు చివరి మూడు ఒలింపిక్స్‌లోనూ బ్యాడ్మింటన్‌లో భారత్‌కు పతకాలు వచ్చాయి. కానీ ఈసారి ఎక్కువగా నిరాశపరిచిన విభాగం ఇదే. రియోలో రజతం, టోక్యోలో కాంస్యంతో ఆకట్టుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధు అంచనాలతో బరిలోకి దిగి గ్రూప్ దశను మాత్రమే దాటగలిగింది. అటు డబుల్స్‌లో స్వర్ణం సాధిస్తారనుకున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఓటమి అందరికీ షాక్‌ను కలిగించింది. ఇక బాక్సర్లు కూడా ఊహించని విధంగా రిక్తహస్తాలతోనే వెనక్కి రావాల్సి వచ్చింది. ఈ విభాగం కూడా భారత్‌కు గత మూడు ఒలింపిక్స్‌లో పతకాలను అందించింది. ఎప్పటిలాగే ఆర్చరీలో తొలి ఒలింపిక్ మెడల్ ఇంకా ఊరిస్తూనే ఉంది.

వీరికి లక్కు లేకపాయె..

తాజా ఒలింపిక్స్‌లో పతకాల సంఖ్యను పక్కనబెడితే..మన ఆటగాళ్ల ప్రదర్శన మరీ తీసికట్టుగా భావించలేం. ఓవిధంగా గతంకంటే మిన్నగా ఉందనే చెప్పుకోవాలి. ఎందుకంటే ఆరు ఈవెంట్లలో భారత్ నాలుగో స్థానంలో నిలిచి కాస్తలో కాంస్య పతకాలను చేజార్చుకుంది. పురుషుల 10మీ. ఎయిర్ పిస్టల్‌లో అర్జున్ బబుత, మహిళల 25మీ. ఎయిర్ పిస్టల్‌లో మను భాకర్ ఇలా పతకాలు పోగొట్టుకున్నవారే. అలాగే ఇదే విభాగం మిక్స్‌డ్ స్కీట్ టీమ్‌లో అనంత్‌జీత్ సింగ్, మహేశ్వరి కేవలం ఒక పాయింట్‌తో చైనాకు కాంస్యం కోల్పోయారు. ఇక యువ షట్లర్ లక్ష్య సేన్ పురుషుల బ్యాడ్మింటన్ చరిత్రలో భారత్‌కు పతకం అందించే అవకాశాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు. సెమీస్‌లో తొలి గేమ్‌ను గెలిచినా ఆ ఊపు కొనసాగించలేకపోయాడు. టోక్యోలో రజతం అందుకున్న వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను కేజీ బరువు తేడాతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అలాగే ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్‌లో అంకిత-ధీరజ్ కాంస్య పతక పోరులో వెనుకబడి అపూర్వ అవకాశాన్ని కోల్పోయారు. అన్నింటికీ మించి రెజ్లర్ వినేశ్ ఫొగట్ వ్యవహారం ఎంతో బాధాకరం. ఇక్కడైతే భారత్‌కు కనీసం రజతం ఖాయంగా కనిపించింది. కానీ నిర్ణీత బరువు కంటే ఆమె 100 గ్రాములు ఎక్కువగా ఉండడంతో అనర్హత వేటు పడింది. ఒకవేళ 13న అనుకూలంగా తీర్పు వస్తే భారత్ ఖాతాలో మరో రజతం చేరుతుంది. తద్వారా టోక్యోతో సమానంగా ఏడు పతకాలను అందుకున్నట్టవుతుంది.

పారిస్‌లో పతక వీరులు

అథ్లెట్	క్రీడాంశం	పతకం
మను భాకర్	షూటింగ్	కాంస్యం
మను భాకర్, సరబ్‌జోత్ సింగ్	షూటింగ్	కాంస్యం
స్వప్నిల్ కుశాలె	షూటింగ్	కాంస్యం
పురుషుల హాకీ జట్టు	హాకీ	కాంస్యం
నీరజ్ చోప్రా	జావెలిన్ త్రో	రజతం
అమన్ సెహ్రావత్	రెజ్లింగ్	కాంస్యం

రికార్డుల మోతతో..

పతకాలు తక్కువగానే వచ్చినా కొందరు మాత్రం రికార్డులతో తమ పేరును చిరస్మరణీయం చేసుకున్నారు. ఈసారి దేశం నుంచి పతకం సాధించిన ఏకైక మహిళా అథ్లెట్‌గా షూటర్ మను భాకర్ నిలిచింది. ఒకే గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి స్వతంత్ర భారత అథ్లెట్‌గానూ చరిత్రకెక్కింది. 2008 ఒలింపిక్స్ నుంచి కనీసం ఇద్దరు మహిళలైనా మెడల్స్ అందుకున్నారు. 2012, 2016లలో ఇద్దరేసి, 2021లో ముగ్గురు పతకంతో మెప్పించారు. పారిస్‌లో ఆ చాన్స్ మనుకు దక్కింది. ఇక నీరజ్ చోప్రా కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా నిలిచాడు. అంతేకాకుండా భారత ఒలింపిక్స్ చరిత్రలో స్వర్ణం, రజతం అందుకున్న ఏకైక అథ్లెట్ చోప్రానే. వీరికి తోడు 21 ఏళ్ల యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ భారత్ నుంచి ఒలింపిక్ మెడల్ సాధించిన అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డులకెక్కాడు. భారత హాకీ జట్టు 52 ఏళ్లలో తొలిసారి రెండు వరుస ఒలింపిక్ పతకాలు అందుకుని క్రీడా ప్రేమికులను సంతోషంలో ముంచెత్తింది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

బాస్కెట్‌బాల్‌లో యూఎస్ 'డబుల్'



పారిస్: బాస్కెట్‌బాల్ ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికా పురుషుల జట్టు.. వరుసగా ఐదో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు యూఎస్ మహిళల జట్టు కూడా పసిడిని దక్కించుకొంది. ఎన్‌బీఏ స్టార్ స్టీఫెన్ కర్రీ 24 పాయింట్లతో విజృంభించడంతో.. ఫైనల్లో అమెరికా 98-87తో ఫ్రాన్స్‌ను ఓడించింది. కాంస్య పోరులో సెర్బియా 93-83తో జర్మనీపై నెగ్గింది. హోరాహోరీగా సాగిన మహిళల తుది పోరులో అమెరికా 67-66తో ఫ్రాన్స్‌పై గెలిచింది. బెల్జియాన్ని 85-81తో ఓడించిన ఆస్ట్రేలియా కాంస్యం దక్కించుకొంది.

ఆన్‌లైన్ వేధింపులపై ఖలెఫ్ ఫిర్యాదు

పారిస్: తన లింగత్వం విషయంలో ఆన్‌లైన్‌లో ఎదురైన ట్రోలింగ్, తప్పుడు విమర్శలపై అల్జీరియా బాక్సర్ ఇమాని ఖలెఫ్ చట్టప్రకారం ఫిర్యాదు చేసింది. ఆమెలో పురుష జన్యువులు ఎక్కువగా ఉన్నాయని.. ఖలెఫ్ ట్రాన్స్‌జెండర్ అనే వాదనలు వినిపించాయి. దీంతో మహిళల 66 విభాగంలో పాల్గొనకుండా ఇమానిపై అనర్హత వేటు వేయాలనే డిమాండ్‌లు భారీగా వినిపించాయి.

సైక్లింగ్ స్ప్రింట్ విజేత ఎలిస్

సైక్లింగ్ స్ప్రింట్ మహిళల స్వర్ణాన్ని ఎలిస్ ఆండ్రూస్ (న్యూజిలాండ్) సొంతం చేసుకొంది. లియా ఫ్రెడ్రిస్ (జర్మనీ) రజతం, ఎమ్మా ఫినుకెన్ (జర్మనీ) కాంస్యం దక్కించుకొన్నారు. మహిళల ఓమ్నియమ్ పాయింట్ల రేస్‌లో జెన్నిఫర్ వాలెంటీ (అమెరికా) పసిడి నెగ్గగా.. డారియా పికులిక్ (పోలెండ్), అల్లీ వాలస్టన్ (న్యూజిలాండ్) రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకొన్నారు. పురుషుల కీరెన్ ఈవెంట్‌లో హ్యారీ లెవెర్సన్ (నెదర్లాండ్స్) స్వర్ణాన్ని సాధించగా.. ఆస్ట్రేలియా అథ్లెట్లు రిచర్డ్‌సన్, గ్లేట్జర్‌లు రజత, కాంస్య పతకాలు దక్కించుకొన్నారు.



ఇటలీకి వాలీబాల్ స్వర్ణం

డిఫెండింగ్ చాంప్ అమెరికాను ఓడించిన ఇటలీ మహిళల వాలీబాల్ స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఫైనల్లో ఇటలీ 3-0తో అమెరికాను చిత్తు చేసింది. బ్రెజిల్ 3-1తో టర్కీపై గెలిచి కాంస్యం సాధించింది.

సెర్బియాకు పసిడి


వాటర్ పోలో స్వర్ణాన్ని సెర్బియా పురుషుల జట్టు గెలుచుకొంది. ఫైనల్లో సెర్బియా 13-11తో క్రొయేషియాపై గెలిచింది. కాంస్య పోరులో అమెరికా 15-8తో హంగేరిపై నెగ్గింది.



జమైకా జోరుకు గండి

పారిస్: ఒలింపిక్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లు ప్రత్యేక ఆకర్షణ. ఇక, ట్రాక్‌పై జమైకా స్ప్రింటర్లదే హవా. అయితే, ఇదంతా పారిస్ ఒలింపిక్స్‌కు ముందు. గత నాలుగు ఒలింపిక్స్‌లో మహిళల 100 మీటర్లలో అందుబాటులో ఉన్న 12 పతకాల్లో పది మెడల్స్ జమైకావే. ఇక, టోక్యో క్రీడల్లో అయితే క్లీన్ స్వీప్ చేశారు. గత ఐదు 200 మీటర్ల ఈవెంట్లలో అమెరికా నుంచి గట్టిపోటీ ఎదురైనా జమైకా అథ్లెట్లు నాలుగు నెగ్గారు. కానీ, 2024 ఒలింపిక్స్‌కు వచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. రియోలో 11 పతకాలు, టోక్యోలో 9 మెడల్స్ సాధించిన జమైకా.. పారిస్‌లో మాత్రం ఆరు పతకాలతో సరిపెట్టుకొంది. ఎలేనా థాంప్సన్ హెరా, షెల్లీ అన్ ఫ్రేజర్ ప్రైస్, జాక్సన్‌లు గాయాలు, తదితర కారణాలతో వైదొలగడం జమైకా ఆధిపత్యానికి గండికొట్టింది. ఒక్క జమైకా అథ్లెట్ కూడా పోడియం ఫినిష్ చేయలేకపోవడం 1988 తర్వాత ఇదే తొలిసారి. 4X400 రిలేలో పూర్తిగా చేతులెత్తేశారు. పురుషుల విషయానికొస్తే కిషేన్ థాంప్సన్ వెంట్రుక వాసిలో 100 మీటర్ల స్వర్ణాన్ని కోల్పోయాడు. 110 మీ. హర్డిల్స్‌లో రషీద్ బ్రాడ్‌బెల్ కాంస్యం సాధించగా.. 4X100 రిలే జట్టు ఫైనల్ కూడా అర్హత సాధించలేకపోయింది. అయితే, డిస్కస్ త్రోలో రోజ్ స్టొనా, షాట్‌పుట్‌లో క్యాంప్‌బెల్ తొలిసారి పతకాలు అందించడం కొంత ఊరటనిచ్చే అంశం.

శభాష్ సిఫాన్



- నెదర్లాండ్స్ అథ్లెట్‌కు మహిళల మారథాన్ స్వర్ణం
- ఒలింపిక్ రికార్డుతో కైవసం
- ఇప్పటికే 5, 10వేల మీ.లలో కాంస్యాలు

పారిస్: ఒక ఒలింపిక్స్‌లో ఒక పతకం గెలవడమే కష్టం. అందునా సుదీర్ఘ పరుగులైన ఐదు, పది వేల మీటర్లతోపాటు వీటికంటే ఇంకా సంక్లిష్టమైన మారథాన్‌లోనూ మెడల్ అందుకోవడం ఆషామాషీకాదు. కానీ అలాంటి ఘనత సాధించింది నెదర్లాండ్స్ రన్నర్ సిఫాన్ హసన్. పారిస్ క్రీడల్లో ఇప్పటికే మహిళల ఐదు, పదివేల మీటర్ల పరుగులో కాంస్య పతకాలు దక్కించుకొన్న ఆమె..ఆఖరి ఈవెంట్ మారథాన్‌లో ఏకంగా పసిడి పతకం కొల్లగొట్టి అబ్బురపరిచింది. ఆదివారం జరిగిన మారథాన్ రేస్‌ను రెండు గంటల 22 నిమిషాల 55 సెకన్ల కొత్త ఒలింపిక్ రికార్డు సమయంతో పూర్తి చేసిన సిఫాన్ టాప్‌లో నిలిచింది. కాగా..చెక్ రిపబ్లిక్‌కు చెందిన దిగ్గజ అథ్లెట్ ఎమిల్ జటోపెక్ (1952 హెల్సింకీ గేమ్స్) తర్వాత ఇలా మూడు సుదీర్ఘ విభాగ పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్న తొలి ప్లేయర్‌గా సిఫాన్ రికార్డుల కెక్కింది. వాస్తవంగా పారిస్‌లో ఈ మూడు విభాగాలతోపాటు 1500 మీ. పరుగులోనూ బరిలో దిగాలని సిఫాన్ తొలుత భావించినా..తర్వాత వద్దనుకుంది. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో హసన్ ఐదు, 10వేల మీటర్లలో స్వర్ణాలతోపాటు 1500 మీ.లలో కాంస్య పతకం తన ఖాతాలో వేసుకుంది.

'హై'వోల్టేజ్ జంప్

జంప్ ఆఫ్‌లో కివీస్‌కు స్వర్ణం



సెయింట్ డెనిస్ (పారిస్) : పారిస్ ఒలింపిక్స్ పురుషుల హైజంప్ ఫైనల్ హోరాహోరీగా సాగింది. నిర్ణీత మూడు ప్రయత్నాలు ముగిసే సరికి న్యూజిలాండ్‌కు చెందిన హామిష్ కెర్, అమెరికా జంపర్ మెక్‌ఎవెన్ షెల్బీ ఇద్దరూ సమంగా 2.36 మీ. లంఘించారు. దాంతో విజేతను తేల్చేందుకు జంప్ ఆఫ్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. మొదటి రౌండ్ జంప్ ఆఫ్‌లో కెర్, మెక్‌ఎవెన్ 2.38 మీ. దూరానికి యత్నించి ఫెయిలయ్యారు. ఆపై 2.36 మీ.లను కూడా వారు లంఘించలేకపోయారు. చివరకు 2.34 మీ. దూరాన్ని 27 ఏళ్ల కెర్ లంఘించి స్వర్ణం దక్కించుకోగా, మెక్‌ఎవెన్ మిస్సయి రజతంతో సరిపెట్టుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ ముతాజ్ బార్షిమ్ (ఖతార్) కాంస్య పతకం సాధించాడు. వాస్తవంగా..నిర్ణీత ప్రయత్నాలు ముగిసే సరికి ఇద్దరు జంపర్లు సమంగా ఉంటే..పరస్పర అంగీకారంతో ఇద్దరూ స్వర్ణ పతకాన్ని సంయుక్తంగా అందుకోవచ్చు. టోక్యో ఒలింపిక్స్ హైజంప్ ఫైనల్లో ఇలానే జరిగింది. కానీ ఈసారి సంయుక్తంగా స్వర్ణాలు అందుకునేందుకు షెల్బీ నిరాకరించాడు. ఒకవేళ అతను అంగీకరించివుంటే అతనికి స్వర్ణం వచ్చేది..మరోవైపు అమెరికా పసిడి పతకాల సంఖ్య 41కి పెరిగి..చైనాను దాటేసివుండేది.




16 ఏళ్ల చిన్నోడికి రికార్డు స్వర్ణం

పారిస్: ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో స్వర్ణం సాధించిన పిన్న వయసు అమెరికా అథ్లెట్‌గా 16 ఏళ్ల క్విన్సీ విల్సన్ రికార్డులకెక్కాడు. 4 X400 రిలేలో అమెరికా పసిడి పతకం నెగ్గింది. తొలి రౌండ్‌లో ఫస్ట్ లెగ్‌లో పాల్గొన్న విల్సన్‌కు ఫైనల్లో పరిగెత్తే అవకాశం దక్కలేదు. కానీ, జట్టు సభ్యుడిగా అతడికి కూడా బంగారు పతకం లభించింది.

www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 135
సోమవారం | 12-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాబోయే అల్లుడు ఆరడుగులు ఉంటాడనుకున్నా!

5.55 అడుగుల సచిన్‌ను చూసి ఆశ్చర్యపోయా
మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా అని చెప్పాడు
అప్పటికి అతడికి 19 ఏళ్లే.. రెండేళ్లు ఆగమన్నాం..
ఈ వ్యవధిలో మా ఇంటికి తరచూ వచ్చేవాడు
మీడియా అంతా అంజలి ఫొటో కోసం వెతికింది
క్రికెట్ దిగ్గజం సచిన్ అత్త అనాబెల్ మెహతా!



'మై పాసేజ్ టు ఇండియా' పుస్తకంలో ఆసక్తికర అంశాలు
10

₹ 31,532 కోట్లు

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు.. 30,750 కొత్త ఉద్యోగాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం



అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో డ్రైవర్ రహిత కారులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఫ్యూచర్ సిటీకి పారిశ్రామికవేత్తల మద్దతు లభించిందని వెల్లడి.. దక్షిణ కొరియాకు బయల్దేరిన సీఎం

అమెరికాకు సరికొత్త తెలంగాణ పరిచయం చేశాం.. పెట్టుబడుల వెల్లువతో అపార ఉద్యోగావకాశాలు: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం చేపట్టిన విదేశీ పర్యటన విజయవంతంగా సాగుతోంది. పది రోజుల ప్రణాళికలో భాగంగా ఏడు రోజుల పాటు అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి.. ఆదివారం దక్షిణ కొరియాకు పయనమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన భారీ అమెరికా కంపెనీలు ముందుకొచ్చాయి. 19 అంతర్జాతీయ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అంగీకారం తెలిపాయి. రూ.31,532 కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తద్వారా 30,750 ఉద్యోగాలు రానున్నాయి. అమెరికా వేదికగా సీఎం రేవంత్ తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా ప్రకటించడం, హైదరాబాద్‌లో నాలుగో నగరం అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంచుకున్న వివిధ ప్రాజెక్టులను వివరించడంపై మంచి స్పందన లభించింది. కాగా, అమెరికా పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలో పేరొందిన కంపెనీలతో సంప్రదింపులు, చర్చలతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త భాగస్వామ్యానికి నాంది పలికిందన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ నుంచి ఫ్యూచర్ సిటీ నిర్మించేందుకు తమ సర్కారు ఎంచుకున్న ప్రణాళికలకు అమెరికా పారిశ్రామికవేత్తల నుంచి భారీ మద్దతు లభించిందని పేర్కొన్నారు. తెలంగాణ లక్ష్యాలకు

మిగతా 11వ పేజీలో...

హైదరాబాద్‌లో అమెజాన్ 4వ డేటా సెంటర్!

పెట్టుబడులను మరింత విస్తరిస్తాం
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో చర్చల అనంతరం సంస్థ వెల్లడి
తెలంగాణ సర్కారు 'డిజిటల్' లక్ష్యాల సాధనకు సహకరిస్తాం
మా సంస్థ వృద్ధి వ్యూహంలో హైదరాబాద్ విడదీయలేని భాగం
అమెజాన్ ఉపాధ్యక్షుడు కెర్రీ పర్సన్
11



జేపీసీ ఏర్పాటు చేసి నిగ్గు తేల్చాలి!

సెబి చైర్‌పర్సన్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణల మీద దర్యాప్తు జరపాలి
మాధవి రాజీనామా చేయాలి: విపక్షాలు
సుప్రీం సుమోటోగా స్వీకరించాలి: ఖర్గే
సెబి విశ్వసనీయతకు భంగం: రాహుల్
తక్షణం దర్యాప్తు జరిపించాలి: ఏచూరి
ఆర్థిక వ్యవస్థల హైజాక్: ఆర్జేడీ
ఇదంతా విదేశీ కుట్ర.. విపక్షాలు వారికి సహకరిస్తున్నాయి: బీజేపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 11: సెబీ చైర్‌పర్సన్ మాధవి బుచ్, ఆమె భర్త ధావల్ బుచ్‌కు విదేశాల్లో ఉన్న అదానీ కంపెనీల్లో వాటాలు ఉన్నాయంటూ అమెరికా షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ తాజాగా చేసిన ఆరోపణలపై దర్యాప్తునకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని (జేపీసీ) ఏర్పాటు చేయాలని విపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. స్వయంగా తన మీదే ఆరోపణలు వచ్చినందున మాధవి సెబీ చైర్‌పర్సన్ పదవి నుంచి వైదొలగాలని పేర్కొన్నాయి. ఈ భారీ

మిగతా 10వ పేజీలో...

ఆరోపణలు పచ్చి అబద్ధాలు

మా ఆర్థిక వ్యవహారాలు తెరిచిన పుస్తకం
అదానీ గ్రూప్‌లో పెట్టుబడుల్లేవ్: సెబీ చీఫ్
10

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయింది

డ్యామ్‌లో 19వ గేటు ఎత్తుతుండగా తెగిన చైన్‌లింక్
వరదలో గేటు గల్లంతు.. ఇప్పటికిప్పుడు మరమ్మతు కష్టం
నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే కొత్త గేటు అమర్చే చాన్స్
దిగువకు 65 టీఎంసీలు.. ఇప్పటికే నిండుగా శ్రీశైలం, సాగర్
పులిచింతల, ప్రకాశం కూడా.. వచ్చే నీరు సముద్రంలోకే!



తుంగభద్ర డ్యామ్‌లో క్రస్ట్ గేటు కొట్టుకుపోయింది ఇక్కడే.. (వృత్తంలో)

బెంగళూరు/బళ్లారి/నాగార్జునసాగర్/కర్నూలు/మహబూబ్‌నగర్/అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు సాగు, తాగునీటి ప్రదాయిని అయిన తుంగభద్ర డ్యామ్ గేటు వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది! శనివారం రాత్రి డ్యామ్ 19వ గేటును ఎత్తుతుండగా చైన్‌లింక్ తెగిపోవడమే ఇందుకు కారణం. ఆ గేటు వద్ద వరద ప్రవాహ ఉధృతి పెరిగి ప్రాజెక్టుకు మరింత ప్రమాదం వాటిల్లకుండా

మిగతా 12వ పేజీలో...

సాగర్ క్రస్ట్ గేట్లు భద్రమేనా?

తుంగభద్ర ఘటనతో అనుమానాలు
రెండేళ్ల కిందట మొరాయించిన ఒకటో నంబరు గేటు
వరదలప్పుడే మరమ్మతులు
మామూలు రోజుల్లో నిర్లక్ష్యం
12

వసతి గృహ హింస

అద్దె భవనాలు.. అధ్వానంగా సౌకర్యాలు



సిద్దిపేట జిల్లాలోని చేర్యాల గురుకులంలో తలుపులు లేని మరుగుదొడ్లు

కలుషిత ఆహారంతో పదే పదే అస్వస్థతకు గురవుతున్న విద్యార్థులు
ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు..
పాము కాట్లతో పిల్లల మృతి
దోమల బెడదతో జ్వరాలు..
ఎలుకలు కొరికి అస్వస్థత
ఇరుకు గదుల్లోనే తరగతులు..
అక్కడే పడకలు కూడా
కార్పెట్లు, చద్దర్లు లేవు..
మూడు జతల దుస్తులూ ఇవ్వలే
శాశ్వత భవనాలు నిర్మిస్తేనే సమస్యలకు పరిష్కారం

కలుషిత ఆహారంతో విద్యార్థుల అస్వస్థత.. పాము కాటుకు విద్యార్థి మృతి.. డెంగీ జ్వరంతో విద్యార్థి దుర్మరణం! ఇటీవలి కాలంలో పెరిగిన కథనాలు ఇవి! మరీ ముఖ్యంగా గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు! ఈ నేపథ్యంలోనే, 'ఆంధ్రజ్యోతి' గురుకులాల విజిట్ చేపట్టింది! అక్కడి పరిస్థితులు గమనించింది! వివరాలివీ..!



యాదాద్రి జిల్లా కేంద్రంలో గురుకుల స్కూల్ పైకప్పు ఇలా..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

గురుకులాలు సమస్యల నిలయాలుగా మారాయి. సొంత భవనాలున్న గురుకులాల్లో సమస్యలు కొంత తక్కువగా ఉన్నా.. అద్దె భవనాల్లో నడుస్తున్న వాటిలో మాత్రం తిష్ట వేసుకుని కూర్చున్నాయి. కొన్నిచోట్ల సరిపడ తరగతి గదుల్లేవు. పడకల్లేవు. నేలపైనే పడుకుంటున్నారు. ఆరుబయటే భోజనం చేయాల్సిన పరిస్థితి. కొన్నిచోట్ల ఆహారం సరిగా లేకపోవడంతో విద్యార్థులు సగం కూడా తినకుండా వదిలేస్తున్నారు. గురుకులాలు మొదలై రెండు నెలలైనా కార్పెట్లు, చద్దర్లు ఇవ్వలేదు. మూడు జతల దుస్తులు ఇవ్వలేదు. మరికొన్నిచోట్ల చుట్టూ ప్రహరీ

మిగతా 11వ పేజీలో...

ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థి పేరు రాజేశ్. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగైదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. అయినా పాఠశాలలోనే చికిత్స చేస్తున్నారు. దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నట్లు చెబుతున్నాడు.



సంగారెడ్డిలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో కిటికీకి సంచుల తెర



మూడు జిల్లాల్లో 4200 ఎకరాలు!

గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లకు మెదక్, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో భూసేకరణ
ఇప్పటికే భూముల గుర్తింపు పూర్తి
ఏడాదిలోపు సేకరణకు ప్రభుత్వ ప్రణాళిక
ముచ్చర్లలో 1500 ఎకరాల్లో మరో క్లస్టర్

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల ఏర్పాటు ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి, భూసేకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం అంతర్జాతీయ ఫార్మా కంపెనీలతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తోంది. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో ప్రభుత్వం ప్రతిపాదించిన 10 ఫార్మా క్లస్టర్లు అంతర్జాతీయ విమానాశ్రయానికి 60 కిమీల లోపే ఉన్నాయని, పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూలమని చెబుతోంది. ప్రభుత్వ ప్రతిపాదనలకు ఆయా కంపెనీలు కూడా సానుకూలంగా స్పందిస్తు



న్నాయి. దీంతో సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే వికారాబాద్ జిల్లాలో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. మెదక్, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో కలిపి మొత్తం 4203 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కూడా త్వరలో ప్రారంభం కానుంది. మొత్తం పది క్లస్టర్లలో భూసేకరణ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి

మిగతా 9వ పేజీలో...

ఐదేళ్లలో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతలే లక్ష్యం
'సీతారామ'తో ఖమ్మం సస్యశ్యామలం
15న సీఎం రేవంత్ చేత ప్రాజెక్టు ప్రారంభం
సీతారామ ట్రయల్ రన్ ప్రారంభంలో ఉత్తమ్
12

రైలు పట్టాలపై ఘోరం

రైలు ఢీకొని ఇద్దరు కూతుళ్లతో సహా రైల్వే ట్రాక్‌మెన్ మృతి
భర్త, కన్నబిడ్డలను క్షణాల్లో కోల్పోయిన భార్య
మేడ్చల్‌లోని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో దుర్ఘటన
11

జ్వర స్వైర విహారం

3000కు దగ్గర్లో డెంగీ కేసులు
6500 టైఫాయిడ్ కేసులు

రాష్ట్రంలో విజృంభిస్తున్న విష జ్వరాలు, డెంగీ, మలేరియా.. ఏజెన్సీ జిల్లాల్లో ఎక్కువ.. ఇంటికి ఒకరిద్దరు బాధితులు



ఉమ్మడి ఖమ్మంలోని ఉల్వనూరులో జ్వరంతో మంచం పట్టిన వృద్ధి

దోమల బెడద తీవ్రం.. ఫాగింగ్ లేనే లేదు
ప్రభుత్వాస్పత్రులకు పోటెత్తుతున్న రోగులు
పడకలు దొరకని దైన్యం.. ఇళ్లవద్దే చికిత్స
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులూ కరువు
ఆసిఫాబాద్ జిల్లాలో జ్వరంతో ఇద్దరి మృతి
ఇబ్రహీంపట్నంలో 8 నెలల శిశువు కూడా..
వైద్యుల నిర్లక్ష్యంతోనేనన్న కుటుంబ సభ్యులు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం బుస్సారాయిలో 18 నెలల పాప మలేరియాతో బాధపడుతూ గత నెల 20న ప్రాణాలు విడిచింది. చిన్నారి ఐదారు రోజుల పాటు తీవ్ర జ్వరంతో బాధపడితే తల్లిదండ్రులు సమీప ఉల్వనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళితే, రామవరం మాతాశిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు రిఫర్ చేశారు. వారేమో వరంగల్ ఎంజీఎమ్‌కు తీసుకెళ్లాలని చెప్పారు. అక్కడ చేరిన నాలుగు రోజులకు పాప చనిపోయింది. మలేరియాతోనే పాప

మిగతా 9వ పేజీలో...

బొమ్మలు: అక్బర్

నవలా శిల్పం

తెలుగు వచన సాహిత్యం గత రెండు దశాబ్దాలుగా కథా ప్రక్రియ చుట్టూనే తిరుగుతున్నప్పటికీ, కొందరు రచయితలు ప్రత్యేకంగా నవల మీద కూడా కృషి చేస్తున్నారు. వారి చేత నవలా రచనలో ఉండే ఆర్ట్ క్రాఫ్ట్ అంశాలపై మాట్లాడించేందుకు ఉద్దేశించినదే ఈ 'నవలా శిల్పం' శీర్షిక. – వివిధ

గొప్ప నవలలు రాసినట్టుండవు. పుట్టినట్టు ఉంటాయి.

– మధురాంతకం నరేంద్ర



"శాస్త్రవేత్తలు, చరిత్రకారుల వద్ద లేని ఆయుధాలు సాహిత్యకారుల వద్ద ఉన్నాయి. అవి సృజనాత్మక ఆయుధాలు. అందుకే శాస్త్రవేత్తలు, చరిత్రకారులు చేయలేని పనిని వాళ్ళు సమర్థవంతంగా చేయగలరు. తమ రచనల ద్వారా జీవన సత్యాల్ని చెప్పగలరు" అంటారు మధురాంతకం నరేంద్ర. ఐదు దశాబ్దాల సాహితీ ప్రయాణంలో కథలు, నవలలు, నాటికలు, వ్యాసాలను సృజించారు. రచయిత కన్నా రచన గొప్పదనే సూత్రాన్ని పాటిస్తూ సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. ఇది ఆయన నవలా రచన గురించి జరిపిన సంభాషణ.

ఇన్నేళ్ల సాహితీ ప్రయాణంలో పదుల సంఖ్యలో కథలు రాశారు. నవలలు మాత్రం ఆరే రాశారు. కారణం?

సాహితీ ప్రక్రియల్లో కథ, నవల అక్కచెల్లెళ్ళ లాంటివి. అయితే రెండింటికీ చాలా భేదం ఉంది. 50 ఏళ్లలో 100 దాకా కథలు రాశాను. నవలలు తక్కువ రాయడానికి కారణం సమయం లేకపోవడం. నవల రాయాలంటే రాసే అంశం గురించి చాలా తెలుసుకోవాలి. చాలా ఫోకస్డ్‌గా ఉండాలి. ఆ పాత్రలతోపాటు ప్రయాణించాలి. మమేకం కావాలి. ఇదంతా కుదిరినప్పుడే నవలా రచన ముందుకు సాగుతుంది. కొన్ని రచనలు యాక్సిడెంటల్‌గా జరుగుతాయి. 'మనోధర్మపరాగం' అలాంటిదే! ఆ నవల రాయడానికి ఆరునెలల ముందు అలాంటి నవలను రాయగలనని నాకూ తెలియదు. ఆ నవల రాయడానికి నాకు ఏడాది పట్టింది. ఆ సమయంలో పరిశోధన ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. అంతేగాదు, నాదైన జీవితంలోంచీ, మా ప్రాంతాన్ని గురించీ విషయాల్ని తోడి తీసుకోగలిగాను. కొత్త కొత్త వివరాలు తెలిసినప్పుడు చాలా ఆనందపడ్డాను. నవలలోని 30 అపురూపమైన స్త్రీ పాత్రలతో అంతకాలం కలిసి జీవించడమనే అవకాశాన్ని పొందాను.

నవల, కథ.. రెండింటిలో ఏది రాయడంలో మీకు సంతృప్తి?

నవలైనా, కథైనా జీవితం కరుణిస్తేనే రాయగలం. జీవితం ముందు మనమెంత? నాకు కథ రాయడం శ్రమ. రాసేసిన తర్వాత గొప్ప రిలీఫ్ దొరుకుతుంది. నవల రాసేటప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. నవల రాస్తున్నంతసేపూ విశాల మైదానంలో అరేబియన్ గుర్రం ఎక్కి దౌడు తీసినట్టుగా ఉంటుంది. అయితే ఆ గుర్రం పక్కదారులు పట్టకుండా సరైన దారిలో ప్రయాణించేలా చూసుకోవడం రచయిత పని. రచయిత ప్రాథమిక బాధ్యత కథ చెప్పడం. కథ సరిగ్గా చెప్తున్నామా, ఎక్కడైనా దారి తప్పుతోందా అనే స్పృహ రచయితకు ఉండాలి.

మీరు రాసిన 'ఘూచక్రం' 'కొండకింద కొత్తూరు' లాంటి నవలల్లో అంశాలు సార్వజనీనమైనవి, కథ మాత్రం చిత్తూరు జిల్లాలోనే నడుస్తుంది. ఎందుకలా?

అదేమీ కొత్త విషయం కాదు. అనేకమంది రచయితలు చేసిందే! ప్రపంచంలోని ప్రతి రచయితా ప్రాంతీయ రచయితే. టాల్‌స్టాయ్, దోస్తోవ్‌స్కీ, హెమ్మింగ్వే లాంటి వాళ్ల రచనల్లోకూడా వాళ్ల ప్రాంతీయతే కనిపిస్తుంది. ఆ రచనలే విశ్వవ్యాప్తం అవుతాయి. సృజనాత్మక రచయితకు ప్రాంతీయత బలం. Provincialism is a Strength to Writer.

గొప్ప నవల ఎలా ఉండాలని మీ అభిప్రాయం?

నేను చదివిన గొప్ప నవలలన్నీ రాసినట్టుండవు. పుట్టినట్టు ఉంటాయి. శరత్ నవలలు ఇందుకు మంచి ఉదాహరణ. ఆయన ఏ రచనా నిరుపయోగంగా రాయలేదు. తెన్నేటి సూరి రాసిన 'చంఘీజ్‌ఖాన్', వడ్డెర చండీదాస్ 'హిమజ్వాల', చలం 'జీవితాదర్శం', కేశవరెడ్డి 'మూగవాని పిల్లనగ్రోవి' నవలలు రాసినట్టు ఉండవు, పుట్టినట్టు అనిపిస్తాయి. గొప్ప క్లాసిక్‌గా మిగిలే పుస్తకాలు ఒక మీడియంగా మారి, మనల్ని మనం పరిశీలించుకునేందుకు ఉపయోగపడతాయి. ఒక్కోసారి గొప్ప నవల రాసేసిన రచయిత ఆ తర్వాత మళ్లీ అంత స్థాయిలో రాయలేక ఇబ్బంది పడే అవకాశం కూడా ఉంది. William Golding అనే రచయిత 'Lord of the Flies' అనే నవల రాశారు. అది ఆయన తొలి నవల. దానికే ఆయనకు నోబెల్ బహుమానం వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో మరో నవల రాయలేక ఆయన చాలా ఇబ్బందిపడ్డారు.

ఇటీవల విడుదలైన మీ నవల 'దాయాదుల తోట'కు నేపథ్యం ఏమిటి?

నేను పుట్టి పెరిగిన ప్రాంతంలోని సామాజిక జీవనం గురించి చెప్పాలని ఒక కథ రాశాను. చెప్పవలసిన అంశాలు కథలో ఇమడకపోవడంతో దాన్ని విస్తృతం చేయవలసి వచ్చింది. ముందుగా సర్వసాక్షి కోణంలో నవల రాశాను. పూర్తయ్యాక చదివితే వస్తువిస్తృతి పెరిగిపోయి కొంత కలగాపులగంగా కూడా తోచింది. ఆ తర్వాత మళ్లీ మొత్తం భిన్నమైన దృక్కోణంలో తిరగరాశాను. నవలలో మొత్తం 10 పాత్రలు. ఎవరి కథ వాళ్ళు చెప్పుకుంటారు.



నాకు కథ రాయడం శ్రమ. రాసేసిన తర్వాత గొప్ప రిలీఫ్ దొరుకుతుంది. నవల రాసేటప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. నవల రాస్తున్నంతసేపూ విశాల మైదానంలో అరేబియన్ గుర్రం ఎక్కి దౌడు తీసినట్టుగా ఉంటుంది.

ఈ నవలలో మీ ప్రాంతంతోపాటు ఇంకా చాలా ప్రాంతాలు వస్తాయి కదా?

నవలలో ఒక ప్రాంతం గురించే రాయాలనుకున్నాను. చిత్తూరు జిల్లా గురించీ, తొండనాడు గురించీ. తిరుపతి గురించి రాయాలంటే చుట్టుపక్కల ప్రాంతాల గురించి రాయాలి. ఇక్కడుండే వారికి మిగిలిన ప్రాంతాలతో తప్పకుండా సంబంధం ఉంటుంది. ముఖ్యంగా కడప జిల్లాతో. అలా నవలలోకి కడప వచ్చింది. ఆ తర్వాత అనంతపురం, కర్నూలు వచ్చాయి. కర్నూలు దాకా వచ్చిన కథ హైదరాబాదును కూడా చేరింది. ఇటువైపు చెన్నై, తిరువణ్ణామలై, బెంగళూరు, హోసూరు ప్రాంతాలు కూడా నవలలోకి వచ్చేశాయి.

తెలుగు సాహితీ విమర్శ గురించి మీ అభిప్రాయం?

Objective Study అనేది లేకపోతే రచయితలకు చాలా ప్రమాదం. విమర్శ అంటే కేవలం తిట్టడం, పొగడటం కాదు, ఒక రచనను విమర్శనాత్మకంగా చూడటం. రవీంద్రనాథ్ ఠాగూర్‌ని విశ్వకవి అంటే సరిపోదు. ఆయన కథకుడిగా, నాటక రచయితగా చాలా గొప్పవాడు. ఆయన రచనలు చదివి ఆ విషయం చెప్పాలి. విదేశాల్లో కొందరు ప్రముఖ రచయితలు బతికుండగానే వాళ్ల రచనల మీద '20th Century Interpretations' అంటూ పుస్తకాలు వచ్చాయి. అక్కడి విమర్శకులు రచయితల్ని పూజించే పీఠంపైన కూర్చోబెట్టరు. వీలైనంతగా వారి రచనల్ని విమర్శించి, మరింత మెరుగ్గా మార్చేందుకు ప్రయత్నిస్తారు. మన దగ్గర అలాంటి సాధన జరగాలి. రచయిత తనకు తెలిసిన సత్యాన్ని రచన ద్వారా ధైర్యంగాచెప్పాలి. ఏమాత్రం మొహమాటం లేకుండా విమర్శను స్వీకరించాలి. దానికి తొందరపడి సమాధానం ఇచ్చేయకుండా స్థిమితంగా ఆలోచించాలి.

కొత్తగా రాస్తున్నవారు మెరుగ్గా రాయాలంటే?

బాగా చదవాలి. అదే అతి ముఖ్యమైన విషయం. సాగుతున్న జీవితాన్ని అప్రమత్తతో గమనిస్తూ ఉండాలి. సాహిత్యంలో పెద్ద ప్రమాదం ఏంటంటే, చదవకుండా మాట్లాడటం. ఏ రచనన్నైనా ఓపెన్ మైండ్‌తో చదవాలి. చదవకముందే ఏ అభిప్రాయానికీ రాకూడదు. కొన్ని నవలలు ఒక వయసులో అర్థం కావు. మరికొన్ని ఒక వయసు దాటాక అర్థమవుతాయి. మంచి పుస్తకం పాఠకుడి పరిపక్వతను కొలిచే సాధనం. ఒకే పాఠకుడికి అది వివిధ దశల్లో వేర్వేరు రకాలుగా అర్థమవుతుంది.

ఇంటర్వ్యూ: ■ విశీ (వి. సాయివంశీ)

✆ 9010866078

మాయమైన బ్రతుకులు

అట్టుగ దులుపుతున్నప్పుడు
పాతబడిపోయిన..
నాగలి, నక్క, కత్తి, పార కనబడి
గతం గుర్తుకొస్తుంది
ఒకప్పుడు మేమూ రైతులమేనని..

త్రోవంట వెళ్తున్నప్పుడు
ఎక్కడో దూరాన పొలంలో
పిల్ల జల్లా శ్రమైక్య సౌందర్యంతో కనబడి
గతం కళ్ళముందు మెదలాడుతుంది
ఒకప్పుడు మేమూ ఇంతేనని

ఒక్కోసారి టీవీలో, ఏదో ఒక సినిమాలో
పచ్చని పొలాలు, పట్టెడు సంసారం చూపిస్తే
ఉన్నపళంగా ఉసురుమనిపిస్తుంది
ఇదంతా మా నుండి
ఎప్పుడు లాక్కుపోయారోనని

కడుపు కాలి షాపింగ్ మాల్‌కు వెళ్తే
అక్కడ కనిపిస్తుంది..
మోసపోయింది ఇక్కడేనని!
మాయమైనవన్నీ మార్కెట్లో బందీ అని!

■ వినోద్ కుత్తుం

✆ 9634314502

చదువు ముచ్చట

■ ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి

చదివినవే మళ్ళీ మళ్ళీ చదువుతూ వుంటాను

ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

ఇటీవలి కాలంలో రకరకాల పుస్తకాలు చదువుతూవున్నాను. వాటిలో, తాడి ప్రకాష్ 'ఏలూరు రోడ్' నాకు బాగా నచ్చింది. ఇందులో నాకు నచ్చిన విషయాలు, ప్రకాష్ వచనం చదువరులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఈ పుస్తకశీర్షిక, విజయవాడతో పాటు ఏలూరుని కూడా స్ఫురణకు తెస్తుంది. ఈ రెండు ప్రాంతాలతో నాకు అనుబంధం వుండటం రెండో ఆకర్షణ. ఏలూరు నా స్వస్థలం. విజయవాడ నేను కోరిసాధించిన మజిలీ. ఏలూర్ రోడ్, ఒక తరానికి చెందిన చరిత్ర గమనాన్ని సూక్ష్మంగా పట్టి ఇస్తుంది. చరిత్ర అధ్యాపకురాలిగా, ఆ కోణంలో కూడా ఏలూర్ రోడ్ పుస్తకం నాకు బాగా నచ్చింది.




బాల్యంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

స్కూల్‌లో చేరకముందు, గురజాడ పుత్తడిబొమ్మా పూర్ణమ్మ విని నేర్చుకున్నాను. రెండో తరగతి పూర్తి అయేపాటికి మా నాన్నగారు చదవడం నేర్పించారు. మూడో తరగతి నుంచీ ఎక్కువ నిడివి వున్న కథలు చదవడం ప్రారంభించాను. నాలుగో తరగతిలో పిల్లల కోసం వచ్చే బుల్లి నవలలు చదివాను. ఎనిమిదో తరగతికి వస్తూనే సీరియస్ సాహిత్యం అంటుకుంది. బాలజ్యోతిలో, 'తీపి రొట్టెలు' అని ఒక కథ నాకు బాగా జ్ఞాపకం వున్న నా మొదటి పెద్ద పఠనం. బహుశా అది 1982-83 మధ్యకాలంలో ఏదో ఒక బాలజ్యోతి పుస్తకంలో ప్రచురితం అయింది. అరబ్ దేశ వ్యాపారి, ఒక అందమైన మంత్రగత్తె, ఆమె దగ్గర చెక్క పెట్టెలో చిన్నచిన్న బొమ్మలు రాత్రిపూట నేలని దున్ని క్షణాల్లో గోధుమలు పండించి రొట్టెలు చెయ్యడం, ఆ రొట్టెలు తిన్న వ్యాపారులు గుర్రాలుగా మారిపోవడం, ఇలా సాగే కథ అది. నాకు భలే అద్భుతంగా అనిపించింది. ఇప్పటికీ ఆ కథ నాకు నచ్చుతుంది. యవ్వనంలో చలం మ్యూజింగ్స్ నిత్య పారాయణ గ్రంథం!

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

నా పఠనాభిరుచి కాలంతోపాటు పెద్దగా మారలేదు. చదివినవే మళ్ళీ మళ్ళీ చదువుతూ వుంటాను. తీపి రొట్టెలు కథ ఎంజాయ్ చేసిన పాపతనమే ఇప్పటికీ వుంది. ఆర్కే. నారాయణ్ స్వామీ అండ్ హిస్ ఫ్రెండ్స్, నామిని మిట్టురోడి కథలు, ఖదీర్ పోలేరమ్మ బండలాంటి పిల్లలు ప్రధాన భూమిక పోషించే పుస్తకాలు ఎక్కువ నచ్చుతాయి. సీరియస్ లిటరేచర్ విషయంలో మొదటి నుంచీ క్లాసిక్స్ ఇష్టపడతాను.



"తాడి ప్రకాష్ 'ఏలూర్ రోడ్' ఒక తరానికి చెందిన చరిత్ర గమనాన్ని సూక్ష్మంగా పట్టి ఇస్తుంది."

మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?

చలం, కొడవటిగంటి కుటుంబరావు యవ్వనంలో నా ఆలోచనని ప్రభావితం చేశారు. మార్క్ ట్వైన్, ఆస్కార్ వైల్డ్ రచనల ద్వారా మనిషి స్వభావం, పరిమితుల గురించి సాక్షాత్కారం కలిగింది.

సాహిత్యంలో మీకు బాగా నచ్చిన పాత్ర ఏది? ఎందుకు?


హకల్ బెరిఫిన్ నాకు ఎప్పటికీ నచ్చే పాత్ర. తోటి మనిషిని ప్రేమించడం, ఘోర భీకర పరిస్థితులను సైతం ధైర్యంగా ఎదుర్కొని నిలబడటం, మూస మానవ ధోరణికి భిన్నంగా ఆలోచించడం హకల్ బెరిఫిన్ ప్రత్యేకతలు.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

టైం మెషీన్‌లో లేదా ఏ ఇతర విధంగానో వెనక్కివెళ్లి మాట్లాడే అవకాశం వస్తే, నేను బెంగాలీ రచయిత శరత్ చంద్రని కలవడానికి ఇష్టపడతాను. అలాంటి రచయిత ఎవరైనా దొరికితే, పెళ్లి చేసేసుకోవాలి అనుకునేదాన్ని చిన్నప్పుడు! సాధారణమైన మధ్యతరగతి కుటుంబ విషయాలని ఆయన ఎంతో ఆసక్తికరమైన కథల్లాగా మౌల్డ్ చేసేవారు. మానవ సంబంధాల గురించి అంత విస్తృతంగా రాయడానికి కావలసిన సరంజామా ఆయన ఎక్కడినుంచి సేకరించారో నాక్కూడా చెప్పమని అడుగుతాను. ప్రేమచంద్‌ను కూడా కలవాలి. ఆయన చేతులు ఒకసారి పట్టుకుని కళ్ళ కద్దుకుని దణ్ణం పెట్టుకోవాలి. ఆయన రచనలు, ఉదాహరణ నిర్మల లాంటివి చదివి ఆ వాతావరణంలోకి మానసికంగా వెళ్ళిపోయి, రెండు మూడు రోజులు తీవ్ర విచారంలో మునిగి పోయేదాన్ని; ఆయన హాస్య కథలు అంతే ఆనందం కలిగించాయి; రెండు పరస్పర విరుద్ధ భావావేశాలని ఒకే మనిషి ఒకే పెన్నుతో ఎలా సృష్టించారు అని అడిగి వచ్చేస్తాను.

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా, మీరు ఎప్పుడూ పాటించేది?

ప్రత్యేకంగా ఒక సలహా అని కాదు కానీ, పూర్వ రచనలు, మంచి సమకాలీన రచయితల నుంచి నేను నేర్చుకున్న కిటుకు, చెప్పే విషయం ఏదైనా, సులువైన పదాల్లో, చమత్కారంగా చెప్పాలి. గంభీరంగా వుండే వ్యక్తీకరణలు, వాక్యాలు చదివేవారి ఆసక్తిని చంపేస్తాయి. ■



సమయం

ఆ వెన్నెల రాత్రి ఆకాశంలో చుక్కల్లా
మా పొలంలో వడ్ల రాశి
చెట్లు ఆలకించే సమయం
అప్పుడు
మేము ఇలా పాటయ్యామ్

కురిసిన వానకు, నిండిన చెరువు
చేపల దాహం తీరాక
మిగిలిన నీళ్లే పంటకు ఉగ్గుపాలు

మెల్లగా వెన్నెల అందుకున్న చంద్రుడు
మా గుండెల్లా వెలుగుతున్నాడు
అటు ఇటు చెక్కర్లు కొట్టే పేరు తెలియని పక్షి
పొడుపు కథలా అరుస్తోంది
ఎక్కడో
జనక జనక జజ్జనక సవారీ దెబ్బ
మోగుతున్న తప్పెటకు
పాదం కింద సెగ
అప్పుడే మేం ఆటయ్యామ్

ఏ దుఃఖం
కల్లం వైపు రాలేదు
ఏ కష్టమూ లోపల కదలడం లేదు
ఏ సూచీకలు అంచనా కట్టలేని సంతోషం
మనిషి ఇట్టే ఉండాలి, మనసు ఇట్టే ఉండాలి

మాయలేదు, మరణం లేదు
ముసురుకునే చీకటి లేదు
అప్పుడు మేం
మనుషులవుతున్నాం

■ గోపాల్ సుంకర

✆ 94926 38547

మూడు ప్రశ్నలు

■ గూండ్ల వెంకటనారాయణ

యువ రచయితలపై సాహితీ పెద్దలు చాదస్తాన్ని రుద్దుతున్నారు అన్న అర్థంలో ఈమధ్య మీరు ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ రాశారు. ఏమిటి మీ దృష్టిలో ఈ చాదస్తం?

ఆ మాట అనటానికి కారణం వాళ్లింకా 50, 60ల్లోనే బతుకుతున్నారని నాకనిపించటం. ఎందుకంటే- మొదటగా వాళ్ళ కాలంలో శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు వంటి రచయితలు గొప్ప రచయితలుగా పేరు సంపాదించేశారు. వాళ్ళ టైమ్‌కి అందరి నోళ్లలో నానుతూ ఉన్నారు. దానివల్ల ఇప్పటి పెద్దవాళ్ళు అయిన అప్పటి పిల్లలు వాళ్ళనే చదివి తరించి వాళ్ళ జాడ్యం లోనే ఉన్నారు. ఆ జాడ్యం అంటువ్యాధిలా ఇప్పటి తరానికి కూడా అందిస్తున్నారు.

ఇప్పటి తరం ముఖ్యంగా ఎదుర్కొంటున్న విమర్శల్లో ఒకటి వాళ్ళు గత సాహిత్యాన్ని చదవటం లేదూ అన్నది. కానీ ఇప్పటి తరం ఏ గత సాహిత్యాన్ని చదవటం లేదనీ వీళ్ళ బాధ? వీళ్ళు ఎవరినైతే ఆరాధించారో వాళ్ళని ఈ తరం ఆరాధించటం లేదని. తర తరానికి సాహిత్య పద్ధతులు మారతాయి. ఆలోచనలు మారతాయి. వీళ్ళ మనసులో ఉన్న అసలు ఉద్దేశం ఏమిటంటే వీళ్ళ పుస్తకాలు చదివి, వీళ్ళని గురువులుగా భావించాలి అని. ఇంకప్పుడు సాహిత్యం మిగలదు. గురు శిష్యుల కోలాటం మాత్రమే ఉంటుంది. కొత్త తరం విమర్శ తీసుకోదూ అనే ఇంకో మాటను వింటూ ఉంటా. అసలు ముందు ఈ మాట వాడేవాళ్లు విమర్శ తీసుకుంటే కదా కొత్త తరం తీసుకునేదీ లేనిదీ!

ఇంకో సమస్య శైలీ, శిల్పం అనేవాటి గురించి. ఈ శైలీ, శిల్పం అంటే ఏమిటి? వల్లంపాటి కథాశిల్పం పుస్తకాన్ని ఫాలో కావటమా? లేకపోతే కథలు ఎలా రాస్తారనే ఇతర విశ్లేషణా పుస్తకాలని ఫాలో కావటమా? నేను ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ రాసిన 'రచయితా శిల్పమూ' అనే పుస్తకమూ, రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'నవల – ప్రజలు' అనే పుస్తకాలు చదివాను. అందులో రష్యన్, యూరోపియన్ సాహిత్యం గురించి మంచి విమర్శ ఉంటుంది. ఇవి కదా మనం మాట్లాడాల్సింది.

"వీళ్ళ పుస్తకాలు చదివి వీళ్ళను గురువులుగా భావించలన్న" ఉద్దేశం... ఇలాంటి వాతావరణం నిజంగా ఉన్నదా?

ఉన్నది. వివిధ ప్రాంతాల నుంచి, వివిధ కులాల నుంచి కొత్తగా రచయితలు రావటం మనం చూస్తున్నాం. అయితే ఇప్పుడు ఉన్న మన వాతావరణం వాళ్ళకి తప్పుడు అభిప్రాయాలను ఎక్కిస్తున్నది: 'యువ పురస్కారం', లేకపోతే ఏదైనా అవార్డు, లేదా పెద్ద సంకలనాలలో రచన రావటం... ఇవే ముఖ్యమైన విషయాలన్న భ్రమ కల్పిస్తున్నది. కొత్త తరం ఇలాంటి వాటికి స్టక్ అయిపోయి– వీటిని పొందాలంటే ఎవరో ఒకరి ఆశ్రయం కావాలి కాబట్టి, అందుకోసం అప్పటికే సాహిత్యంలో స్థిరపడినవాళ్ళ దగ్గరకు వెళ్తున్నారు. వారేమో ప్రోత్సహిస్తున్నాం అన్న పేరుతో కొత్తగా రచన చేస్తున్నవారిని వాళ్ళ భజనపరులుగా మార్చుకుంటున్నారు. అందరూ ఇలా చేయకపోవచ్చు. కానీ జరుగుతున్నది ఇదే. పెద్దవాళ్ళకి వాళ్ళ రచనలు చదివి పొగిడేవాళ్ళు కావాలి. ఈ కాలంలో అంత తీరిక ఎవరికుంది. అందుకని గ్రామ్ ఫోన్ రికార్డు లాంటి కొత్త తరం కావాలి. నేనేం అనుకుంటానంటే– రచయిత మొదట స్వతంత్రుడు అయ్యాక సాహిత్యం రాయాలి.

శిల్పం, శైలి... వీటిపై మీ మాటల్లో వ్యతిరేకత ఎందుకు వ్యక్తమవుతుంది?

ఒక రచన గురించి మాట్లాడుతూ ఉన్నప్పుడు ఏ కొలతల్లో పాత్ర చిత్రీకరణ ఉండాలి, ఏ కొలతల్లో వాతావరణ చిత్రణ ఉండాలి అన్నట్లు శైలీ శిల్పాల గురించి ప్రస్తావిస్తేనే నాకు నచ్చదు. మనమేమన్నా తూనికరాళ్లతో వ్యాపారం చేస్తున్నామా? ఈ శైలి, శిల్పం అనే వాటిని అర్థం చేసుకోవటానికి చాలా పుస్తకాలు చదివాను. కానీ అదేదో మిథ్‌లాగా నాకిప్పటికీ వీటి వ్యవహారం బోధపడలేదు.

నిజానికి కథ రాస్తున్నప్పుడు రచయిత మనసులో తను ఏ విషయం గురించి రాస్తున్నారో స్పష్టత ఉంటే చాలు. అది లేనప్పుడే ఈ గందరగోళం అంతా ఏర్పడుతుంది. నేనో వ్యక్తి గురించి రాసేటప్పుడు అతని జీవితం మొత్తం నాకు తెలిసిందై ఉండాలి. కాసేపు ఉండే పాత్రయినా... జీవితం నా చేతిలో ఉన్నాక కథ ఎలా ఏర్పడుతుందో తెలీకుండా ఉంటుందా!? శైలి, శిల్పం అనేవి పరిశోధక విద్యార్థులకీ, కథలు ఎలా రాయాలో నేర్పించాలి అనుకునేవాళ్లకి అవసరం. రచయితకు కాదు. ■

యువతరాన్ని భ్రమల వాతావరణంలోకి నెడుతున్నారు



బాలల నవలలకు ఆహ్వానం

తానా–మంచి పుస్తకం ఆధ్వర్యంలో బాలల నవలలకు ఆహ్వానం పలుకుతున్నాం. ఈ రచనలు నవల, సచిత్ర నవల లేదా కామిక్ స్ట్రిప్/ గ్రాఫిక్ నవల, కథా గుచ్ఛం రూపంలో ఉండాలి. (కథా గుచ్ఛంలో పాత్రలు మారకుండా కథలు స్వతంత్ర ఎపిసోడ్‌లలాగ ఉండాలి). మోడ్రన్ డే అడ్వెంచర్, మిస్టరీ, హాస్యం, సైన్స్ ఫిక్షన్, కమింగ్ ఆఫ్ ఏజ్ అంశాలను తీసుకుని రాయవచ్చు. నవంబర్ 30, 2024లోపు అందేలా రచనలు పంపాలి. యూనికోడ్/ అను ఫాంట్‌లలో టైప్‌చేసిన ప్రతుల్ని tana.mp.balalanavalalu2025@gmail.comకు పంపాలి. రాతప్రతులను చిరునామా: మంచి పుస్తకం, 12-13-439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాద్ 500017కు పంపాలి. వివరాలకు: పి భాగ్యలక్ష్మి 94907 46614, వాసిరెడ్డి నవీన్ 98493 10560కు ఫోన్ చెయ్యవచ్చు. ఎంపికైన రచనలను తానా – మంచి పుస్తకం కలిసి ప్రచురిస్తాయి.

జంపాల చౌదరి

మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం

ఖాజా, కోయి కోటేశ్వర రావు సంపాదకత్వంలో బహుజన కెరటాలు ప్రచురించిన మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ మద్దూరి జయంతి సందర్భంగా ఆగస్ట్ 15 సా.5గంటలకు ఒంగోలు, మల్లయ్య లింగం భవన్‌లో జరుగుతుంది. అధ్యక్షత ఆత్మకూరి బాలచెన్నయ్య, ముఖ్య అతిథి యం.యం. వినోదిని, వక్తలు కత్తి కళ్యాణ్, ఎజ్రా శాస్త్రి, నూకతోటి రవికుమార్, శ్రీరామకవచం సాగర్, సజ్జా వెంకటేశ్వర్లు, గంగవరపు సునీత తదితరులు.

పల్నాటి శ్రీరాములు

'విమర్శకునితో ఒక సాయంత్రం'

కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్ట్ 17 సా.6 గంటలకు విజయవాడలో విమర్శకులు జి. లక్ష్మీనర్సయ్యతో 'విమర్శకునితో ఒక సాయంత్రం' కార్యక్రమం జరుగుతుంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సెమినార్ హాల్‌లో జరిగే ఈ ముఖాముఖి కార్యక్రమానికి సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

సి. మృణాళిని

'పాయిదరువులు' నవల

కె.వి. మేఘనాథ్ రెడ్డి రాసిన 'పాయిదరువులు' నవల ఆవిష్కరణ సభ ఆగస్ట్ 17 ఉ.10గంటలకు తిరుపతిలోని ఛాంబరాఫ్ కామర్స్ లో జరుగుతుంది. సభలో మధురాంతకం నరేంద్ర, పలమనేరు బాలాజీ, ఆర్.సి.కె రాజు, సి.ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారు.

భాగ్య

'యాదొంకీ బారాత్' ఆవిష్కరణ

వారాల ఆనంద్ తన జ్ఞాపకాలను 'యాదొంకీ బారాత్' పుస్తకంగా రాసారు. ఈ పుస్తకావిష్కరణ ఆగస్ట్ 18 సా.4గంటలకు హైదరాబాద్ ఉస్మానియా యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో జరుగుతుంది.

ఇందిరా రాణి

కవి సంధి

సాహిత్య అకాడెమీ ఆధ్వర్యంలో 'కవి సంధి' కార్యక్రమంలో నగ్నముని తన కవితలను చదివి, పాఠకులతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ఆగస్ట్ 21 సా.5గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

సాహిత్య అకాడెమీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 12 ఆగస్టు 2024



నిండుకుండలా లక్నవరం సరస్సు


స్పీడ్‌బోటులో విహరిస్తున్న పర్యాటకులు

ప్రకృతి పరవశం.. లక్నవరం..

ప్రకృతి అందాలకు నెలవైన లక్నవరం సరస్సు నిండుకుండలా మారింది. గోవిందరావుపేట మండలంలోని చెరువు మత్తడి పోస్తోంది. చుట్టూ కొండలు మధ్యలో ద్వీపంలా కనిపిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. జంట వంతెనలు కనువిందు చేస్తున్నాయి. పర్యాటకులు స్పీడ్ బోట్లలో విహరిస్తూ, సెల్ఫీలు దిగుతూ, ఊయలవంతెనపై పరవశించిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని దూర ప్రాంతాలనుంచి వచ్చి సరస్సు మధ్యలో ఉన్న కాటేజీల్లో ఉంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి



ఖరీఫ్‌కు భరోసా ఏదీ?!

వానాకాలం పంటలకు అందని పెట్టుబడి సాయం

- ఎన్నికల్లో సాయం పెంచి ఇస్తామని కాంగ్రెస్ హామీ
- రైతుల అభిప్రాయ సేకరణ పేరిట ఉపసంఘం ఏర్పాటు
- గత అసెంబ్లీ సమావేశాల్లోనూ చర్చించని ప్రభుత్వం
- కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కరువైన భరోసా
- పెట్టుబడికి డబ్బులు లేక అన్నదాతల అవస్థలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,89,787 మంది రైతుల ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతులకు పెట్టుబడి సాయంపై సందిగ్ధం నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఏటా రెండు పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతు బంధు పథకం పేరుతో అందించింది. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతు బంధును రైతు భరోసా పథకంగా మార్చి.. ఏటా ఎకరాకు రూ.15వేల సాయం అందిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని అర్హులైన వారికే అమలు చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రైతుల అభిప్రాయాలను సేకరించినప్పటికీ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పెట్టకపోవటం పలు అనుమానాలకు తావిచ్చింది. రైతులతోపాటు కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కూడా రైతుభరోసా పథకం ద్వారా సాయం అందిస్తామని ఆరుగ్యారంటీల్లో హామీ ఇవ్వటంతో ప్రభుత్వ నిర్ణయం కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు.

రైతుకు భరోసాకు గ్యారంటీ ఏది..?

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతు భరోసాను ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు యాసంగి, వానాకాలం పంటలకు రెండు విడతల్లో రూ.10వేల ఆర్థిక సాయాన్ని రైతులకు అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం స్థానంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రెండు విడతల్లో రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అలాగే కౌలు రైతులకు కూడా ఇదే మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఇక వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గత డిసెంబరులో సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత యాసంగి పంటలకు సంబంధించి పాత పద్ధతిలోనే రైతులకు యాసంగి పంటకు ఎకరాకు రూ.5వేల చొప్పున సాయాన్ని అందించారు. అయితే వానాకాలం పంటలకు కాంగ్రెస్ ఇచ్చిన రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. అయితే భరోసా పథకంపై ప్రభుత్వం ఇప్పటి వరకు విధివిధానాలను ప్రకటించలేదు. పైగా గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకంలో లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీ నేతృత్వంలోని మంత్రుల బృందం తెలంగాణలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించింది. అందులో భాగంగా జూలై 15వ తేదీన ఉమ్మడి జిల్లా రైతుల అభిప్రాయాలను సేకరించేందుకు హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, సీతక్కలు హాజరయ్యారు. మెజారిటీ రైతులు 10ఎకరాల లోపు రైతులకే రైతు భరోసా సాయం అందించాలని సూచించారు. అయితే రైతుల అభిప్రాయాలను సేకరించిన మంత్రులు అసెంబ్లీ సమావేశాల్లో శాసన సభ్యుల అభిప్రాయలను కూడా తెలుసుకునేందుకు చర్చ పెడుతామని వరంగల్‌లో ప్రకటించారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే సలహాలు తీసుకుని రైతుభరోసాను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం చర్చకు రాలేదు. దీంతో ఈసారి రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందటం అనుమానంగా ఉందనే ఆందోళనలో రైతాంగం ఉంది.

పెట్టుబడి సాయం లేనట్టేనా..?

పదేళ్ల కాలంలో ఎప్పుడూ లేని విధంగా రైతులు ఈసారి పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం పంటలు ప్రారంభంలోనే ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. ఇప్పటికే తొలి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.లక్షన్నర రుణమాఫీని ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో 2,08,077 రైతు ఖాతాలకు రూ.1,506.50కోట్ల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది. ఇక రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు రుణమాఫీ లెక్కల్లో బిజీగా మారటంతో కొత్త రుణాలు ఇచ్చేదుకు ఆసక్తి చూపటం లేదు. దీంతో బ్యాంకుల్లో కొత్తగా రుణాలు అందకపోవటంతోపాటు ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా పెట్టుబడిసాయం కూడా అందకపోవటంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారుల నుంచి పంటల సాగుకు పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కాగా, 2023-24లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు గత యాసంగిలో రైతుభరోసా సాయం అందింది. జూన్‌లోనే రైతులకు వానాకాలం పంటలకు పెట్టుబడిసాయం అందించాల్సి ఉంది. ఆగస్టులో కూడా రైతుభరోసా ఇవ్వకపోవటంతో పంటలకు పెట్టుబడి కష్టాలు తీవ్రం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అయితే ప్రభుత్వం రైతుభరోసాపై విధివిధానాలు ప్రకటించకపోవటంతో పెట్టుబడిసాయం ఆలస్యం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రకటించే కొత్త విధానంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుల్లో ఎంత మందికి పెట్టుబడి సాయం వస్తుందో అనే ఉత్కంఠలో ఉన్నారు.

గత యాసంగిలో రైతు భరోసా పొందిన రైతులు

జిల్లా	లబ్ధిపొందిన రైతులు
వరంగల్	1,54,822
హనుమకొండ	1,45,044
జనగామ	1,79,735
మహబూబాబాద్	2,14,685
భూపాలపల్లి	1,16,171
ములుగు	79,330
మొత్తం	8,89,787

కౌలురైతులు, కూలీల గుర్తింపు ఎప్పుడో..?

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతుభరోసా పథకంలో రైతులతో పాటు కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు కూడా పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు రైతుల నుంచి మంత్రివర్గ ఉపసంఘం సేకరించిన అభిప్రాయాల్లో పలువురు కూలీలకు, కౌలు రైతులకు ఏ విధంగా సాయం అందిస్తారని మంత్రులను ప్రశ్నించారు. అయితే వీటిపై ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేస్తుందని మంత్రులు తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ చేపట్టలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 2లక్షలకుపైగా కౌలు రైతులు ఉన్నట్లుగా అనధికారికంగా లెక్కలు ఉన్నాయి. అధికారికంగా గుర్తింపు ప్రక్రియ చేపడితే ఈ సంఖ్య పెరగటమో.. తగ్గటమో జరుగుతుంది. అయితే కౌలు రైతులకు రైతుభరోసా కింద సాయం అందిస్తే... పట్టాదారుడైన రైతులకు కూడా సాయం అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ కూలీలు ఐదు లక్షలకు పైగా ఉన్నట్లుగా అంచనా.

అయితే వ్యవసాయ కూలీలను ఏ ప్రాతిపాదికన గుర్తిస్తారో అనేది కూడా ప్రభుత్వం స్పష్టం చేయలేదు. అటు కౌలు రైతులు, ఇటు వ్యవసాయ కూలీల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టక పోవటంతో ఈ వానకాలం పంటలకు రైతు భరోసా అందటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ప్రజల్లో ఐక్యత, సమగ్రత పెంపొందాలి..

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ
- జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ
- వెయ్యి మంది విద్యార్థులతో సాగిన ప్రచారం

హనుమకొండ టౌన్, ఆగస్టు 11: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు, భారతదేశ 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, ప్రజలలో దేశభక్తిని పెంపొందించడానికి, కాంగ్రెస్ పార్టీ తప్పులను బహిర్గతం చేయడానికి హర్ ఘర్ తిరంగా ప్రచారాన్ని బీజేపీ ప్రారంభించిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో భీమారం నుంచి కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ వరకు తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, వ్యక్తిగత అభిప్రాయాలు, కుల, మత, ప్రాంత అభిప్రాయ భేదాల కన్నా జాతీయ భావనే అత్యుత్తమమన్నారు. ప్రతీ ఒక్కరు నా దేశం అని భావించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేపీ జిల్లా యయువ మోర్చా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్, యువ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, దయాకర్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రత్నలక్ష్మీ, జిల్లా నాయకులు గొర్రె ఓం ప్రకాష్, మహేందర్‌పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎరుకల దివాకర్, నిఖిల్ చోప్రా, యువ మోర్చ నాయకులు హరీష్, మూల రాము, మురళీ, వెంకట్రమణ, రాజు, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శివనగర్‌లో భారీ చోరీ

- విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చొరబడిన దొంగలు
- 20 తులాల బంగారం, రూ. 15వేలు అపహరణ
- విచారణ చేస్తున్న మిల్స్ కాలనీ పోలీసులు


చోరీ జరిగిన ఇంటి పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేపడుతున్న దృశ్యం

కరీమాబాద్, ఆగస్టు 11: వరంగల్ శివనగర్‌లోని ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదును అపహరించారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివనగర్ ప్రాంతానికి చెందిన కొత్తగట్టు నర్సింహమూర్తి-వెంకటలక్ష్మి దంపతులు శివనగర్‌లో నివాసముంటున్నారు. నర్సింహమూర్తి ఇరిగేషన్ శాఖలో పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. నర్సింహమూర్తికి అనారోగ్యంగా ఉండడంతో గత సోమవారం హైదరాబాద్‌లో ఉన్న పెద్దకూతురు ఇంటికి వెళ్లి వారం రోజులు అక్కడే ఉంటూ చికిత్స తీసుకుంటున్నాడు. చికిత్స పొందిన తరువాత ఆదివారం తిరిగి వరంగల్ శివనగర్‌లోని తమ నివాసానికి చేరుకున్నారు. దంపతులు ఇద్దరు ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇంట్లోని బీరువా తెరిచి ఉండటాన్ని గమనించి చూడగా అందులో ఉన్న సుమారు బంగారు ఆభరణాలు, రూ.15వేల నగదు కనిపించలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని నిర్ధారణకు వచ్చిన నర్సింహమూర్తి దంపతులు.. 100కి డయల్ చేశారు.

సమాచారం తెలుసుకున్న మిల్స్‌కాలనీ సీఐ పి.మల్లయ్య, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా అండర్ రైల్వేగేటు ప్రాంతంలో దొంగలు తమ చేతివాటాన్ని చూపిస్తూ, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. వరుస దొంగతనాలతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

పర్వతగిరి సీఐ, వీఆర్ ఎస్ఐ సస్పెన్షన్

- పంథినిలో క్వారీ కేసు విషయంలో అవినీతి ఫలితం
- విచారణ చేసి వేటు వేసిన సీపీ


సీఐ శ్రీనివాస్ నాయక్ | ఎస్ఐ అనిల్‌కుమార్

వరంగల్ క్రైం, ఆగస్టు 11: గ్రానైట్ కంపెనీపై నమోదైన కేసు విషయంలో అవినీతికి పాల్పడిన వరంగల్ జిల్లా పర్వతగిరి సీఐ ఇ.శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ జి.అనిల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 28న ఐనవోలు మండలం పంథిని సమీపంలోని ఒక గ్రానైట్ కంపెనీలో రూ.30లక్షలకు పైగా విలువ చేసే డీజిల్ నిల్వ ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు చేసి నిర్వాహకుడిని విచారణ నిమిత్తం స్థానిక పోలీ స్స్టేషన్‌కు అప్పగించారు. విచారణలో భాగంగా సీఐ శ్రీనివాస్ నాయక్‌తో పాటు ఆ సమయంలో ఐనవోలు ఎస్ఐగా చేసిన అనిల్‌కుమార్ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సీపీ విచారణకు ఆదేశించారు. విచారణలో సీఐ, ఎస్ఐ ఇద్దరు అవినీతికి పాల్పడినట్లు తేలడంతో సస్పెండ్ చేశారు. కాగా, ఇటీవల పర్వతగిరి ఎస్ఐపై జరిగిన ఏసీబీ దాడి విషయంలో సైతం సీఐపై ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. బెల్లం వ్యాపారం చేసే వారి నుంచి డబ్బులు తీసుకుంటూ ఎస్ఐ వెంకన్న ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. సీఐ సస్పెన్షన్ వెనుక గ్రానైట్ కంపెనీ కేసుతోపాటు పర్వతగిరిలో జరిగిన సంఘటన కూడా తోడైనట్లు సమాచారం. మొత్తంగా సీఐ, ఎస్ఐ సస్పెన్షన్ పోలీస్‌శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. కాగా, సస్పెన్షన్ వేటు పడిన ఎస్ఐ అనిల్‌కుమార్ ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నాడు.



మాట్లాడుతున్న హీరో రామ్
హీరోయిన్ కావ్య

'డబుల్ ఇస్మార్ట్' జోష్

- ఇండోర్ స్టేడియంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్
- హాజరైన హీరో రామ్, డైరెక్టర్ పూరి, హీరోయిన్ కావ్య

బాలసముద్రం, ఆగస్టు 11: రామ్ పోతినేని హీరోగా, కావ్య హీరోయిన్‌గా, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన డబుల్ ఇస్మార్ట్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ అదివారం హనుమకొండ బాలసముద్రంలోని జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ పూరి జగన్నాథ్ మాట్లాడుతూ.. ఈనెల 15న డబుల్ ఇస్మార్ట్ సినిమా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సినిమా కోసం కృషి చేసిన సిబ్బందికి డైరెక్టర్ పూరి జగన్నాథ్ కృతజ్ఞతలు తెలిపారు. హీరో రామ్ మాట్లాడుతూ.. ఐదేళ్ల కిందట వరంగల్‌లోనే ఇస్మార్ట్ శంకర్ సినిమా ప్రీ రిలీజ్ జరిగిందన్నారు. ఆ సినిమా సూపర్ హిట్ కొట్టిందని అన్నారు. డబుల్ ఇస్మార్ట్ సినిమా కోసం ఎంతో కష్టపడినట్లు రామ్ తెలిపాడు. ఆగస్టు 15న సినిమా రిలీజ్ రోజు థియేటర్‌లో కలుసుకుందామని అభిమానులకు తెలిపాడు. కాగా, ఈ కార్యక్రమానికి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. హీరో రామ్ పోతినేని, నటుడు అలీ, నిర్మాత చార్మి మాట్లాడుతుండగా అభిమానులు కేరింతలతో స్టేడియం దద్దరిల్లింది.

ఈ కార్యక్రమంలో యంకర్ సుమ ఇస్మార్ట్ డైలాగులతో ఆకట్టుకున్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కమిషనరేట్‌లో 9మంది సీఐల బదిలీ



వరంగల్ క్రైం, ఆగస్టు 11: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది మంది సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారిలో బి.రాజగోపాల్ దుగ్గొండి నుంచి పర్వతగిరికి, వి.చేరాలు వీఆర్ నుంచి హసన్‌పర్తికి, జె.సురేష్‌కుమార్ హసన్‌పర్తి నుంచి ఎస్‌బీకి, పి.కిషన్ ఎస్‌బీ నుంచి మడికొండకు, డి.ప్రతాప్ మడికొండ నుంచి ఎస్‌బీకి, కె.శ్రీనివాస్ ఎస్‌బీ నుంచి వర్ధన్నపేటకు, జి.సూర్యప్రకాశ్ వర్ధన్నపేట నుంచి ఐజీపీకి సరెండర్, పులి రమేశ్ వీఆర్ నుంచి ఎల్కతుర్తికి, ఎ.రాఘవేందర్ ఎస్‌బీ నుంచి ఏనుమాముల పీఎస్‌కు బదిలీ అయ్యారు.

బోనాల పండుగలో కోడిపుంజు సందడి



కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 11: బోనాల పండుగలో మొక్కులు సమర్పించేందుకు కోడిపుంజును తీసుకువెళ్లడం సాధారణం. ఇందుకు భిన్నంగా కోడిపుంజుకు బుట్టాలు, మద్యం సీసాతో అలంకరించి ఊరేగింపుగా తీసుకువెళ్లడం ఆకర్షణీయంగా మారింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంస్టేషన్ లక్ష్మీనగర్‌కు చెందిన తోడేటి వెంకన్న పదేళ్లుగా కోడిపుంజును ఇలాగే అలంకరించి తీసుకువెళుతున్నాడు. ఆదివారం నిర్వహించిన బోనాల్లో ఈ కోడిపుంజు ఆకర్షణీయంగా ఉండడంతో పలువురు యువకులు కోడితో ఫొటోలు దిగడం విశేషం.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బ్యాడ్మింటన్ విజేతలను అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 11: హైదరాబాద్‌లోని గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 8 నుంచి 11 వరకు జరిగిన యోనెక్స్ 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్ 13 బ్యాడ్మింటన్ పోటీలలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు సత్తా చాటారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో బాలురు ప్రతిభ కనబరిచినట్లు కోచ్ శ్రీధర్ ఆదివారం తెలిపారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో శ్రీచేతన్, శౌర్య శ్యామల ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

రాయపర్తిలో దారి దోపిడీ

రాయపర్తి, ఆగస్టు 11 : వరంగల్ జిల్లా రాయ పర్తి మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై దంపతులు దారి దోపిడీకి గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని వడ్డె కొత్తపల్లి గ్రామానికి చెందిన సాయిని భవిత-వెంకన్న దంపతులు తమ కూతురు పుట్టిన రోజు సందర్భంగా చూసేందుకు హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఏకశిల స్కూల్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చారు. అనంతరం తిరిగి రాయపర్తి మీదుగా ఇంటికి వెళ్తుండగా, రాయపర్తి శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో జాతీయ రహదారిపై ఓ గుర్తు తెలియని వ్యక్తి ఓ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి స్పీడుగా వచ్చి, బైక్ పై వెనక కూర్చున్న భవిత చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగును లాగేసి ఎత్తుకెళ్లాడు. దీంతో దంపతులు వెంబడించినప్పటికీ అతడి అచూకీ లభించలేదు. అనంతరం రాయపర్తి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. హ్యాండ్ బ్యాగులో 15 గ్రాముల బంగారం, రూ.2వేల నగదు ఉన్నట్లు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 11: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవా ల్సిందిగా ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి కోరారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని వివరాలకు www.braouonline.in, www.braou.ac.in వెబ్‌పోర్టల్లలో చూడాలన్నారు. ఇతరత్ర ఏవైనా సందేహాలుంటే 7382929570/580 హెల్ప్ డెస్క్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే 2015 నుంచి 2024 వరకు ఫీజు చెల్లించని డిగ్రీ, పీజీ ఓల్డ్ విద్యార్థులు ఆగస్టు 18 లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ చారి, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్

తెలంగాణలో వీఆర్‌వో వ్యవస్థ మళ్లీ వస్తుంది

- కొత్త ఆర్వోఆర్ చట్టంతో రైతులకు న్యాయం
- గత ప్రభుత్వపు చీకటి ఒప్పందాల చట్టంతో రైతులకు తీవ్రమైన నష్టం
- తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లు చర్చలో మాట్లాడుతున్న రామకృష్ణ

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 11: తెలంగాణలో గత పాలకుల నిలకడ లేని నిర్ణయాల వల్ల కనుమరుగైన వీఆర్‌వో వ్యవస్థ మళ్లీ రాష్ట్రంలో వస్తుందని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణ వెల్లడించారు. హనుమకొండలోని వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రెవెన్యూ ముసాయిదా బిల్-2024పై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ గత పాలకులు వైఫల్యంతో రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యమయ్యిందన్నారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే గ్రామానికో రెవెన్యూ అధికారి రానున్నారన్నారు. కొత్త రెవెన్యూ చట్టంతో రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం తరహాలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని రూపొందించిందని కొనియాడారు. స్వాధీనంలో భూమి, చేతిలో పట్టా, రికార్డులో పేరు ఈ మూడు ఉన్నప్పుడే ఏ రైతుకైనా సంపూర్ణ హక్కులు దక్కుతాయని తెలిపారు. కొత్త ఆర్వోఆర్ చట్టంలో ఈ మూడు అంశాలుండడంతో రైతుకు భూమిపై సర్వ హక్కులు దక్కుతాయన్నారు.

కొత్త చట్టంతో రైతులకు సేవలు సులభంగా అందడంతో పాటు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ఈ చట్టంలో పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలు మార్చుకునే వెసులుబాటును కల్పించారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ చట్టంతో సామాన్య రైతులకు తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ల పరిధిలో సమస్యల పరిష్కారానికి ఆస్కారం లేకుండా ఉండేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నూతన ఆర్వోఆర్ చట్టంతో రైతులు తమ భూ సమస్యలకు కోర్టు మెట్లు ఎక్కకుండానే అన్ని రకాల సేవలు అందనున్నాయన్నారు. ఎక్కడికక్కడ వారి సమస్యలను పరిష్కరించే అవకాశాన్ని కొత్త చట్టం కల్పించిందన్నారు. దీంతో రాష్ట్రంలోని రైతులకు వారి భూముల విషయంలో ఎలాంటి నష్టం వాటిల్లే ప్రమాదాలు తప్పనున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ... దేశంలోని 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి, పరిశీలించి నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా చీకటి ఒప్పందాల ప్రకారం కాకుండా ప్రజల అభిప్రాయాల మేరకు ప్రజల ముందుకు నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును తీసుకువచ్చిన ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో ప్రజాపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు న్యాయం చేయాలనే కృతనిశ్చయంతోనే సబ్బండ వర్గాల అభిప్రాయలను సేకరించి అన్ని పరిశీలించి ప్రజలకు, రైతులకు అనువైన, ఉద్యోగులకు సులువైన మార్గాలను అన్వేషించి నూతన చట్టాన్ని రూపొందించిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

జనరల్ సెక్రెటరీ పూల్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... నూతన ఆర్వోఆర్ చట్టంతో రైతులకు సులువుగా సేవలు అందుతాయన్నారు. క్షేత్ర స్థాయిలో భూపరిపాలన వ్యవస్థలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త చట్టం ఉపయోగపడుతుందన్నారు. ప్రజల వద్ద నుంచే చట్టం రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త చట్టం ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, ఆదర్శ లా కళాశాల ప్రిన్సిపాల్ బూర విద్యాసాగర్, ఆర్టీఐ కార్యకర్త పొట్లపల్లి రవీందర్ తదితరులు పాల్గొని కొత్త ఆర్వోఆర్ చట్టంపై వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీజీటీఏ సెక్రటరీ పాక రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్‌తో పాటు వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు తదితర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

కర్షకుల వద్దకే కరెంటోళ్లు

- సత్ఫలితం 'ఎన్‌పీడీసీఎల్ పొలంబాట'
- అక్కడికక్కడే కరెంట్ సమస్యల పరిష్కారం
- విద్యుత్ కార్యాలయాల్లో కన్జూమర్ రిసెప్షన్ డెస్క్‌లు
- ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి
- మెరుగైన కరెంట్ సరఫరాకు పలు సంస్కరణలు
- తొలగుతున్న ఇబ్బందులు.. రైతుల నుంచి స్పందన..

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థ మెరుగైన సేవలు అందించేందుకు పలు కార్యక్రమాలను చేపడుతోంది. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారంతో పాటు ఉద్యోగుల్లో జావాబుదారీతనం తీసుకువచ్చే దిశగా పలు సంస్కరణలు తీసుకువచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం వ్యవధిని కనిష్ఠ స్థాయికి తీసుకురావడంతో పాటు వైఫల్యాల స్థాయిని కూడా సాధ్యమైనంత మేరకు తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకు మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి ఫీడర్ల వైఫల్యాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం వ్యవధితో పాటు రోజులో ఎన్ని సార్లు పోతుందో కారణాలు నమోదు చేస్తున్నారు. అవి పునరావృతం కాకుండా తీసుకోవలసిన చర్యలు కొనసాగుతున్నాయి. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడానికి విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతీవారం నిర్వహిస్తున్నారు. కన్జూమర్ రిసెప్షన్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కొత్తగా పొలాల వద్దకే విద్యుత్ అధికారులు వెళ్లే పొలంబాట కార్యక్రమాన్ని బుధవారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

> **కన్జూమర్ రిసెప్షన్ డెస్క్**
>
> క్షేత్రస్థాయిలో వినియోగదారులకు సేవలు అందించే సెక్షన్ కార్యాలయాలకు వినియోగదారుడు వెళ్లే వారి సమస్య అడిగి తెలుసుకోవడానికి సరైన వ్యవస్థ లేదు. సెక్షన్ అధికారైనా ఏఈ ఉంటేనే సమస్యను నివేదించేవారు. సబ్ ఇంజనీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నా ఏఈ లేరంటూ వినియోగదారుడికి చెప్పి పంపించేవారు. ఈ దుస్థితిని నివారించడానికి ప్రస్తుతం కన్జూమర్ రిసెప్షన్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయ వేళల్లో ఏఈ, సబ్ ఇంజనీర్ అందుబాటులో ఉండి, వినియోగదారుల సమస్యలను స్వీకరించి రశీదులు జారీ చేయాల్సి ఉంటుంది. ఇదే విధానాన్ని సబ్ డివిజన్, డివిజన్, ఎస్ఈ కార్యాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో వినియోగదారుడికి సమయం, శ్రమ, ఖర్చు ఆదా అవుతున్నాయి. ఇదే సమయంలో సమస్యకు సత్వర పరిష్కారం లభించే అవకాశాలు మెరుగుపడ్డాయి.

పొలం బాట

గ్రామాల్లో రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. దానిపేరు విద్యుత్ అధికారులు పొలం బాట. రైతులు విద్యుత్ సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఈ వినూత్న కార్యక్రమం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని పదహారు జిల్లాలో అమలులోకి వచ్చింది. ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నాలుగు రోజులుగా పొలం బాట పడుతున్నారు. కరెంట్ సమస్యపై రైతులను అడిగి తెలుసుకుంటున్నారు. వారి సమక్షంలోనే పరిష్కరిస్తున్నారు. అవసరమైతే వారి సహాయాన్ని కూడా తీసుకుంటున్నారు. వర్షాకాలంలో కరెంట్ సమస్యలు అధికంగా ఉంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని సీఎండీ ఈ పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది పక్షం రోజుల పాటు కొనసాగుతోంది. అవసరమైతే ఆ తర్వాత కూడా మరికొన్ని రోజులు కొనసాగించే అవకాశం ఉంది.

సత్వరం పరిష్కారం

అన్నం పెట్టే అన్నదాతకు సమస్య వస్తే పనులు మానుకోవలసిన పరిస్థితిని విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమం నివారిస్తోంది. విద్యుత్ సంస్థ అధికారులైన ఎస్‌ఈ, డీఈ, ఇతర సిబ్బంది ఉమ్మడి జిల్లాలో బుధవారం నుంచి పొలం బాట నిర్వహిస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావడానికి అధికారులు విద్యుత్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్ నెంబర్లను ఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబరును అందచేస్తున్నారు. విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వివరిస్తున్నారు. మోటార్ దగ్గర ఎర్తింగ్ సరిగా ఉందో లేదో చూస్తున్నారు. సర్వీస్ వైర్ అతుకులు లేకుండా చూస్తున్నారు. ఇనుప డబ్బాలు వాడకూడదని, ఇండక్షన్ వచ్చే ప్రమాదం ఉందని, కనుక ప్లాస్టిక్ డబ్బాలు వాడాలని సూచిస్తున్నారు. రైతుల చేతులు సర్వసాధారణంగా నీళ్లతో తడిగా ఉంటాయి. కనుక పొడి చేతులతో మోటార్ ఆన్ చేసేట్లు లేదా ఏదైనా ప్లాస్టిక్ పరికరం లేదా కర్ర తో చేసేట్టు జాగ్రత్తలు చెబుతున్నారు. డీఎస్ఎంలో భాగంగా ఐఎస్ ఐ నాణ్యత గల మోటార్లు తక్కువ రాపిడి ఇచ్చే పైపులు, బ్రాం డెడ్ ఫుట్‌వాల్వులు మొదలైన పరికరాలు నాణ్యమైనవాటినే వాడా లని సూచిస్తున్నారు.



దామెర మండలంలోని దుర్గంపేటలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

విద్యుత్ ప్రజావాణి

ప్రతీ సోమవారం కలెక్టర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం స్ఫూర్తితో ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టింది. గతంలో కరెంట్ సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు తీసుకొని రశీదులు ఇచ్చేవారు కాదు. పరిష్కారం ఏదశలో ఉందో తెలుసుకోవడానికి వినియోగదారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేంది. వినియోగదారుడు కార్యాలయానికి వచ్చిన సమయంలో అధికారి అందుబాటులో ఉండేవాడు కాదు. ఫిర్యాదు పుస్తకం దొరికేది కాదు.

ఈ సమస్యను పూర్తిగా తొలగించేందుకు సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్ ఏఏవో కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌ఈ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణిని నిర్వహిస్తున్నారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదును సంస్థ పోర్టల్‌లో నమోదు చేసి ఫిర్యాదు సంఖ్యను ఇస్తారు. దీంతో వినియోగదారుడికి ఫిర్యాదు ఇచ్చిన రశీదుతో పాటు అధికారులకు సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత పెరిగింది.

> **పొలం బాటకు మంచి స్పందన**
>
> **కర్నాటి వరుణ్‌రెడ్డి, సీఎండీ ఎన్‌పీడీసీఎల్**
>
> విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమానికి రైతుల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్నారు. దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చుతున్నారు. మిడిల్ పోల్స్‌ను సైతం సరి చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేదుకు డీటీఆర్‌ల ప్లింత్ ఎత్తును పెంచుతున్నారు. కిందకు వేలాడుతున్న కరెంట్ లైన్లను గట్టిగా బిగిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. మోటార్లు సమర్థవంతంగా పని చేసేందుకు కెపాసిటర్లను వినియోగించాల్సిన అవసరాన్ని రైతులకు వివరిస్తున్నారు. విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఏ రోజు ఏ గ్రామానికి వెళ్లేది రైతులకు ముందే సమాచారం ఇస్తున్నారు.

వరంగల్‌కు వెల్‌నెస్ సెంటర్

- మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం
- ఫలించిన వరంగల్ ఎంపీ కావ్య కృషి


ఎంపీ డాక్టర్ కావ్యను సన్మానిస్తున్న పెన్షనర్లు

వరంగల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా 22 వెల్‌నెస్ సెంటర్లను ప్రకటించగా, తెలంగాణ నుంచి వరంగల్‌ను ఎంపిక చేసింది. ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రత్యేక చొరవతో వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పరీక్షల కోసం హైదరాబాద్, ఏపీలోని కొండపల్లిలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌లకు వెళ్లే వారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం చికిత్స చేయటమా లేక ఇతర ఆస్పత్రికి రెఫర్ చేయటమో జరిగేది. అయితే ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో రెండు దశాబ్దాలుగా వరంగల్‌లోనే వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల డిల్లీలో వరంగల్ ఎంపీ కడియం కావ్యను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలవటంతో వారి సమస్యను పరిష్కారానికి ఎంపీ చొరవ చూపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారులతో ఎంపీ కడియం కావ్య చర్చింటంతో పాటు వరంగల్‌కు ఎందుకు వెల్‌నెస్ సెంటర్‌ను మంజూరు చేయాలో వివరించారు. అలాగే ఈ విషయమై ఎంపీ కావ్య పార్లమెంటులో సైతం గళమెత్తారు. వెల్‌నెస్ సెంటర్ కోసం ఎంపీ ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 22 వెల్‌నెస్ సెంటర్లలో వరంగల్‌కు కూడా చోటు దక్కిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. త్వరలోనే కొత్తగా భవనం నిర్మించి వైద్య సిబ్బందితో పాటు వైద్య పరీక్షలకు కావాల్సిన వైద్య పరికరాలను ఏర్పాటు చేయటం.. లేదంటే కేఎంసీ ఆస్పత్రిలో అదనంగా వెల్‌నెస్ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం. వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు 54 పట్టణాల్లో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డు ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు ప్రయోజనం చేకూరనుంది.

ఎంపీ కావ్యకు పెన్షనర్ల సన్మానం

వరంగల్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్‌ను మంజూరు చేయటంపై కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సీజీహెచ్ఎస్ పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండలోని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వగృహంలో ఆమెను శాలువాతో సన్మానించారు. రెండు దశాబ్దాల డిమాండ్‌ను నెరవేర్చేందుకు కృషి చేసినందుకు అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య సేవల విస్తరణకు వెల్‌నెస్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఎంపీ కావ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ నాయకులు చాడ జైహింద్‌రెడ్డి, సదానందం, సారయ్య, లింగారెడ్డి, వెంకటస్వామి, సాంబశివుడు, ఆంజనేయులు, ప్రభాకర్, మహేందర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు

మట్టెవాడ, ఆగస్టు 11: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పసిపాపను కుక్కలు పీక్కుతిన్న ఘటనపై నిరసన వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పలువురు బీఆర్ఎస్ నాయకులపై మట్టెవాడ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులకు ముందస్తు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ధర్నా నిర్వహించడంతో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో పాటు కార్పొరేటర్లు కుమారస్వామి, మరుపల్ల రవి, బీఆర్ఎస్ నాయకులు కొంగరం రాజేందర్, ఎలకంటి సతీష్, మధు, దాచేపల్లి సీతారాం, బజ్జూరి వాసు, తోట స్రవంతిలపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. ప్రజల సమస్యలపై నిరసన కార్యక్రమాలు, ధర్నాలు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, ఆగస్టు 11: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి రూ.10వేల నగదు స్వాధీనం చేసుకుని 8మందిపై కేసు నమోదు చేశారు. ఆదివారం వరంగల్ ప్రాంతంలో మేకల రమేశ్ అనే వ్యక్తి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ఆధ్వర్యంలో దాడులు చేశారు. పట్టుకున్న 8మందిని విచారణ నిమిత్తం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ వైర్
- నిలిచిన రైలు, ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- వంగాలపల్లి రైల్వేగేటు వద్ద ఘటన


వంగాలపల్లి రైల్వేగేటు వద్ద నిలిచిన పద్మావతి ఎక్స్‌ప్రెస్

చిలుపూర్, ఆగస్టు 11: జనగామ జిల్లాలో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. హైటెన్షన్ విద్యుత్ వైరు తెగి కిందపడడంతో రైలు ఆగిపోయింది. దీంతో ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు జనగామ జిల్లా వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలోకి రాగానే పైనున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ తెగిపోయింది. దీంతో ఒక్కఉదుటున రైలు ఆగిపోయింది. ఈఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారమందుకున్న రైల్వే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేసి కాజీపేట వైపు పంపించారు. ఈ సందర్భంగా సుమారు 40నిముషాల పాటు ఐనవోలు, ధర్మాపురం, వంగాలపల్లి, నష్కల్, వంగాలపల్లి తదితర గ్రామాలకు వెళ్ళాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలురైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జర్నలిజానికి ఆచార్య చేసిన సేవలు అమూల్యం

- సీనియర్ సంపాదకుడు రాంచంద్రమూర్తి
- ఆనందాశ్రయ వృద్ధాశ్రమంలో స్మారక వైద్యశాల ప్రారంభం

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం కోసం తన యావజీవితాన్ని ధారపోసిన ఎంఎస్ ఆచార్య ఈ తరం ప్రాతికేయులకు స్ఫూర్తిప్రధాత అని సీనియర్ సంపాదకుడు రామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం గీసుకొండ మండలంలోని గొర్రెకుంటలో గల ఆనందాశ్రయ వృద్ధాశ్రమంలో ఎంఎస్ ఆచార్య-రంగనాయకమ్మ స్మారకార్థం ఆయన కుమారుడు ప్రముఖ జర్నలిస్టు, కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్య, వేదకల్యాణి ఏర్పాటు చేసిన వైద్యశాలను ఆయన ప్రారంభించారు. రామచంద్రమూర్తి తొలుత ఎంఎస్ ఆచార్య, రంగనాయకమ్మ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన కలం ద్వారా ఆచార్య సమాజంలోని రుగ్మతలను ప్రక్షాళనం చేశారని, నాటి ఎన్నో సామాజిక ఉద్యమాలకు జనధర్మ, వరంగల్‌వాణి పత్రికల ద్వారా వెన్నుదన్నుగా నిలిచారన్నారు. సీనియర్ జర్నలిస్టు, వార్త సంపాదకుడు దామెర్ల సాయిబాబ జర్నలిజం రంగంలో ఎంఎస్ ఆచార్య చేసిన కృషిని కొనియాడారు. కేంద్ర సమాచార మాజీ కమిషనర్ శ్రీధరాచార్యులు మాట్లాడుతూ.. తన తండ్రి ఆయశయాలకు అనుగుణంగా, ఆయన చూపిన బాటలో నడుస్తున్నానని అన్నారు. ఇందులో భాగంగా ఆనందాశ్రయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య సేవలు అందించేందుకు ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శ్రీధరాచార్య ఆయన సతీమణి వేదకళ్యాణి రూ.15 లక్షల వ్యయంతో ఆశ్రమం ఆవరణలో నిర్మించిన రెండు గదుల్లో ఈ క్లినిన్‌ను ఏర్పాటు చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు ప్రతీరోజు వైద్య సేవ లు ఈ క్లినిక్ ద్వారా అందు తాయి. క్లినిక్‌లో కావలసిన అన్ని ఏర్పాట్లను ఇందులో చేశారు.

ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు దాసరి క్రిష్టారెడ్డి, డాక్టర్ కోదండరామా రావు, ఆయన సతీమణి డాక్టర్ అంజనీదేవి, రిటైర్డ్ లెక్చరర్ రమణ, విమల తదిత రులు పాల్గొన్నారు. క్లినిక్‌ను ఏర్పాటు చేసినందుకు ఆనందాశ్రయ వృద్ధాశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



వృద్ధాశ్రమంలోని ఎంఎస్ ఆచార్య స్మారక వైద్యశాల

ఒక్క రైలు కోసమేనా?

- నిరుపయోగంగా కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- హాల్టింగ్‌లకు నోచుకోని పలు రైళ్లు
- జంక్షన్ నుంచి ఒక్కటిగా రద్దవుతున్న రైళ్లు
- పట్టించుకోని రైల్వే ఉన్నతాధికారులు

కాజీపేట, ఆగస్టు 11: రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన కాజీపేట టౌన్‌స్టేషన్‌ది విచిత్రమైన పరిస్థితి. ఇక్కడ కేవలం (17033/34) భద్రాచలం నుంచి బల్లార్షా వెళ్లే సింగరేణి ఒక్క రైలుకు మాత్రమే హాల్టింగ్ సౌకర్యం ఉంది. చెన్నై నుంచి న్యూఢిల్లీ అప్‌అండ్ డౌన్ నడిచే ప్రతీ సూపర్‌ఫాస్ట్ రైళ్లు కాజీపేట టౌన్ స్టేషన్ మీదుగానే వెళుతుంటాయి. ప్రతీరోజు సుమారు 50 వరకు సూపర్‌ఫాస్ట్ రైళ్లు టౌన్‌స్టేషన్ మీదుగా వెళుతున్నా.. ఇక్కడ ఒక్క రైలుకు హాల్టింగ్ లేదు. కాజీపేట పరిసర ప్రాంతాలవాసులు రైలెక్కాలంటే వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. సికింద్రాబాద్‌లో హాల్టింగ్ వున్న ప్రతీ రైలుకు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇస్తుండగా, వరంగల్‌లో హాల్టింగ్ వున్న ప్రతీ రైలుకు కాజీపేట టౌన్‌స్టేషన్‌లో హాల్టింగ్ ఎందుకు ఇవ్వరని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పైగా న్యూఢిల్లీ నుంచే వచ్చే ప్రతీ రైలును నాగపూర్‌లో వాటర్, క్లీనింగ్ చేస్తుంటారు. నాగపూర్ తర్వాత మళ్లీ విజయవాడలోనే ఈ సౌకర్యం ఇవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజీపేట టౌన్‌స్టేషన్ పక్కనే వడ్డెపల్లి చెరువు వుంది. ఇక్కడ హాల్టింగ్ ఇవ్వడం వల్ల వాటర్, క్లీనింగ్‌తోపాటు ప్రయాణికులకు మంచి సౌకర్యం వుంటుంది. అలాగే ఈ రైళ్లను నడిపే లోకో పైలెట్‌లు కాజీపేటలో ఉంటుండగా, ఇక్కడరైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో లోకో పైలెట్‌లను కాజీపేట నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా వరంగల్‌కు తీసుకెళుతున్నారు. దీనికి లోకోపైలెట్‌లకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. కాజీపేట టౌన్‌స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే రైల్వేకు లాభంతోపాటు ప్రయాణికులకు మంచి సౌకర్యం వుంటుందనేది పలువురి వాదన.

ఒక్కొక్కటిగా రద్దవుతున్న రైళ్లు

కాజీపేట జంక్షన్ మీదుగా పలురైళ్లు నడిపే అవకాశం ఉన్నా అధికారులు ఆసక్తి చూపడంలేదు. ముంబై, తిరుపతి, నాగపూర్, బెంగళూర్, ఢిల్లీ, వెళ్లే రైళ్లు కిక్కిరిసిపోతుంటాయి. కాజీపేట నుంచి నడపడానికి అన్ని సౌకర్యాలున్నా నడపడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. పైగా ఇక్కడి నుంచి నడిచే రైళ్లను ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్నారు. కాజీపేట నుంచి నాగపూర్ వెళ్లు నాగపూర్ ప్యాసింజర్, కాజీపేట-మణుగూరు ప్యాసింజర్, కాజీపేట-తడోబా ఎక్స్‌ప్రెస్, కాజీపేట-సికింద్రాబాద్ పుష్‌పుల్ రైళ్లను రద్దు చేశారు. అధికారులకు అవగాహన లేకపోవడమా..; అలసత్వమా..? అనే అర్థం కావడం లేదు. ఇప్పటికైనా కాజీపేట మీదుగా పలు రైళ్లను నడపడమే కాకుండా టౌన్‌స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించి, కాజీపేటకు ప్రాధాన్యతను పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



కాజీపేట టౌన్ స్టేషన్


కాజీపేటలో రైల్వే స్టేషన్

> **జంక్షన్‌పై చిన్నచూపు**
>
> ఉత్తర - దక్షిణ రైల్వే మార్గాలను కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌కు గేట్ వే ఆఫ్ ఇండియాగా పేరుంది. దక్షిణ మధ్య రైల్వేలోనే రైల్వేకు అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే కాజీపేట రైల్వే జంక్షన్‌ను అధికారులు నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ రెండు రైల్వేస్టేషన్‌లు ఉన్నప్పటికీ రైళ్ల కోసం ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఇక్కడ్నుంచి వెళ్లే కొన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించకుండా, కొత్త రైళ్లను నడపకుండా ఒక రకంగా కాజీపేటకు ఉన్న ప్రాధాన్యతను తగ్గిస్తున్నారనే ప్రచారం ఉంది.



రాంపూర్‌లో బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

బొడ్రాయికి 'అరూరి' పూజలు

మడికొండ, ఆగస్టు 11: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో వైభవంగా జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొన్నారు. బొడ్రాయి, శ్రీదేవి, భూదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజనకరుణాకర్, దర్గా పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, నాయకులు మునిగాల శ్రీకాంత్, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై సామూహిక మహాన్యాస రుద్రాభిషేకం

మడికొండ, ఆగస్టు 11: శ్రావణమాసోత్సవాలలో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై కొలువై ఉన్న మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉచిత సామూహిక మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు దండిగం శ్రీనివాస్, బైరి రాజు, రొడ్డ దయాకర్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు..

శ్రావణ మాసం సందర్భంగా మడికొండలోని బొడ్రాయి, శ్రీదేవి, భూదేవి దేవతలకు ఆదివారం పూజారి ఉపద్రష్ట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయి, శ్రీదేవి, భూదేవతలకు పంచామృతాలతో అభిషేకముం చేసి నూతన వస్త్రాలంకరణ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, బిన్నీ, డాక్టర్ రవీంద్రనాథ్, ఉపేంద్రాచారి, పెద్ది సంతోష్ పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న రుత్వికులు

వడ్డెపల్లి, ఆగస్టు 11: 57వ డివిజన్ అశోకకాలనీలో నిర్మించే రామమందిరంలో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం రుత్వికులు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత రుత్వికుల వేద మంత్రోశ్చరణల మధ్య హోమాన్ని జరిపించారు. కాలనీ వాసులంతా తరలివచ్చి ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో అశోక కాలనీ దేవాలయ కమిటీ అధ్యక్షుడు చింత శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డితో పాటు అశోక కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామిని కొలిచారు.

మల్లన్న సన్నిధిలో ఐజీ తరుణ్‌జోషి పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఐజీ తరుణ్‌జోషి

ఐనవోలు, ఆగస్టు 11: హైదరాబాద్ రేంజ్ ఐజీ (ఐపీఎస్) తరుణ్‌జోషి ఆదివారం ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. స్నేహితులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్నాక అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి శేష వస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, అర్చకుడు మధుశర్మ, అర్చక సిబ్బంది, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మల్లన్న మాల ధరించిన భక్తులు

ఐనవోలు, ఆగస్టు 11: ఐనవోలు మల్లికార్జునస్వామి భక్తులు మాలధారణ ద్వారా దీక్షను తీసుకున్నారు. కొంత మంది భక్తులు 41 రోజులకుగాను మండల దీక్ష తీసుకొగా, మరికొంత మంది 21 రోజుల అర్ధమండల దీక్షను తీసుకున్నారు. ఆలయ ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్ దీక్ష తీసుకున్న భక్తులకు మాల నియమాలు పూజా విధానాన్ని వివరించారు.

అస్తవ్యస్త రోడ్లతో ప్రమాదాలు

హనుమకొండ బస్‌స్టేషన్‌లో ఆగమాగం

రోడ్ల మరమ్మతులు మరిచిన అధికారులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బాలసముద్రం, ఆగస్టు 11: హనుమకొండ బాలసముద్రంలో వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారి స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం బస్సుల రద్దీతో దుమ్ము లేచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండ బస్టాండ్, బాలసముద్రం వెళ్లే ప్రధాన రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. ముందు ఏదైనా వాహనం వెళ్తుందంటే చాలు.. వెనకాల ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇటీవల రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి వేశారు. కాంట్రాక్టర్ పనులు తాత్కాలికంగా పనులు చేయడంతో కురుస్తున్న వర్షాలకు గుంతలలో నీరు నిలిచి ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎండలు కొట్టిన రోజు బస్సులు, ఇతర వాహనాలు వెళుతుంటే వెనకాల ద్విచక్ర వాహనాలలో ప్రయాణికులకు దుమ్ము కళ్లలోకి రావడంతో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కోట్ల నిధులు ఖర్చు చేస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పటించకపోవడంతో రోడ్లు అధ్వానంగా తయారైనట్లు నగర ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.



బాలసముద్రంలో రోడ్డుపై ఏర్పడిన గుంత



హనుమకొండ బస్టాండ్‌లో బస్సు వెనకాల రోడ్డుపై లేస్తున్న దుమ్ము

అస్తవ్యస్తంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం బురదమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే దారిలో డ్రెయినేజీ నీరు నిలిచి ఉండడంతో నడిచి వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో బస్టాండ్ ప్రాంగణం అస్తవ్యస్తంగా మారినట్టు చెబుతున్నారు. బస్టాండ్‌లో కొద్దిపాటి వర్షం కురిస్తేనే బస్టాండ్ ప్రాంగణమంతా బురద పేరుకుపోయి ప్రయాణికులు కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు బస్టాండ్‌లో వర్షం నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

అట్టడుగు వర్గాలకు అందని శాస్త్ర, సాంకేతికత

• కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి

• జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ 5వ మహాసభలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 11: స్వాతంత్ర్యం వచ్చి 77 యేళ్లు గడుస్తున్నప్పటికీ శాస్త్ర, సాంకేతిక ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరకపోవడం వల్ల భారత్ ఆశించినమేర వివిధ రంగాలలో అభివృద్ధి చెందలేదని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అభిప్రాయపడ్డారు. హనుమకొండ కిషన్‌పుర వాగ్దేవి విద్యా సంస్థల ఆడిటోరియంలో ఆచార్య కాశీనాథ్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ 5వ మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకొని శాస్త్రీయంగా ఆలోచించిన నాడే అభివృద్ధి చెందిన దేశం అవుతుందన్నారు. ప్రధానవక్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. భారత్‌లో మేధావులుగా పిలువబడుతున్న వారిలో కూడా మూఢనమ్మకాలు ప్రబలుతున్నాయని, ఈ అంతరం తగ్గాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు జనవిజ్ఞాన వేదిక ప్రజల్లోకి మరింతగా చొచ్చుకెళ్లి కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా జరిగిన వైజ్ఞానిక సదస్సులో నిట్ విశ్రాంత ఆచార్యుడు రామచంద్రయ్య, 'శాస్త్రీయ దృక్పథం - ప్రస్తుత ఆవశ్యకత' అనే అంశంపై విశ్రాంత అటవీశాఖాధికారి పురుషోత్తం 'అవయవదానం - సామాజిక బాధ్యత' అనే అంశంపైన, విశ్రాంత ఆచార్యుడు కె.లక్ష్మారెడ్డి జన విజ్ఞాన వేదిక ఆశయాలపై, ఏసీపీ విజయ్‌కుమార్ ప్రజలు సైబర్ నేరస్తుల చేతిలో చిక్కకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సదస్సులో ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు రెండేళ్లుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమ వివరాల నివేదికను సమర్పించారు. డాక్టర్ శ్రీనివాస్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం రాబోయే రెండేళ్లకు గాను నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాజీపేట పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా రామంచ భిక్షపతి, కోశాధికారిగా పరికిపండ్ల వేణు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాములు, ప్రొఫెసర్ కాశీనాథ్, ఉమామహేశ్వర్‌రావు, శ్రవణ్‌కుమార్, సుమలతలు, కార్యదర్శులుగా కుమారస్వామి, భిక్షపతి, దయాకర్, వందనలు, సబ్ కమిటీ కన్వీనర్లుగా కేవీ .ధర్మ ప్రకాష్, మంజుల, ప్రభాకరాచారి, ప్రొఫెసర్ ఆంజనేయులు, పాల కుమారస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య మల్లారెడ్డి

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు

మడికొండ, ఆగస్టు 11: మడికొండలోని సత్యసాయి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఓకార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల కిషన్, కుసుమ సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, ఎలగొండ శివ, మాచర్ల రంజిత్, కిరణ్, దార ధనుంజయ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

హనుమకొండ టౌన్, ఆగస్టు 11: హనుమకొండ జిల్లా కేయూ డబ్బాల్ 54వ డివిజన్‌లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్‌మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకాగా జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా రేణికుంట్ల రాజేందర్, అధికార ప్రతినిధిగా రామంచ అజయ్, ఉపాధ్యక్షుడిగా దూడపాక రాజు, ప్రధాన కార్యదర్శిగా బొల్లి నవీన్, కార్యదర్శిగా రేణికుంట్ల సుధాకర్, ప్రచార కార్యదర్శిగా పారునంది సాయి, కోశాధికారిగా దాసారపు రాంచరణ్‌లు ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, రచయితలు, మాదిగ సంఘ మేధావులు పాల్గొన్నారు.

నేడు కేయూలో లైబ్రరీ దినోత్సవ వేడుకలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 11: కాకతీయ యూనివర్సిటీ కేంద్ర గ్రంథాలయంలో ఆగస్టు 12న సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు లైబ్రరీ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 132వ జయంతిని పురస్కరించుకుని లైబ్రరీ డే సెలబ్రెషన్స్ నిర్వహిస్తున్నామని కేయూ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (కుప్లా) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణమాచార్య ఆదివారం తెలిపారు.

కుప్లా, కేయూ డిపార్టుమెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, తెలంగాణ లైబ్రరీ అసోసియేషన్ వరంగల్ జిల్లా సంయుక్త నిర్వహణలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కుప్లా అధ్యక్షుడు పి.కొండల్‌రెడ్డి, టీఎస్ఎల్ఏ ప్రెసిడెంట్ కె.రమణయ్య, కేయూ లైబ్రరీ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.షమిత, డాక్టర్ బి.రాధికారాణి, కుప్లా జనరల్ సెక్రటరీ వి.కృష్ణమాచార్య,డి. సత్యనారాయణరావు, లైబ్రరీయన్ టి.జావేర్, డాక్టర్ జి.రాజేశ్‌కుమార్, ఎం.మనోహర్‌రావులు హాజరుకానున్నట్లు తెలిపారు. బీఎల్ఐఎస్సీలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఉత్తమ లైబ్రరీయన్‌కు సన్మానం, ఉత్తమ చదువరికి సన్మానంతో అవార్డు అందచేస్తామని కృష్ణమాచార్య తెలిపారు.

రైల్వే ఇనిస్టిట్యూట్‌లో సాంస్కృతిక పోటీలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దీపిక ప్రశాంత్ కృష్ణసాయి

కాజీపేట, ఆగస్టు 11: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో సాంస్కృతిక పోటీలు, చెస్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కాజీపేట సబ్‌డివిజనల్ అధ్యక్షురాలు ఆర్.దీపిక ప్రశాంత్ కృష్ణసాయి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిని కాపాడడం కోసం సాంస్కృతిక పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఈ ఇనిస్టిట్యూట్ చైర్మన్ ప్రశాంత్‌కృష్ణసాయి, ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్ రావు, కల్చరల్ విభాగాల ఆర్గనైజర్ దారావత్ రఘు, పాల్గొన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గోపాల్‌పూర్ చెరువు పరిరక్షణే లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

వడ్డెపల్లి, ఆగస్టు 11: హనుమకొండలోని గోపాల్‌పూర్ ఊర చెరువు పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్ ఊరచెరువు ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్‌తో పాటు ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం, కాంగ్రెస్ శ్రేణులు ఊర చెరువు అన్యాక్రాంతమవుతున్న విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. గోపాల్‌పూర్ ఊర చెరువు అభివృద్ధికి, కట్ట బలోపేతానికి, చెరువులోని గుర్రపుడెక్క తొలగించేందుకు కృషి చేస్తానని అన్నారు.

ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలను చేపట్టడం చట్టపరంగా విరుద్ధమని పేర్కొన్నారు. ఆయన వెంట 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హర్షకుమార్, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, వివేక్‌నగర్ కాలనీ అధ్యక్షుడు మీసాల రమేష్, కాంగ్రెస్ శ్రేణులు కందుకూరి పూర్ణచందర్, ప్రజా సంఘాల నాయకులు మర్రి ప్రభాకర్, వేణుగోపాల్‌రావు, పింగిళి అశోక్‌రెడ్డి, జనప సారంగపాణి, దూలం పెద్ద రాజు గౌడ్, అనిత, గూడెం రమేష్ ఉన్నారు.



చెరువు ఆక్రమణ గురించి ఎమ్మెల్యే నాగరాజుకు వివరిస్తున్న కార్పొరేటర్ సునిల్‌కుమార్, కాంగ్రెస్ శ్రేణులు

ఆటోడ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సంజీవరావు

కాజీపేట, ఆగస్టు 11: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఆటో స్టాండ్‌లో ఆటోడ్రైవర్లకు ఆదివారం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు అవగాహన కల్పించారు. ఆటోలు రైల్వేస్టేషన్ స్టాండ్‌లోనే పార్కింగ్ చేయాలని, ఆటోడ్రైవర్‌లు యూనిఫామ్ ధరించాలని చెప్పారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, అనుమానాస్పద వస్తువులు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. రైల్వే ప్రయాణీకులకు ఇబ్బందికలిగే చర్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలలో ప్రయాణికులు వస్తువులు మరిచిపోతే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

జోరుగా యూత్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


హసన్‌పర్తి, ఆగస్టు 11: మండలంలో యూత్ కాంగ్రెస్ నాయకత్వం కోసం ఎన్నికల ప్రచారం పారంభమైంది. ఈనెల 14వ తేదీ నుంచి నెలపాటు జరగనున్న జిల్లా, నియోజకవర్గ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ఆన్‌లైన్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ప్రకటించింది. దశాబ్ద కాలం తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో పదవులను దక్కించుకునేందుకు నాయకుల మధ్య పోటీ అనివార్యమైంది. దీంతో ఆయా జిల్లాల, నియోజకవర్గాల, మండలాల అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న నాయకులు ఇప్పటి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

ఈ క్రమంలోనే జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రామనర్సింహరెడ్డి ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండలంలోని ఆదివారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కేఆర్.దిలీప్, వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆవుల పవన్, హసన్‌పర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సౌరం చరణ్‌తేజ తమకు మద్దతు తెలపాలని కోరుతూ సీతంపేటలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెకటరీ తోకల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మదన్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు శ్రీరాం, మాజీ ఉపసర్పంచ్ భూక్య రాజు, సీతంపేట నాయకులు తోకల జగన్‌మోహన్‌రెడ్డి, దాడి రాజీవ్‌గాంధీ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 11: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హార్టికల్చర్ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో హనుమకొండ, కాజీపేట మండలాలకు చెందిన హార్టికల్చర్ కార్మికుల సమావేశం అల్లం సాంబలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు.ఈసందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. సమావేశంలో హార్టికల్చర్ కార్మికులు స్వప్న, సునిత, కవిత,రమాదేవి, అశ్విని, రాధిక పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మల్లికుదుర్లలో అమరేందర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కడియం శ్రీహరి

వేలేరు, ఆగస్టు 11: వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన సారంపల్లి అమరేందర్‌రెడ్డి (45), ఆదే గ్రామానికి చెందిన గురజా ల మల్లారెడ్డి (65)లు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం అమరేందర్ రెడ్డి మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మం డల కాంగ్రెస్ నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు సద్దాం హుసేన్, రవీందర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ బాల్నే వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌యాదవ్, తీగల మహేందర్, రంజిత్‌రెడ్డి ఉన్నారు.

● మడికొండ: మడికొండకు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గడ్డం శ్రీనివాస్ కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాశేశ్వరపు రాజేందర్, జిల్లా ప్రచార కార్యదర్శి జేరిపోతుల భిక్షపతి సుధీర్ భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుమారుడి అకాల మరణంతో మానసికంగా కృంగిపోయి దుఃఖ సాగరంలో మునిగిపోయిన గడ్డం శ్రీనివాస్‌ను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఆర్‌కెఎస్ నాయకులు మేస్త్రీలు పాల్గొన్నారు.

నేడు వరంగల్ మహానగర ఏకీకరణ - పునర్నిర్మాణంపై చర్చ

కాజీపేట, ఆగస్టు 11: కాజీపేట బాలవికాస సెంటర్‌లో 'వరంగల్ మహానగర ఏకీకరణ - పునర్నిర్మాణం'పై మంగళవారం చర్చ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పింగిలి సంపత్‌రెడ్డి అధ్యక్షతన జరుగు ఈ చర్చలో వక్తలు కూరపాటి వెంకట్ నారాయణ, టి.రాజేశ్వర్‌రావు, ప్రొఫెసర్ పాండు రంగారావు, ఎం.సహోదర్‌రెడ్డి, రైల్వే కార్మిక నాయకులు కర్ర యాదవరెడ్డి, కేంద్ర నర్సింగరావు, దేవులపల్లి రాఘవేందర్ తోపాటు వివిధ సంఘ నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తి

హనుమకొండ టౌన్, ఆగస్టు 11: హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియం గార్డెన్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ తెలిపారు. మృతుడు సుమారు 30 నుంచి 35 యేళ్ల వయస్సు కలిగి, శరీరంపై ఆరెంజ్ కలర్ టీ షర్టు, ఖాకీ కలర్ లోయర్, కుడి చేతిపై టాటూ, వేలికి ఉంగరం, ఎడమ కాలికి నల్ల దారం ధరించి ఉన్నాడని తెలిపారు. సుమారు 6 అడు గుల ఎత్తు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ సెల్ నెం. 8712685113, ఎస్సై కె.సతీష్ సెల్‌నెం.9493789321, 8712685002 నెంబర్లకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం • 12 ఆగస్టు 2024

స్ఫూర్తి



సాయం చెయ్యడానికి సంపదలు అక్కర్లేదు... స్పందించే హృదయం ఉంటే చాలని నిరూపిస్తున్నారు ఉమారాణి. కోవిడ్ కాలంలో ప్రారంభించిన అన్నదానాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్న ఈ చెన్నై మహిళ 'అన్నపూర్ణ'గా మన్ననలు అందుకుంటున్నారు.

అన్నపూర్ణ కేరాఫ్ చెన్నై

నిర్మానుష్యంగా ఉన్న వీధుల్లో... ఏదో ఒక మూల ఆకలితో దీనంగా కనిపించే వృద్ధులు. లాక్‌డౌన్ సడలింపు సమయంలో వీధుల్లోకి వచ్చి... ఆకలికి తీర్చుకోవడానికి యాచించే దీనులు. నాలుగేళ్ళ క్రితం... కొవిడ్ మహమ్మారి విజృంభించిన కాలంలో... ప్రతిరోజూ కనిపించే ఈ దృశ్యాలు డి.ఉమారాణిని తీవ్రంగా కలవరపెట్టాయి. ఒకవైపు పనులు లేక, మరోవైపు కడుపు నింపుకొనే మార్గం లేక తల్లడిల్లిపోతున్న వారికి తన వంతుగా ఏదైనా చెయ్యాలని ఆమె తల్లి మనసు తపనపడింది. ఆమె ఆలోచనల్లో ఊపిరిపోసుకున్న 'తవమొళి అన్నదాన కూటం' (తవమొళి అన్నదాన కేంద్రం) నాలుగున్నర సంవత్సరాల నుంచి పేదలకు కల్పతరువుగా నిలుస్తోంది.

వారే ప్రేరణ...



ఉమారాణి స్వస్థలం తమిళనాడులోని ఆరణి. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు చదువంటే ఇష్టం. కానీ చదివించే స్థోమత ఆమె కుటుంబానికి లేదు. పొరుగున ఉండే ఒక వ్యక్తి ఆమె ఆసక్తిని గమనించి, సాయం చెయ్యడానికి ముందుకువచ్చారు. "ఆయన తన పింఛన్‌లో దాచుకున్న డబ్బును నాకు ఇచ్చారు. ఆయన చేసిన సాయం నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. చదువు పూర్తయ్యాక... నర్సింగ్ ట్యూటర్‌గా చేరాను. అప్పటి నుంచి... అంటే దాదాపు పదహారేళ్ళుగా సమాజానికి నావంతుగా ఏదో విధమైన సాయం చేస్తూనే ఉన్నాను" అని చెప్పారు ఉమారాణి. కొవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయిన వారికి, దిక్కులేనివారికీ అండగా నిలవాలని... చెన్నైలోని కీల్‌కట్టలై ప్రాంతంలో ఉచిత భోజన కేంద్రాన్ని ప్రారంభించారు. "అప్పట్లో నేను చెన్నై శివార్లలోని ఒక కేర్ సెంటర్‌లో పని చేసేదాన్ని. నేను దాచుకున్న డబ్బు, వచ్చే జీతంతో రోజూ కనీసం అయిదారు వందలమందికి భోజనాలు పెట్టేదాన్ని. లాక్‌డౌన్‌ను పూర్తిగా తొలగించేవరకూ మాత్రమే ఈ కేంద్రాన్ని నడపాలని అనుకున్నాను" అని చెప్పారు ఉమారాణి. కానీ ఆ తరువాత కూడా దాన్ని కొనసాగించడానికి పేద ప్రజలే ఆమెకు ప్రేరణగా నిలిచారు. "నిరుపేద వృద్ధులు, కుటుంబ సభ్యులు పట్టించుకోకుండా వదిలేసినవాళ్ళు, బిక్షగాళ్ళు, ఇళ్ళలో పనిచేసేవారు, స్వీపర్లు, రోజు కూలీలు, రిక్షా డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేసేవారు, చిరుద్యోగులు... ఇలా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎందరో భోజనానికి వస్తూ ఉంటారు. చాలామంది మా కేంద్రం మీదే ఆధారపడుతున్నారు. హఠాత్తుగా ఆపేస్తే వాళ్ళ పరిస్థితి ఏమిటి? అని ఆలోచించాను. నా సన్నిహితులను సంప్రదించాను. "బయట యాభై రూపాయలు పెడితేకానీ టిఫినైనా దొరకడం లేదు. మాకు చేతనైనంత విరాళాలు ఇస్తాం. మీ సేవలను ఆపొద్దు" అని వాళ్ళు హామీ ఇచ్చారు. మరోవైపు ఉద్యోగం చేస్తూ... కేంద్రాన్ని కొనసాగించడం కష్టమైంది. దాంతో ఉద్యోగం మానేసి... పూర్తిగా దీనికే అంకితమయ్యాను" అంటారు ఉమామణి.

ఆ ఆకాంక్షతో...

రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం... ఇలా మూడు పూటలా ఈ అన్నదాన కేంద్రం ఆహారాన్ని అందిస్తోంది. భోజనంలో అన్నం, తృణధాన్యాల కిచిడి, సాంబారు, కూర, రసం, మజ్జిగ ఉంటాయి. "ఇప్పుడు రోజూ ఎనిమిదివందల మంది వరకూ వస్తున్నారు. పేదలతో పాటు దిగువ మధ్య తరగతివారు, చిరుద్యోగులు, విద్యార్థులు కూడా వారిలో ఉంటారు. నా కుటుంబం, బంధుమిత్రులు చేసే సాయంతో, దాతలు ఇచ్చే విరాళాలతో కేంద్రాన్ని నడుపుతున్నాను. చాలాసార్లు డబ్బు సరిపోదు. ఎవరో ఒకరి సాయంతో నెట్టుకొస్తున్నాను. వంట పని మొత్తం నేనే చేస్తాను. పదో క్లాసు, ఆరోక్లాసు చదువుతున్న నా పిల్లలిద్దరూ సాయపడతారు. వడ్డనలు, ఇతర పనులు కొందరు స్వచ్ఛందంగా చేస్తున్నారు" అని చెప్పారు ఉమామణి. ఆమెను స్థానికులు 'అన్నపూర్ణి' (అన్నపూర్ణాదేవి) అని పిలుస్తూ ఉంటారు. "ఆమె ఎవరో నాకు తెలీదు. నేనెవరో ఆమెకు తెలీదు. కానీ ఆమె అన్నదాతగా, నేను ఆకలితో ఉన్న వ్యక్తిగా... మా ఇద్దరి మధ్యా బంధం ఏర్పడింది" అని ఒక వృద్ధురాలు చెబితే... "కొవిడ్ సమయంలో పనుల్లేక ఎంతో కష్టపడ్డాం. అప్పుడే ఉమారాణి ఉచిత భోజనం గురించి తెలిసింది. నాటినుంచి క్రమం తప్పకుండా ఇక్కడికి వస్తున్నాను" అంటారు మరో రోజుకూలీ. ఆహార కేంద్రంతోపాటు కొందరు వృద్ధుల సంరక్షణ బాధ్యతను కూడా తనపై వేసుకున్నారు ఉమారాణి. "ఎవరూ ఆకలితో బాధపడకూడదనేది నా ఆకాంక్ష. తాగుబోతులు తప్ప ఎవరైనా మా కేంద్రానికి రావచ్చు. భోజనం చేయవచ్చు. నాకు ఓపిక ఉన్నంత వరకూ అన్నదాన కేంద్రాన్ని నడుపుతాను" అంటున్నారీ ముప్పై ఆరేళ్ళ చెన్నై అన్నపూర్ణ..



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
4. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
5. నాదానియా (నాదానియా)
6. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
7. ఓ మాహీ (డంకీ)
8. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
9. చలేయా (జవాన్)
10. నైనా (క్రూ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
కుర్చీ మడతపెట్టి
(గుంటూరు కారం)

వయసు అనేది కేవలం సంఖ్య మాత్రమే... కాదనగలరా..! అదీ ఈ అపు'రూపం' చూశాక..! దీపికా... అలియా... సారా... నవతరం తారలు హొయల సునామీలోనూ... అలనాటి అందం నేటికీ ప్రత్యేకమే అనక తప్పదు... **జీనత్ అమన్** చిత్రాలు చూశాక. వైవిధ్యమైన డ్రెస్సులు ధరించి... నయా లుక్స్‌తో అభిమానులను అలరిస్తూ... ర్యాంప్‌పైనే కాదు... ఇన్‌స్టాలోనూ సరికొత్త ఫ్యాషన్ ఐకాన్ అయ్యారు జీనత్.

స్టైల్ అదిరే..!

ఐకాన్



అవకాశం వచ్చినప్పుడే కాదు... ఏ అవకాశం లేకపోయినా... తన నుంచి చూపు తిప్పుకోనివ్వడంలేదు జీనత్ అమన్. 'దమ్ మారో దమ్... మిట్ జాయే గమ్' అంటూ నాడు యువతరాన్ని ఊపేసిన జీనత్... ఆ తరువాత విభిన్న పాత్రలకు పెట్టింది పేరుగా... మంచి నటిగా కోట్లమంది హృదయాల్లో కొలువయ్యారు. ఇప్పటికీ... డెబ్భై రెండేళ్ల వయసులోనూ ఆమెలో అదే వైవిధ్యం. 'వయసనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే' అని మాటల్లో చెప్పడం కాకుండా... చేతల్లో చూపిస్తున్నారు. సందర్భం ఏదైనా ఎప్పటికప్పుడు ట్రెండీ టచ్‌తో నవతరానికి స్ఫూర్తినిస్తున్నారు.

లాక్మే ఫ్యాషన్ వీక్‌లో వినూత్న ఆహార్యంతో రన్‌వేపై మైమరిపించినా... ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌పేజీ మీద మెరిసినా... చాలా ఏళ్ల తరువాత మళ్లీ రంగస్థలంపై కస్తూర్బా గాంధీగా అద్భుతమైన అభినయంతో ఆకట్టుకున్నా... జీనత్‌కే ప్రత్యేకం. వయసు మీద పడుతున్నా... కాలంతో పోటీపడుతూ... అందుకు అనుగుణంగా తనను తాను మలుచుకొంటున్నారు. నిత్యనూతనంగా కనిపిస్తూ... అందానికి సరికొత్త నిర్వచనం ఇస్తున్నారు.

జీనత్ ఇన్‌స్టాగ్రామ్‌లోకి వెళితే... ఫ్యాషన్‌కు పుట్టిల్లులా అనిపిస్తుంది. ఫొటో షూట్లు... ర్యాంప్ వాక్‌ల చిత్రాలతో కలర్‌ఫుల్‌గా ఉంటుంది. వాటితోపాటు అప్పుడప్పుడూ తన సినీ, వ్యక్తిగత జీవిత విశేషాలు... రోజువారీ జీవనగమనంలో ఎదురయ్యే అనుభవాలను అందరితో పంచుకొంటారు జీనత్. సందర్భానుసారం అలనాటి తన పాత్రల ఫొటోలు వదులుతుంటారు. వయసు మనసుకు కాదని... అది ఎప్పుడూ ఉత్సాహభరితంగా ఉరకలేస్తూ ఉంటుందని చెప్పకనే చెబుతారు జీనత్.

అంతేకాదు... అమూల్యమైన సందేశాలు, సూచనలు, సలహాలతో సాధికారత దిశగా మహిళలను ప్రోత్సహిస్తున్నారు. వారి విజయాలను తన విజయాలుగా ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ... స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు. యువతలో చైతన్యం రగిలించి, వారిని లక్ష్యం వైపు నడిపించేందుకు సామాజిక మాధ్యమాన్ని ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు.

బిజినెస్

మూడేళ్ల కనిష్ఠానికి ఉక్కు ధరలు

న్యూఢిల్లీ: ఉక్కు దిగుమతులు పెరగడంతో దేశీయంగా ఉక్కు ధరలు మూడు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. 2022 ఏప్రిల్‌లో టన్ను రూ.76,000 ఉన్న హాట్ రోల్డ్ కాయిల్స్ (హెచ్‌ఆర్‌సీ) ధర ఇప్పుడు రూ.51,000 పలుకుతోంది. కోల్డ్ రోల్డ్ కాయిల్స్ (సీఆర్‌సీ) టన్ను ధర ఇదే కాలంలో రూ.86,300 కోట్ల నుంచి రూ.58,200 కోట్లకు దిగజారాయి. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం జూన్ త్రైమాసికంలో ఉక్కు దిగుమతులు 68% పెరిగి 11.5 కోట్ల టన్నుల నుంచి రూ.19.3 కోట్ల టన్నులకు పెరిగాయి.

ఈ ఏడాదే రిలయన్స్ గిగా ఫ్యాక్టరీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) తన తొలి సోలార్ గిగా ఫ్యాక్టరీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ ఏడాది 20 గిగావాట్ల సోలార్ పీవీ తయారీ సామర్థ్యం సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, 2026 చివరి నాటికి దాన్ని మరో 20 గిగావాట్లకు పెంచుతామని తన వార్షిక నివేదికలో కంపెనీ తెలియచేసింది.

బంధన్ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్‌ను ట్రాకింగ్ చేసే ఓపెన్ ఎండెడ్ పథకం ఇది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ చివరి తేదీ ఈ నెల 22. గ్రోత్ ఆప్షన్స్‌తో రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్స్‌తో ఈ పథకం అందుబాటులో ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడి (సిప్) రూపంలో అయితే కనీస పెట్టుబడి రూ.100. బ్యాంక్ ఇండెక్స్‌లోని సెక్యూరిటీల్లో ఈ ఫండ్ 95-100 శాతం పెట్టుబడులు పెట్టనుంది.

ఈ ఏడాది స్టాక్ మార్కెట్లో ఎల్ఐసీ పెట్టుబడులు
1.30 లక్షల కోట్లు

సంస్థ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి వెల్లడి






న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీ మార్కెట్లో రూ.1.30 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ స్టాక్ మార్కెట్లో రూ.132 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టిందని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఇన్వెస్ట్ చేయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో పలు షేర్లలో రూ.38,000 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు ఆయన చెప్పారు. ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడుల ద్వారా ఎల్ఐసీ జూన్ త్రైమాసికంలో రూ.15,500 కోట్ల లాభం ఆర్జించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో ఆర్జించిన లాభం కన్నా ఇది 13.5 శాతం అధికమని ఆయన చెప్పారు. ఎల్ఐసీ పెట్టుబడులకు సంబంధించి మరిన్ని వివరాలు..

- గత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఎల్ఐసీ ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులు రూ.23,300 కోట్లుగా ఉన్నాయి.
- ఈ ఏడాది జూన్ 30 నాటికి వివిధ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడుల మొత్తం విలువ రూ.15 లక్షల కోట్లకు చేరింది. అదే తేదీ నాటికి మొత్తం 282 కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులున్నాయి.
- జూన్ చివరి నాటికి ఎల్ఐసీ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 16.22 శాతం పెరిగి రూ.53,58,781 కోట్లకు చేరింది. గత ఏడాది జూన్ చివరికి ఈ విలువ రూ.46,11,067 కోట్లుగా ఉంది.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ మొత్తం పెట్టుబడులు రూ.7,30,662 కోట్ల మేరకు పెరిగి రూ.42,44,852 కోట్ల (2023 మార్చి 31) నుంచి రూ.49,75,514 కోట్లకు (2024 మార్చి 31) చేరింది.
- మొత్తం పెట్టుబడిలో ఈక్విటీ పెట్టుబడుల వాటా 2022-23లో రూ.8,39,622 కోట్లుగా ఉండగా 2024 మార్చి 31 నాటికి రూ.12,39,740 కోట్లకు చేరింది. ఇదే కాలంలో ఇతర విభాగాల్లో పెట్టుబడులు రూ.34,05,190 కోట్ల నుంచి రూ.37,35,774 కోట్లకు పెరిగాయి.

తగ్గిన సిమెంట్ ధరలు

» కంపెనీలకు కలిసిరాని జూన్ త్రైమాసికం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికం సిమెంట్ కంపెనీలకు పెద్దగా కలిసి రాలేదు. ఈ కాలంలో అల్ట్రాటెక్ సిమెంట్, అంబుజా సిమెంట్స్, ఏసీసీ, శ్రీ సిమెంట్స్, దాల్మియా భారత్ వంటి ప్రధాన కంపెనీల సిమెంట్ అమ్మకాలు 3 నుంచి 9 శాతం పెరిగాయి. అయితే ధరలు తగ్గటంతో కంపెనీల ఆదాయాలు, లాభాలకు గండి పడింది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో 50 కిలోల సిమెంట్ బస్తా సగటు ధర 3 శాతం తగ్గి రూ.348కు చేరింది. ఇదే సమయంలో ఫ్లైయాష్, స్లాగ్ వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు గణనీయంగా పెరిగాయి. ఇది కంపెనీల ఆదాయాలు, లాభాలను దెబ్బతీసింది. ఇవి చాలవన్నట్టు పులి మీద పుట్రలా సూర్యుడి భగభగలు, ఎన్నికల ప్రచార హోరుతో నిర్మాణ రంగంలో కార్యకలాపాలకు బ్రేక్ పడింది.

ఫ్లాట్‌గా లాభాలు

ఈ కారణంగానే అల్ట్రాటెక్ కంపెనీ ఆదాయం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో 1.87 శాతం వృద్ధి రేటుతో రూ.18,069.56 కోట్లకు చేరినా నికర లాభం మాత్రం ఫ్లాట్‌గా రూ.1,696.56. కోట్లుగా నమోదు చేసింది. ఏసీసీ నికర లాభాలకైతే జూన్ త్రైమాసికంలో 22.46 శాతం గండి పడి రూ.361.40 కోట్లకు చేరింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం స్వల్పంగా తగ్గి రూ.5,154.89 కోట్లుగా నమోదైంది. అయితే జూన్ త్రైమాసికం నిరాశ పరిచినా భవిష్యత్‌కు మాత్రం ఢోకా లేదని కంపెనీలు కొండంత ఆశాభావంతో ఉన్నాయి. పుంజుకుంటున్న గృహ, మౌలిక సదుపాయాల నిర్మాణం, బడ్జెట్‌లో మౌలిక, గృహ రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంతో పాటు దేశవ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదు కావటం సానుకూల అంశాలుగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలంటున్నాయి.

పండగ సీజన్ అమ్మకాలపైనే ఆశలు

టాటా మోటార్స్

న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ కంపెనీలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎగుమతులు పెద్దగా కలిసొచ్చే సూచనలు కనిపించడం లేదు. దీంతో దేశీయ డిమాండ్ ముఖ్యంగా వచ్చే పండగల సీజన్ అమ్మకాలపైనే కంపెనీలు గంపెడాశలు పెట్టుకున్నాయి. టాటా మోటార్స్ కంపెనీ గ్లోబల్ సీఎఫ్ఓ పీబీ బాలాజీ అనలిస్టుల కాల్‌కు సమాధానంగా ఈ విషయం చెప్పారు. వర్షాలు క్రమంగా పుంజుకోవడం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టడం, కొత్త వాహనాల విడుదల ఇందుకు దోహదం చేస్తాయన్నారు. ప్రధాన ముడిపదార్థాల ధరలు కూడా ప్రస్తుతం స్థిరంగా ఉన్నాయి. కాబట్టి వచ్చే త్రైమాసికాల్లోనూ కంపెనీ లాభాలకు పెద్దగా ఢోకా ఉండక పోవచ్చన్నారు. ప్రస్తుతం ఆటోమొబైల్ డీలర్ల వద్ద వాహన నిల్వలు 67 నుంచి 72 రోజులకు చేరాయి. వీటి విలువ రూ.73,000 కోట్ల వరకు ఉంటాయని అంచనా. ఈ నేపథ్యంలో టాటా మోటార్స్ ఉన్నతాధికారి ఈ విషయం చెప్పడం విశేషం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	475
వరంగల్	447	గోదావరి	466
చిత్తూరు	493	విశాఖపట్నం	475
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	96
కర్నూలు	80	నెల్లూరు	96
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

ఆటుపోట్లు తప్పకపోవచ్చు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మరింత ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రతరం కావటం, అమెరికా సహా యూరప్ ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉండటమే ఇందుకు కారణం. వీటి ప్రభావం భారత మార్కెట్లపై ఎక్కువగా కనిపిస్తోంది. సెబీ చీఫ్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలు కూడా ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. గడచిన రెండు వారాలుగా నష్టాల్లోనే ముగిసిన సూచీలు గత శుక్రవారం మాత్రం లాభాలతో ముగిసాయి. కాగా ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు మెరుగుపడేంత వరకు మదుపరులు ఆచితూచి వ్యవహరించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

మహీంద్రా అండ్ మహీంద్రా: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేర్లలో కన్సాలిడేషన్ జరుగుతోంది. జూన్ త్రైమాసిక ఫలితాల తర్వాత మళ్లీ మూమెంటమ్ పెరిగింది. ప్రస్తుతం ఈ షేరు కీలక మద్దతు స్థాయికి చేరుకుంది. గత శుక్రవారం ఈ షేరు 2.47 శాతం లాభంతో రూ.2,749 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,740/2,720 శ్రేణిలో ప్రవేశించి రూ.2,850/2,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,700 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సీజీ పవర్: ఈ షేరు ప్రస్తుతం స్వల్పకాలిక డౌన్‌ట్రెండ్‌లో ఉంది. తాజా ఆర్థిక ఫలితాల తర్వాత మూమెంటమ్, వాల్యూమ్ గణనీయంగా పెరిగాయి. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం 5.09 శాతం లాభంతో రూ.713 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.700 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.775/790 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.680 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సీడీఎస్ఎల్: కన్సాలిడేషన్ అనంతరం ఈ షేరు పుంజుకుంది. గత శుక్రవారం 4.57 శాతంతో రూ.2,565 వద్ద క్లోజైంది. సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. ఈపీఎస్ క్రమంగా పెరుగుతుండటం శుభసూచకం. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,500 స్థాయిలో ప్రవేశించి రూ.2,750/2,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,460 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాసిమ్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 10 శాతం మేర కరెక్షన్ జరిగింది. జూన్ త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం ఇంట్రాడేలో 4 శాతం వరకు పెరిగిన ఈ షేరు చివరకు 1.10 శాతం లాభంతో రూ.2,572 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,550 శ్రేణిలో ప్రవేశించి రూ.2,750/2,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,510 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇన్ఫోసిస్: జీవితకాల గరిష్ఠం వైపు సాగుతున్న ఈ కౌంటర్‌లో స్వల్ప కరెక్షన్ కనిపిస్తోంది. కీలక నిరోధం వద్ద కన్సాలిడేషన్ జరుగుతోంది. రెండు వారాలుగా నష్టాల్లోనే కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో శుక్రవారం డోజీ ఫామ్ ఏర్పడింది. గత శుక్రవారం రూ.1,770 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,750 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,840/1,920 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

24,500 పైన రికవరీ తప్పనిసరి



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం డౌన్‌ట్రెండ్‌లోనే ప్రారంభమైనా రికవరీ బాట పట్టి శుక్రవారం 24,400 సమీపంలో ముగిసింది. అయినా వారం మొత్తం మీద 350 పాయింట్ల మేరకు నష్టపోయింది. అలాగే వారంలో ఏర్పడిన కనిష్ఠ స్థాయి నుంచి 450 పాయింట్ల మేరకు కోలుకుంది. 24,000 వద్ద మార్కెట్ మద్దతు తీసుకుందనేందుకు ఇది సంకేతం. అక్కడే మైనర్ బాటమ్ ఏర్పడినట్టు కనిపిస్తోంది. అయినా ఇంకా అప్‌ట్రెండ్ సంకేతం ఇవ్వాల్సి ఉంది. ఈ కారణంగా రాబోయే కొద్ది రోజుల్లో పాజిటివ్ కన్సాలిడేషన్ సాధించాలి. అయితే గత వారం తీవ్రమైన ఆటుపోట్లు ఎదుర్కొన్నందు వల్ల మార్కెట్ నిలదొక్కుకోవడం అవసరం. గత వారంలో మిడ్‌క్యాప్-100 సూచీ 750 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 400 పాయింట్లు నష్టపోయాయి. మిడ్‌క్యాప్ సూచీ అయితే ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి 1,500 పాయింట్ల మేరకు దిగజారింది. ఈ వారంలో మార్కెట్ మరింత రికవరీ సాధించే ఆస్కారం ఉంది. స్వల్పకాలిక నిరోధం 24500 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం 24,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన నిరోధాలు, టార్గెట్లు 24,800, 25,000.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,300 వద్ద విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 23,950. గత వారంలో ఇక్కడే మేజర్ బాటమ్ కూడా ఏర్పడింది. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ వారం ప్రారంభంలో 1,600 పాయింట్ల మేరకు నష్టపోయి మైనర్ రికవరీ సాధించింది. అయినా వారం మొత్తం మీద 860 పాయింట్ల నష్టంతో 50,500 సమీపంలో ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 50,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 51,500. బలహీనపడినా మైనర్ మద్దతు స్థాయి 50,300 వద్ద నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనపడుతుంది.

ప్యాటర్న్: గత వారం 50 డిఎంఏ వద్ద రికవరీ సాధించిన ఈ సూచీ ప్రస్తుతం 25 డిఎంఏ కన్నా స్వల్పంగా దిగువన ఉంది. సానుకూలత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అలాగే సానుకూలత కోసం 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,455, 24,500
మద్దతు	24,300, 24,240

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం

ఎప్పుడూ లేనిది సార్వత్రిక ఎన్నికలకు ముందు, తరవాత రాజ్యాంగంపై విపరీతమైన చర్చలు జరుగుతున్నాయి. కారణం ఒక పార్టీ అధికారంలోకి వస్తే, కొనసాగితే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ.... విపక్షాలు పెద్దఎత్తున ప్రచారంలోకి తెచ్చాయి. మరి రాజ్యాంగాన్ని మార్చడం అంత సులభమా. ఆర్టికల్ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. ఈ ఆర్టికల్‌లో నిజంగా రాజ్యాంగంలోని ఏ అంశాన్నైనా సవరించవచ్చా? ఈ మాట విన్నప్పుడల్లా ఏదో తెలియని అలజడి. సమాజాన్ని అంతా కదిలించిందని అనేక వార్తలు పత్రికల్లో ప్రస్ఫుటిస్తున్నాయి. దీని గురించి స్పష్టతనిచ్చే ఏదైనా అంశం ఉందా అని పరిశీలిస్తే మనకు కనపడేది ఒకే ఒక్క ఆశాకిరణం అదే 'రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం.

రాజ్యాంగంలో ప్రాథమిక(మౌలిక) నిర్మాణం అనే భావన ప్రస్తావించలేదు. ఈ సిద్ధాంతం సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ఉద్భవించింది. కాబట్టి ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం అనేది భారతీయ న్యాయసూత్రం. భారత రాజ్యాంగం కొన్ని ప్రాథమిక లక్షణాలను కలిగి ఉంది. వీటిని పార్లమెంటు సవరణల ద్వారా మార్చలేం. లేదా నశింపచేయలేం. రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలతో విభేదించే లేదా మార్చడానికి పార్లమెంటు ద్వారా రూపొందించిన రాజ్యాంగ సవరణ చట్టాలను సమీక్షించడానికి, కొట్టివేయడానికి సుప్రీంకోర్టుకు గల అధికారం ఈ సిద్ధాంతానికి ఆధారం. అయితే ప్రకరణ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏదైనా భాగాన్ని సవరించవచ్చు అన్న పరిమితులు లేని పార్లమెంటుకు గల అధికారాన్ని పరిమితం చేస్తూ, తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలను పేర్కొంటూ, ఈ రాజ్యాంగ మౌలిక లక్షణాలను మాత్రం స్పృశించరాదంటూ(సవరించరాదంటూ) పార్లమెంటుకు కొన్ని పరిమితులను, హద్దులను ఏర్పాటు చేస్తూ న్యాయవ్యవస్థ తన తీర్పుల ద్వారా రూపొందించిన సిద్ధాంతమే రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ద్వారా సుప్రీంకోర్టు, రాజ్యాంగం పవిత్రతను, రాజ్యాంగ స్వభావాన్ని పరిరక్షిస్తోంది. అందుకోసం రాజ్యాంగం తనకు కల్పించిన అధికారంతో పార్లమెంటు రాజ్యాంగ మౌలిక వ్యతిరేక రాజ్యాంగ సవరణ చట్టాలను తన తీర్పులతో ఖండిస్తూ వస్తోంది. రాజ్యాంగ ప్రాథమిక ఆదర్శ భావాలను తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంలోకి తెస్తూ మౌలిక నిర్మాణ సిద్ధాంతాన్ని విస్తరింపచేస్తూ ఉంది.



మౌలిక, స్వరూప సిద్ధాంత పరిణామక్రమం

కేశవానంద భారతి కేసు(1967)లో సుప్రీంకోర్టు పార్లమెంటుకు 368వ ప్రకరణ కింద ప్రాథమిక హక్కులను సవరించే అధికారం లేదని, రాజ్యాంగ పరిషత్‌కు మాత్రమే అలాంటి అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పును అధిగమించడానికి పార్లమెంటు 24వ రాజ్యాంగ సవరణ(1971)ను చేసింది. దీని ప్రకారం రాజ్యాంగ సవరణ చట్టాలు ప్రకరణ 13(2) కింద చెల్లవని ప్రకటించడానికి వీల్లేదు. అయితే కేశవానంద భారతి కేసు(1973)లో 24వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని, కానీ 'రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని' మార్చే అధికారం మాత్రం లేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పులోని ప్రధానాంశాలను పరిశీలిస్తే పార్లమెంటుకు ఉన్న సవరణ అధికారాలపై అంతర్గతమైన, కనిపించని పరిమితిని ధర్మాసనం విధించినట్లు తెలుస్తుంది. ఈ తీర్పునే రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని ప్రవచించిన కేసుగా ప్రస్తావిస్తున్నారు.

కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు. అవి-

- రాజ్యాంగ ఆధిక్యత ● ప్రవేశిక
- ప్రజాస్వామ్య, గణతంత్ర ప్రభుత్వం
- రాజ్యాంగపరంగా లౌకిక స్వభావం
- శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య అధికార పృథక్కరణ ● సమాఖ్య లక్షణం
- భారతదేశ సార్వభౌమాధికారం, ఏకత్వం
- ప్రజాసామ్యబద్ధమైన రాజకీయ వ్యవస్థ కలిగి ఉండటం
- వైయక్తిక స్వేచ్ఛ

ఇందిరాగాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసు(1975)

ఈ కేసులో భారత రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు.

- భారతదేశం ఒక సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం
- సమాన హోదా అవకాశాలు ● లౌకికత్వం
- అంతరాత్మ స్వాతంత్ర్యం ● సమన్యాయం

మినర్వా మిల్స్ కేసు(1980)

కేశవానంద భారతి కేసు తీర్పు తరవాత పార్లమెంటు 42వ రాజ్యాంగ సవరణ(1976) ద్వారా ప్రకరణ 368కి 4, 5 క్లాజులను చేర్చి న్యాయసమీక్షాధికారాన్ని తగ్గించడం ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. అయితే సుప్రీంకోర్టు మినర్వా మిల్స్ కేసులో ప్రకరణ 368కి చేర్చిన 4, 5 క్లాజులు చెల్లవని తీర్పుచెప్పి రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతానికి తిరిగి ప్రాణప్రతిష్ఠ చేసి తన ఉనికిని సగౌరవంగా చాటుకుంది.

వామన్‌రావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1981)

ఈ కేసులో కూడా మౌలిక నిర్మాణ సూత్రాన్ని సుప్రీంకోర్టు మరోసారి నొక్కిచెప్పింది. మౌలిక నిర్మాణం అనే భావన 24 ఏప్రిల్ 1973(కేశవానంద భారతి కేసు తీర్పు) తరవాత జరిగిన అన్ని రాజ్యాంగ సవరణ చట్టాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది.

జమ్మూకాశ్మీర్‌లో కాంట్రాక్ట్ వర్క్స్ రద్దుకు సంబంధించి దాఖలైన కేసులో జమ్మూకాశ్మీర్, లడ్డాఖ్ హైకోర్టు వ్యాఖ్యానిస్తూ... ఆర్టికల్ 21 కింద హామీ ఇచ్చిన జీవించేహక్కు అండ్ స్వేచ్ఛహక్కు; ఆర్టికల్ 19(ఐ)(జి) ప్రకారం హామీ ఇచ్చిన వాణిజ్యం లేదా వ్యాపారాన్ని కొనసాగించే హక్కు తప్పనిసరిగా రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఏర్పరుస్తుందని, పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా కూడా రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని తారుమారుచేయడం సాధ్యం కాదని 29 జూలై 2024న కోర్టు పేర్కొనడం గమనార్హం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

- **కిహోటో హోలోహన్ వర్సెస్ జుచిల్లు కేసు(1992):** ఈ కేసులో ప్రాథమిక నిర్మాణ లక్షణాలకు స్వేచ్ఛ, న్యాయమైన ఎన్నికలు జోడించారు.
- **ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1992):** ఈ కేసులో 'రూల్ ఆఫ్ లా'ను ప్రాథమిక లక్షణంగా పేర్కొంది.
- **ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1994):** ఈ కేసులో సమాఖ్య నిర్మాణం, భారతదేశ ఐక్యత, సమగ్రత, లౌకిక వాదం, సామ్యవాదం, సామాజిక న్యాయం, న్యాయ సమీక్ష ప్రాథమిక లక్షణాలుగా పునరుద్ఘాటించింది.
- **ఐఆర్ కొయల్హో వర్సెస్ తమిళనాడు కేసు(2007):** ఈ కేసులో కేశవానంద భారతి కేసులో తీర్పు వెలువడిన తరవాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాల రాజ్యాంగబద్ధతను న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చని పేర్కొన్నారు.

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

టైమ్ సీక్వెన్స్ టెస్ట్

1. ముగ్గురు స్నేహితులు సినిమాకి వెళ్లాలనుకున్నారు. సాగర్ "నేను శుక్రవారం, శనివారం, సోమవారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. మరో స్నేహితుడు సందీప్ "నేను బుధవారం, శుక్రవారం, ఆదివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. ఇంకొక స్నేహితుడు శ్రీకర్ "నేను సోమవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. అయితే వారు ముగ్గురు ఏ రోజున సినిమాకు వెళ్లడానికి సాధ్యమవుతుంది.

ఎ) గురువారం బి) శుక్రవారం
సి) ఏరోజు సాధ్యం కాదు డి) చెప్పలేం.

సమాధానం: (సి)

వివరణ: సాగర్ అందుబాటులో ఉండే రోజులు శుక్ర, శని, సోమ వారాలు. సందీప్ అందుబాటులో ఉండే రోజులు బుధ, శుక్ర, ఆది వారాలు. శ్రీకర్ అందుబాటులో ఉండే రోజులు సోమ, గురు శని వారాలు

ముగ్గురు స్నేహితులకు కామన్‌గా ఏ రోజు అందుబాటులో లేదు. కావున ఏ రోజు సాధ్యంకాదు అనేది సమాధానం అవుతుంది.

2. ఆకాశ్ ప్రతి రోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరే సమయం కంటే ఈరోజు 15 ని.లు ముందు బయలుదేరాడు. ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.లు సమయం అవసరం. ఈరోజు అకాశ్ బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఎ.ఎం. అని అతను ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఏ సమయంలో బయలుదేరేవాడు?

ఎ) 8.30 ఎ.ఎం. బి) 8.45 ఎ.ఎం.
సి) 8.15 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆకాశ్ ఈరోజు బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.ల సమయం అవసరం అనగా ఈరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరిన సమయం 8.40-10=8.30 ఎ.ఎం. ప్రతిరోజు కంటే ఈరోజు 15 ని.ల ముందు బయలుదేరాడు. అనగా దీని అర్థం ప్రతిరోజు, ఈరోజు కంటే 15 ని.ల ఆలస్యంగా బయలుదేరతాడని అర్థం. కావున ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఆకాశ్ బయలుదేరు సమయం 8.30+15=8.45 ఎ.ఎం.(ప్రతిరోజు 8.45 ఎ.ఎం.కి బయలుదేరితేనే కదా ఈ రోజు 15 ని.లు ముందుగా అనగా 8.30 ఎ.ఎం. అయ్యేది.)

3. ఒక మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.లు ముందు వచ్చారు. ఈయన అతిథుల కంటే 15 ని.లు ఆలస్యంగా వచ్చారు. అతిథులు సమావేశ సమయం కంటే 5 ని.ల ముందు ఉన్నారు అయితే ఏ సమయంలో సమావేశాన్ని నిర్వహించవచ్చు?

ఎ) 10.15 ఎ.ఎం. బి) 10.20 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (సి)


వివరణ: మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.ల ముందు వచ్చారు. అనగా మంత్రి చేరుకొన్న సమయం 11.00-20=10.40 ఎ.ఎం. ఆయన అతిథుల కంటే 15 ని.ల ఆలస్యంగా వచ్చారు అనగా దీని అర్థం అతిథులు, మంత్రిగారి కంటే 15 ని.ల ముందుగానే ఉన్నారు. కావున అతిథులు వచ్చిన సమయం 10.40 - 15 ని.లు = 10.25 ఎ.ఎం. అతిథులు సమావేశానికి 5 ని॥ ముందుగానే ఉన్నారు. అనగా 5 ని॥లలో సమావేశం ప్రారంభమవుతుందని అర్థం. కావున సమావేశ సమయం 10.25 + 5 = 10.30 సమాధానం అవుతుంది.

4. ఇంటర్వ్యూను నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. ఆయన ఛైర్మన్ కంటే 20 ని.ల ముందు వచ్చారు. ఛైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు వచ్చారు. అయితే ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించవచ్చు?

ఎ) 11.00 ఎ.ఎం. బి) 11.10 ఎ.ఎం.
సి) 10.50 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. అనగా మేనేజింగ్ డైరెక్టర్ వచ్చిన సమయం 10.30 - 15 = 10.15 ఎ.ఎం. ఆయన ఛైర్మన్ కంటే 20 ని.ల ముందుగానే ఉన్నాడు. అనగా దీని అర్థం ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కంటే 20 ని.ల ఆలస్యంగా వచ్చారని తెలుస్తున్నది. అనగా ఛైర్మన్ వచ్చిన సమయం 10.15+20=10.35 ఎ.ఎం. ఆయన ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు ఉన్నాడు. అనగా ఆయన వచ్చిన 25 ని.ల తరవాత ఇంటర్వ్యూ జరుగుతుందని అర్థం. కావున ఇంటర్వ్యూ నిర్వహించే సమయం 10.35+25 ని.లు = 11.00 ఎ.ఎం. సమాధానం అవుతుంది.



5. ఒక రైలు విజయవాడకు ప్రతి గంటకు ఉంది. విచారణాధికారి(ఎంక్వైరీ క్లర్క్) తనను కలిసిన ప్రయాణికులతో రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయినది. తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?

ఎ) 10.20 ఎ.ఎం. బి) 10.15 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం:(బి)

వివరణ: ప్రశ్నలో రైలు ప్రతి గంటకు ఉంది తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని ఇచ్చారు. అనగా దాని ముందు రైలు సమయం 10.00 ఎ.ఎం. విచారణాధికారి (ఎంక్వైరీ క్లర్క్) రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయిందని చెప్పారు. అనగా దీని అర్థం ప్రయాణికుడు 15 ని.ల ఆలస్యంగా వచ్చాడు (ఆలస్యంగా వస్తేనేగా రైలు వెళ్ళిపోయింది) కావున విచారణాధికారికి, ప్రయాణికుడికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.00 + 15 ని॥ = గం॥ 10.15 ని.లు సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి



కొత్త లుక్‌లో

క్లాస్ లుక్‌లో సింపుల్‌గా చిరునవ్వుతో కనిపించే మహేశ్‌బాబు ఈసారి సరికొత్త లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆయన పోనీటెయిల్, గుబురుగడ్డంతో ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజమౌళితో చేస్తున్న చిత్రం కోసమే మహేశ్ ఈ కొత్తలుక్‌లోకి మారారని టాక్. ఇటీవలే మహేశ్‌బాబు తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబంతో కలిసి విహార యాత్రకు రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు జైపూర్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త లుక్‌లో కనిపించారు.

డబుల్ ఇంపాక్ట్



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారం చిత్రబృందం డబుల్ ఇంపాక్ట్ పేరుతో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. వరుణ్‌తేజ్ యువకుడిగా, మధ్య వయస్కుడిగా రెండు విభిన్న గెటప్పుల్లో అలరించారు. వింటేజ్ లుక్‌లో సిగార్ తాగుతూ కనిపించారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో మాఫియా లీడర్ పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ కథానాయికలు. సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, సినిమాటోగ్రఫీ: ఏ కిశోర్‌కుమార్.

రెండింతల వినోదంతో వస్తున్నాం

- పూరి జగన్నాథ్



'రామ్ పోతినేని లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేదు. డబుల్ ఎనర్జీతో ఈ సినిమా చేశాడు. సంజయ్‌దత్‌కు నేను పెద్ద అభిమానిని. ఆయన నటన ఈ సినిమాకు ప్రత్యేకార్షణ. రామ్ మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. సినిమాను బ్లాక్‌బస్టర్ చేయండి' అని దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రేక్షకులను కోరారు. ఆయన దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ "ఇస్మార్ట్ శంకర్‌కు మించేలా 'డబుల్ ఇస్మార్ట్' ఉంటుంది. పూరి జగన్నాథ్ గన్ లాంటివారు. గన్ బావుంటే బుల్లెట్ ఎంత ఫోర్స్‌తో అయినా వెళుతుంది. పూరి గారి లాంటి గన్ అందరి యాక్టర్స్‌కి కావాలని ఈ సినిమాతో తెలిసింది. సంజయ్‌దత్‌తో పనిచేసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. పాటలు ప్రజాదరణ పొందాయి, సినిమా కూడా ఘన విజయం అందుకుంటుందనే నమ్మకం ఉందన్నారు నిర్మాత ఛార్మీ కౌర్. డబుల్ కామెడీ, డబుల్ యాక్షన్, డబుల్ మ్యాజిక్‌లా సినిమా ఉండబోతోందని కథానాయిక కావ్య థాపర్ చెప్పారు.

విడాకులు... మీడియా ప్రచారమే



ఐశ్వర్యతో విడిపోతున్నట్లు వస్తున్న వదంతులపై అభిషేక్ బచ్చన్ ఎట్టకేలకు స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'కొన్ని ఆసక్తికర వార్తల కోసం మీరు (మీడియా) ఇదంతా చేస్తున్నారు. మేం సెలబ్రిటీలం కాబట్టి ఇలాంటి వాటి గురించి పట్టించుకోను. నేను ఇంకా వివాహ బంధంలోనే ఉన్నాను. క్షమించండి' అంటూ తన వేలికి ఉన్న నిశ్చితార్థపు ఉంగరాన్ని చూపించాడు. దీంతో ఇన్నాళ్లు మౌనంగా ఉన్న అభిషేక్ తమపై వస్తున్న రూమర్లకు ప్రస్తుతానికి చెక్ పెట్టినట్లైంది. ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ గత కొంత కాలంగా ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అనంత్ అంబానీ పెళ్లికి విడివిడిగా హాజరడంతో వీరిద్దరూ నిజంగానే విడిపోతున్నారేమోనని భావించారు. ఐశ్వర్యతో విడిపోతున్నట్లు అభిషేక్ బచ్చన్ చెబుతున్న డీప్‌ఫేక్ వీడియో ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

థియేటర్లలో పెళ్ళి... మంచి పద్ధతి కాదు



థియేటర్లలో పెళ్ళిళ్ల చేసుకునే పద్ధతి మంచిది కాదని దర్శకుడు కృష్ణవంశీ హితవు పలికారు. ఆయన దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం ఇటీవలే రీ రిలీజైన సందర్భంగా ఓ ప్రేమజంట థియేటర్‌లోనే పెళ్లి చేసుకుంది. నెటిజన్లు ఆ వీడియోలను కృష్ణవంశీకి ట్యాగ్ చేస్తూ షేర్ చేస్తున్నారు. దీంతో ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. 'మన సంస్కృతి, సంప్రదాయాలను కించ పరచొద్దు. నేను మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి ఇలాంటి పనులు చేయకండి. అవగాహన లేక వారిద్దరూ అలా చేసి ఉంటారు. వారికి మంచి భవిష్యత్ ఉండాలి' అని ఆకాంక్షించారు.

ఖాకీ పాత్రల్లో కథానాయికలు

వెండి తెరపై ఎప్పటికీ చెదిరిపోని క్రేజ్ ఉన్న పాత్రల్లో పోలీస్ ఆఫీసర్ రోల్స్ ముందుంటాయి. హీరోలు పోషించిన పోలీస్ పాత్రలు ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలిసిందే. అదే పాత్రను కథానాయికలు పోషిస్తే.. ప్రేక్షకులను అలరించడానికి పోలీస్ ఆఫీసర్స్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న బాలీవుడ్ కథానాయికలపై ఓ సారి లుక్కేద్దాం.

లేడీ సింగం...

రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ 'సింగమ్' ఫ్రాంఛైజీలో వచ్చిన మొదటి రెండు సినిమాలు ఎంతటి ఘనవిజయాలు అందుకున్నాయో తెలిసిందే. ఇప్పుడు మూడో భాగంగా 'సింగం ఎగైన్' సినిమాలో దీపిక పదుకొనే పోలీస్‌గా అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 1న విడుదల కానుంది. అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, రోహిత్ శెట్టి, అర్జున్ కపూర్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

మర్డర్ మిస్టరీని ఛేదించే పాత్రలో...

అగ్ర నటి కరీనా కపూర్ ఇది వరకు 'ఆంగ్రేజీ మీడియమ్' సినిమాలో పోలీసాఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఆమె మరోసారి 'బకింగ్‌హామ్ మర్డర్స్'లో ఖాకీ దుస్తుల్ని ధరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడిగా పేరొందిన హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఓ మర్డర్ మిస్టరీ కథాంశంతో సాగనుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం సెప్టెంబరు 13న విడుదల కానుంది.





శత్రు సంహారానికై...

'సాక్రెడ్ గేమ్స్' వెబ్ సిరీస్, 'సుల్తాన్' సినిమాలో పోషించిన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కుబ్రా సైత్. 'దేవా' సినిమాలో ఆమె శత్రుమూకల అంతు చూసే పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, పూజా హెగ్డే కీలక పాత్రలు పోషిస్తున్నారు. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

వెబ్ సిరీస్‌లోనూ..

వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక భూమి పడ్నేకర్. ఇటీవలే క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'భక్షక్'తో ప్రేక్షకులను అలరించిన భూమి.. ప్రస్తుతం 'దల్‌దాల్' అనే ఓ వెబ్ సిరీస్‌లో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆమె ఓ సైకో కిల్లర్‌తో తలపడనున్నారు. అమిత్‌రాజ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

రెండో సీజన్ వచ్చేస్తోంది...

'దహాడ్' తొలి సీజన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజలి భాటిగా అలరించారు సోనాక్షి సిన్హా. ఎనిమిది భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ క్రైమ్ డ్రామాకు రీనా కగ్తీ, రుచికా ఒబెరాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ వర్మ, గుల్షన్, సోహమ్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సిరీస్ విడుదల కానుంది.

పవర్‌ఫుల్ పాత్రలో...


'కితనీ మొహబ్బత్ హై' సీరియల్‌తో పాపులర్ అయ్యారు నటి క్రితిక కమ్రా. ఆమె గ్యారహ్ గ్యారహ్ (11:11) అనే వెబ్ సిరీస్‌లో నటించారు. ఇటీవలే విడుదలైన ఈ ఇన్‌వెస్టిగేటివ్ డ్రామాలో ఆమె పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు.











స్విట్జర్లాండ్‌లో జరిగిన లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌లో బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్‌ను పార్డో అల్లా కారియారా పురస్కారంతో సత్కరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ నటుడు షారూఖ్ కావడం విశేషం.

కొత్తగా...

సరికొత్త వీక్షణం



రామ్ కార్తిక్, కశ్వి జంటగా రూపొందుతున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిమ్మ చీకటిలో బైనాక్యులర్స్ నుంచి వస్తోన్న కాంతిలో నిల్చున్న హీరో లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్

క్రైమ్ సస్పెన్స్ కలబోతగా



విశ్వంత్, శిల్పా మంజునాథ్ జంటగా బసిరెడ్డి రానా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హైడ్ అండ్ సీక్'. నరేంద్ర బుచ్చిరెడ్డి గారి నిర్మించారు. నటుడు శివాజీ ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక వినూత్నమైన క్రైమ్ థ్రిల్లర్. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'క్రైమ్, సస్పెన్స్ అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. మా సినిమా సమర్పకుడు నవీన్ మేడారం ఫస్ట్ కాపీ చూసి బావుందని ప్రశంసించారు' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లిజో కే జోష్. సినిమాటోగ్రఫీ: చిన్న రామ్

పైసా వసూల్ ఎంటర్‌టైనర్



చిమటా రమేశ్ బాబు హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'నేను-కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రమేశ్ మాట్లాడుతూ "బ్లాక్‌బస్టర్ కావడానికి అవసరమైన అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ప్రేమ కథతో పాటు చక్కని వినోదం మేళవించి తెరకెక్కించాం. అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. "ఇది పైసా వసూల్ ఎంటర్‌టైనర్" అని నిర్మాత జ్యోతిర్మయి తెలిపారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

» ఆ రెండు పార్టీలతో రాష్ట్రానికి అన్యాయం: హరీశ్‌రావు



సిద్దిపేట టౌన్, ఆగస్టు 11: ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో నియోజకవర్గానికి చెందిన 229 మంది లబ్ధిదారులకు రూ.56 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. చెరో 8 ఎంపీ సీట్లు ఇస్తే తెలంగాణను మోసం చేసాయని, బీజేపీకి 8 సీట్లు ఇస్తే తెలంగాణకు బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి ఆంధ్ర తీపి, తెలంగాణ చేదు అయ్యిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవ్వతాతలు అరిగోస పడుతున్నారని, రైతు బంధు రాక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆడ బిడ్డ పెళ్లికి రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని ప్రగల్బాలు పలికారని, అధికారంలోకి వచ్చాక తులం బంగారం తుస్ మనిపించారని ఎద్దేవా చేశారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలిపోతే కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని అబద్ధాలు ప్రచారం చేశారని, కాళేశ్వరం కూలిపోతే రంగనాయక సాగర్‌లోకి నీళ్లు ఎలా వచ్చాయని ఆయన నిలదీశారు.

రాష్ట్రంలో విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

» మాదిగ సంఘాల డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పు మేరకు మాదిగ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మాదిగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌ను కోరాయి. ఈ మేరకు ఆదివారం బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మాదిగ సంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. హక్కుల కోసం జరిగిన అతిపెద్ద ఉద్యమం మాదిగ రిజర్వేషన్ ఉద్యమమన్నారు. వర్గీకరణ మీద ఈనెల 13న ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షులతో సమావేశం జరగనుందని పేర్కొన్నారు. వర్గీకరణపై దేశంలో అన్ని రాష్ట్రాలకంటే మొదట ఆర్డినెన్సు తీసుకువస్తామని సీఎం మాట ఇచ్చారని సతీష్ మాదిగ గుర్తు చేశారు. 75 లక్షల జనాభా ఉన్న మాదిగలకు మంత్రి పదవి ఇవ్వలేదని, తక్కువ జనాభా ఉన్న వారికి మాత్రం డిప్యూటీ సీఎం, మంత్రి పదవులు కట్టబెట్టారని కాంగ్రెస్ నేత గజ్జల కాంతం అసంతృప్తి వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో ఈనెల 22న మాదిగలతో భారీ ఎత్తున సభ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సదస్సులో మాజీమంత్రి ఎర్ర చంద్రశేఖర్, పిడమర్తి రవి, ఎపూరి సోమన్న, మాదిగల సంఘాల నాయకులు, తదితరులు మాట్లాడారు.

పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

» జనగామ జిల్లాలో తెగిపడ్డ హైటెన్షన్ విద్యుత్ తీగ

చిలుపూర్, ఆగస్టు 11 : సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు జనగామ జిల్లాలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు జనగామ జిల్లా వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలోకి రాగానే పైనున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ తెగిపోయింది. దీంతో రైలు ఒక్క ఉదుటున ఆగిపోయింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. సమాచారమందుకున్న రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేసి రైలును కాజీపేట వైపు పంపించారు. ఈ క్రమంలో 40 నిమిషాలకుపైగా రైలు రాకపోలకు అంతరాయం ఏర్పడింది. రైలు గేటు వద్ద నిలిచిపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు కూడా ఇబ్బంది పడ్డారు.

కొత్త ఆర్వోఆర్ చట్టంతో రైతు సమస్యలకు పరిష్కారం

» రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేస్తాం: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కరీంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులు, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన నూతన ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై వివిధ వర్గాలతో చర్చించాలన్నారు. రైతులకు మరింత మేలు జరిగే విధంగా చట్టం రూపకల్పనలో సహకరించాలని కోరారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ముసాయిదా బిల్లుపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరిచి ఒక మంచి చట్టం ద్వారా తెలంగాణ ప్రజలకు మేలైన సేవలు అందిస్తామని తెలిపారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త చట్టం చేసే ముందు వివిధ వర్గాల నుంచి సూచనలను తీసుకోవడం శుభ పరిణామమన్నారు. నూతన చట్టం అమలుకు సంబంధించి అసోసియేషన్ ద్వారా తగిన సూచనలు చేస్తామని, వీటి ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించడానికి రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగులందరూ ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్డీవోలకు అప్పీలు చేసుకునే వీలుండాలి!

» తప్పు చేసిన అధికారులపై చర్యలు కొత్త చట్టంలో ఉండాలి

» సర్వే చేయకుండా భూ రికార్డుల సవరణ ఎలా?

» ఆర్వోఆర్-24పై ప్రజల సూచనలు, అనుమానాలు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భూ రికార్డుల నిర్వహణ పరంగా లోపాలు, అవకతవకలపై ఆర్వోఆర్-2020కి ముందు మాదిరిగా ఆర్డీవోలకు అప్పీలు చేసుకునే అవకాశం ఉండాలనే సూచనలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఆర్డీవోలకు సాదాబైనామాలతో పాటు 10 రకాల భూములను మ్యుటేషన్ చేసే అధికారం కట్టబెడుతూ ఆర్వోఆర్-2024 ముసాయిదాలో ప్రతిపాదించినా అప్పీళ్లను విచారించే అధికారం వారికి ఇవ్వలేదు. దీన్ని ఆర్డీవో పైస్థాయిలో అదనపు కలెక్టర్, లేదా కలెక్టర్‌కు కట్టబెట్టాలని ముసాయిదాలో ప్రతిపాదించారు. అయితే అప్పీళ్లపై నిర్ణయం తీసుకునే అధికారం ఆర్డీవోలకు ఇవ్వాలని.. తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు వీలుగా కొత్త చట్టంలో అధికారాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్వోఆర్-2020లో భాగంగా గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో నిర్వహణ పరమైన లోపాలను సవరించి.. పూర్తి ప్రక్షాళన చేసేందుకుగానూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్-2024 చట్టాన్ని తెచ్చేందుకు సంకల్పించింది. ఈమేరకు కొత్త ఆర్వోఆర్‌పై ముసాయిదాను రూపొందించి ఈనెల 23వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆర్వోఆర్-2024 ముసాయిదాపై ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేయకుండా భూ రికార్డుల సవరణ ఎలా చేపడుతారని ప్రశ్నిస్తున్నారు. భూ రికార్డుల నిర్వహణ పరంగా జరిగిన పొరపాట్లను విచారించేందుకు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఆర్వోఆర్-2020 చట్టాన్ని కొనసాగిస్తూ, అందులోని తప్పులను సవరించేందుకు కొత్త ఆర్వోఆర్-2024 పరిష్కార మార్గాలను సూచిస్తుందని భూ చట్టాల నిపుణుడు సునీల్‌కుమార్ పేర్కొన్నారు. అయితే అప్పీళ్ల కోసం రైతులందరూ సీసీఎల్ఏకు రావాల్సిన పని ఉండదని.. కలెక్టర్ స్థాయిలోనే అప్పీలు చేసుకోవచ్చునని, అనేక రకాల సమస్యలు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కారం చేసేందుకు ప్రత్యేక అధికారాలు కల్పించినట్లు రెవెన్యూ ఉన్నతాధికారులు చెబుతున్నారు. భూములకు సర్వే తప్పనిసరిగా చేయాలన్న నిబంధన కొత్త ఆర్వోఆర్ -2024లో ప్రతిపాదించలేదని, అయితే శాశ్వత భూధార్ కోసం రీ సర్వే అనివార్యమవుతుందని తెలుస్తోంది. సర్వే పూర్తయ్యాక కొత్త రికార్డుల నమోదు, కొత్త పాస్‌బుక్‌లు కూడా అందుబాటులోకి వస్తాయని, అప్పుడు ధరణి చట్టం దానికదే రద్దవుతుందని అంటున్నారు. రెవెన్యూ చట్టాలను ఏకీకృతం చేశాక వాటిని విచారించేందుకు ట్రిబ్యునళ్లు ఉండాలన్న ప్రతిపాదనలు కూడా కొత్త ముసాయిదాలో చేర్చనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

గుట్టపై 'స్నాన సంకల్పం'



కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద పూజలు చేస్తున్న విప్ బీర్ల అయిలయ్య దంపతులు, ఈవో భాస్కర్‌రావు, తదితరులు

» భక్తుల కోసం విష్ణు పుష్కరిణిలో అందుబాటులోకి

» తిరుమల తరహాలో నిత్యం వెలిగేలా అఖండ దీపారాధన

» గిరి ప్రదక్షిణలో పాల్గొన్న 15వేల మంది భక్తులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 11: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకునే భక్తులకు 'స్నాన సంకల్పం' ఆర్జిత సేవ అందుబాటులోకి వచ్చింది. యాదగిరిగుట్ట ఆలయ ఉద్ఘాటనకు ముందు కొండపైన ఉన్న గుండంలో భక్తులు స్నానమాచరించేవారు. ఉద్ఘాటన నేపథ్యంలో భక్తుల స్నానానికి కొండకింద లక్ష్మీ పుష్కరిణిని, కొండపైన ఉన్న విష్ణు పుష్కరిణి నీటిని దేవతా కైంకర్యాలకు వినియోగిస్తున్నారు. కొండపై ఉన్న గుండంలో స్నానం చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల్లో అనాదిగా ఉన్న నమ్మకం, పాత ఆచారాల పునరుద్ధరణ నేపథ్యంలో ఆదివారం నుంచి 'స్నాన సంకల్పం' ఆర్జితసేవను ఆలయ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉదయం 9.30కు కొండపైన విష్ణు పుష్కరిణిలో 'స్నాన సంకల్పం' అర్జిత సేవను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. వేదమంత్రాల నడుమ ఈవో ఏ. భాస్కర్‌రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేసిన ఐలయ్య కుటుంబసమేతంగా పుష్కరిణిలో స్నాన సంకల్పం చేశారు. భక్తులు కూడా స్నాన సంకల్పంలో భాగస్వాములయ్యారు. ఆలయ తూర్పు రాజగోపురం ఎదురుగా ఈశాన్య దిశలో కొత్తగా ఏర్పాటు చేసిన అఖండ దీపారాధనను కూడా ప్రారంభించారు. తొలిరోజు భక్తులందరికీ ఉచితంగా స్నాన సంకల్పానికి అవకాశం కల్పించారు. దీనికి రూ.100 టికెట్ వసూలు చేయనున్నారు. కాగా లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని యాదగిరికొండ చుట్టూ నిర్వహించిన గిరి ప్రదక్షిణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద మంత్రాల నడుమ ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలతో అర్చక స్వాములు హారతి ఇవ్వగా ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి పాల్గొనగా, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తన కుటుంబసభ్యులతో కలిసి గిరిప్రదక్షిణ శుభ కార్యాన్ని గోవింద నామస్మరణ మధ్య ప్రారంభించారు. మొత్తం 15వేల మంది గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

'జ్వర' స్వైర విహారం

(మొదటి పేజీ తరువాయి)

చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు.

- ఆసిఫాబాద్ జిల్లా గుండాయిపేటకు చెందిన జాడె పూజ అనే బాలిక జ్వరంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న ఆమె, జ్వరంతో అవస్థ పడుతూ తండ్రికి ఫోన్ చేసింది. హాస్టల్ నుంచి ఇంటికి తీసుకువచ్చి చికిత్స అందించినా తగ్గకపోవడంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా 'నాన్న నన్ను కాపాడు' అంటూ తండ్రిని వేడుకుంటూనే మృతిచెందడం కలిచివేసింది.

.. ఇలా జ్వరాలకు ప్రాణాలొదులుతున్న వారు కొందరైతే.. ఎంతోమంది ఆస్పత్రులకు పోటెత్తుతున్నారు! పడకలు దొరక్క.. ఇళ్లవద్దే కొట్టుమిట్టాడుతున్నవారు ఇంకొందరు! కొన్నాళ్లుగా పల్లె, పట్నం తేడా లేకుండా జనాలకు జ్వరం పీడిస్తోంది. హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లోనూ వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, గ్యాస్ట్రో ఎంటెరిటిస్ కేసులు వస్తున్నాయి. ముఖ్యంగా కొత్తగూడెం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో డెంగీ, మలేరియాతో మరణాలు కూడా నమోదవుతున్నాయి. అక్కడ చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఇంటికి ఒకరిద్దరు జ్వరంతో బాధపడుతున్నారు. విషజ్వరాలు, డెంగీ, టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటెరిటిస్ కేసులు వేలల్లో నమోదవుతున్నాయి. వీటికితోడు దగ్గు, జలుబు, ఫ్లూ కూడా ఉంటున్నాయి. రోగుల్లో ఎక్కువగా తీవ్రమైన చలిజ్వరం, భరించలేని, అడుగుతీసి అడుగు వేయలేనంత కీళ్ల, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తున్నాయి. కొన్నాళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల భారీ వర్షాలు కురవడం.. లోతట్టు ప్రాంతాలు, గుంతల్లో వర్షం నీరు నిలవడం.. పరిసరాల అపరిశుభ్రత.. ఫలితంగా దోమల బెడద పెరగడంతో జ్వరాలు అంటుకుంటున్నాయి. చికిత్స కోసం పోటెత్తుండటంతో సర్కారు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. అక్కడ పడకలు దొరక్కపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు వెళుతున్నారు. అన్ని ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ భారీగా పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు.



కొత్తగూడెం జిల్లా బెండల్‌పాడులో జ్వరంతో మంచానికే పరిమితమైన ఓ మహిళ

ఫాగింగ్ కూడా కరువే..

దోమల నివారణ కోసం నిబంధనల మేరకు ప్రతి 45 రోజులకు ఫాగింగ్ చేయాలి. డెంగీ ప్రభావిత జిల్లాల్లోనైతే ఇంతకన్నా తక్కువ వ్యవధిలోనే ఫాగింగ్ స్ప్రేయింగ్ చేయాలి. ఈ విషయాన్ని ప్రజారోగ్య విభాగ సిబ్బంది విస్మరించారు. డెంగీ ప్రభావిత జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లోనూ ఫాగింగ్ చేయడం లేదు. పల్లెల్లో పారిశుద్ధ్యం కూడా పడకేసింది. నిధుల్లేక పారిశుధ్య పనులు చేపట్టడం లేదు. కనీసం బ్లీచింగ్ కూడా వేయడం లేదు. డ్రైడేను పాటించడం లేదు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్స్‌లో కూడా కనీస మందులు ఉండటం లేదు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు కార్యాచరణ చేపట్టకపోవడం, కనీస ఔషధాలను అందుబాటులో నిల్వ ఉంచుకోకపోవడంతో గ్రామీణ ప్రాంత రోగులు అల్లాడుతున్నారు.

- కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, బూర్గంపాడు, మణుగూరు మండలాల పరిధిలో గత 24 రోజుల్లో కొత్తగా 37 మలేరియా కేసులు నమోదయ్యాయి.
- ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో గత పదిరోజుల్లో కొత్తగా 35 డెంగీ కేసులొచ్చాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు నెలల్లో 10809 జ్వరాల కేసులు నమోదయ్యాయి. రిమ్స్ ఆదిలాబాద్‌లో గతంలో రోజూ 1100 వరకు ఓపీ రాగా... ప్రస్తుతం రోజూ 1700 వరకు కేసులొస్తున్నాయి.
- నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లిలో విష జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. అక్కడ ప్రతి ఇంటిలోనూ ఇద్దరు, ముగ్గురు విష జ్వరాల బారినపడ్డారు. ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరుపేట గ్రామంలో డెంగీ, విష జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి.
- ఉమ్మడి నల్లగొండ జిల్లా నిడుమానూరు, హుజూరాబాద్ మండలాల్లో 2వేలమంది జ్వరంతో బాధపడుతున్నారు.

డెంగీతో 8 నెలల శిశువు మృతి

ఇబ్రహీంపట్నం, కౌటాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డెంగీతో చిన్నారి మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌కు చెందిన ప్రజ్వల్ (8నెలలు) అస్వస్థతకు గురవ్వడంతో శనివారం ఇబ్రహీంపట్నంలోని రవికృష్ణ చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్యులు డెంగీగా నిర్ధారించి చికిత్స ప్రారంభించగా ప్లేట్‌లెట్స్ పడిపోయి పరిస్థితి విషమించడంతో ఆదివారం పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలంటూ వైద్యులు సలహా ఇచ్చారు. అంబులెన్స్‌లో బాలుడిని నగరానికి తీసుకెళ్తుండగా మృతిచెందాడు. అలాగే, ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేటలో బోయిరే కాశీనాథ్ (32) జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. శనివారం ఇదే గ్రామానికి చెందిన పూజ (18) జ్వరంతో మృతి చెందింది.

5 నెలల్లో 2,847 డెంగీ కేసులు



రాష్ట్రంలో ప్రధానంగా డెంగీ కోరలు చాస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నుంచి ఆగస్టు 4 వరకు మొత్తం 2,847 డెంగీ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 1101, ఖమ్మంలో 287, మేడ్చల్‌లో 268, సూర్యాపేటలో 217 డెంగీ కేసులొచ్చాయి. జూలై 15వ తేదీ నాటికి 6,500 టైఫాయిడ్ కేసులు, 31,124 గ్యాస్ట్రోఎంటెరిటిస్ కేసులు, 140 మలేరియా కేసులు నమోదయ్యాయి. డెంగీ, మలేరియా మరణాలను వైద్య ఆరోగ్యశాఖ లెక్కల్లో చూపడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వచ్చే కేసులు, మరణాలు కూడా అసలు లెక్కల్లోకే రావడం లేదనే ఆరోపణలున్నాయి. అవి కూడా కలిపితే కేసుల సంఖ్య రెట్టింపు ఉంటుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

మూడు జిల్లాల్లో 4200 ఎకరాలు!

(మొదటి పేజీ తరువాయి)

చేయాలన్నది ప్రభుత్వంలక్ష్యంగా తెలిసింది.

సిద్ధంగా ఉన్న కంపెనీలకు ముచ్చర్ల..

రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలోని దాదాపు 20వేల ఎకరాల్లో ఫార్మా సిటీ ఏర్పాటుచేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో ఒకేచోట అంత పెద్దఎత్తున ఫార్మా పరిశ్రమ ఏర్పాటును ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. రాష్ట్రంలోని 10 వేర్వేరు ప్రాంతాల్లో 1000-2000 ఎకరాల్లో క్లస్టర్లు ఏర్పాటు చేయనుంది. అయితే ముచ్చర్ల ఫార్మాసిటీలో ఇప్పటికే ప్రభుత్వం దాదాపు 9వేల ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో వివిధ రకాల ప్రాజెక్టులను అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక్కడే 1000-1500 ఎకరాల్లో మరో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉంది. అయితే, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలకు ముచ్చర్ల క్లస్టర్‌లో భూమి కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, సీఎం అమెరికా పర్యటనలో ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్న సంస్థలకు కూడా ముచ్చర్లలోనే భూములు కేటాయించే అవకాశాలున్నాయి.

మెదక్ జిల్లాలో 900 ఎకరాల్లో భూముల పరిశీలన..

గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల కోసం మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలో భూముల పరిశీలన ప్రారంభమైంది. అచ్చంపేట గ్రామంలోని సర్వే నెంబర్లు 60 నుండి 86 వరకు, 115, 129 130 సర్వే నెంబర్లలో 629 ఎకరాలు, హకీంపేటలోని 12, 17, 19, 20, 95 సర్వేనెంబర్లలో నుండి 150 ఎకరాలు, రామంతపూర్‌లోని 389 సర్వే నెంబర్‌లో 120 ఎకరాలు మొత్తంగా 900 ఎకరాలను అధికారులు ఇటీవలే పరిశీలించారు. ప్రభుత్వ ఆమోదం తర్వాత భూసేకరణ చేపడతారు.



వికారాబాద్‌లో 1373 ఎకరాల్లో..

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం, లగచర్ల, పోలేపల్లి, హకీంపేట గ్రామాల పరిధిలోని 1373 ఎకరాల్లో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా లాగచర్లలో 632.26 ఎకరాలను 580 మంది రైతుల నుంచి సేకరించేందుకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు.

త్వరలో నల్లగొండలో

నల్లగొండ జిల్లాలో 1300 ఎకరాల భూసేకరణ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. చిట్యాల మండలం వెలిమినేడ్ గ్రామ శివారులో గత సర్కారు ఇండస్ట్రియల్ పార్క్‌కు ప్రతిపాదించిన 300 ఎకరాల ప్రభుత్వ భూమి సిద్ధంగా ఉంది. మరో 500 ఎకరాల అసైన్డ్ భూమి అందుబాటులో ఉంది. అదనంగా మరో 500 ఎకరాల వరకు పట్టా భూములను సేకరించాలని అధికారులు భావిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో సర్వే..

సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని నిమ్జ్ సమీపంలో డప్పూర్, మల్గి, వడ్డీ గ్రామాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా సిటీ కోసం 2003 ఎకరాల భూమిని అధికారులు ఇటీవల సర్వే చేశారు. డప్పూర్‌లో 1465 ఎకరాల్లో 491 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్ భూమి, వడ్డీ గ్రామంలోని 282 ఎకరాల్లో 220ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్ భూమి, మల్గిలో 256 ఎకరాలు సర్వే చేయగా 195 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇక్కడ ప్రాథమిక సర్వే పూర్తవగా.. త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.




పచ్చని ప్రకృతి ఒడిలో.. లక్నవరంలో పర్యాటకుల సందడి

గోవిందరావుపేట, ఆగస్టు 11: ప్రకృతి రమణీయతకు పర్యాయం లక్నవరం. నిండా జలాలతో తొనికిసలాడుతున్న చెరువు అందాలను వర్ణించడం ఎవరితరం కాదు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో ఉన్న ఈ పర్యాటక కేంద్రం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కనుచూపు మేరలో ఆకుపచ్చరంగును పలుముకున్న గుట్టలు, చెరువు మధ్యలో ఉయ్యాల వంతెనపై నడుస్తూ చల్లగా పలకరించే పిల్లగాలుల నడుమ దీవులకు చేరుకోవడం, చెరువులో బోటు షికారు మనసును ఆహ్లాదపరుస్తుంది. చెరువును సమీపించే క్రమంలో అడవి మధ్యలో ప్రయాణం, ఘాట్‌రోడ్డు, బుస్సాపూర్‌లోని జింకల పార్కు ప్రత్యేక ఆకర్శనగా నిలుస్తాయి. ప్రకృతి ప్రేమికులకు, వీకెండ్ పర్యాటకులకు లక్నవరం బెస్ట్ టూరిస్టు స్పాట్‌గా మారింది. రెండో శనివారం, ఆదివారంతో వరుసగా రెండురోజుల సెలవులు రావడంతో లక్నవరానికి టూరిస్టులు క్యూ కట్టారు. ఆదివారం వందలాది మందితో ఆప్రాంతమంతా సందడిగా మారింది.

కవితకు బెయిల్ వచ్చేనా..?

» నేడు సుప్రీంకోర్టులో విచారణ

» జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందుకు దరఖాస్తు



న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరగనుంది. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. మద్యం పాలసీ కేసులో కవిత సాక్ష్యాలను ధ్వంసం చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారన్న దర్యాప్తు సంస్థల వాదనలతో ఢిల్లీ హైకోర్టు ఏకీభవించింది. "ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జిషీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయి. అందులో కవిత మాత్రమే మహిళ. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయి. మహిళా చట్టాలను పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వండి. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదు. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయి. వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలి" అని కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనల తర్వాత కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టేశారు. ఇప్పుడు కవిత అవే అంశాల ఆధారంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారించనుంది. ఇదే ధర్మాసనం శుక్రవారం ఢిల్లీ మద్యం కేసులో మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ మంజూరు చేసింది. ఈసారి తమ నాయకురాలికి తప్పనిసరిగా బెయిల్ వస్తుందని బీఆర్ఎస్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కవితను మార్చి 15న ఈడీ అరెస్ట్ చేసింది. ఆమె నాటి నుంచి తిహాడ్ జైలులో ఉన్నారు. కవిత తిహాడ్ జైలులో ఉండగానే ఏప్రిల్ 15న సీబీఐ అరెస్టు చేసినట్టు ప్రకటించింది.

బుక్‌బ్రహ్మ ఉత్సవ్‌లో తెలుగు సాహిత్య సౌరభం

» ప్రముఖ రచయిత జయమోహన్‌కు బుక్‌బ్రహ్మ సాహిత్య పురస్కారం



'నెమ్మి నీలం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయమోహన్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో తెలుగు సాహిత్య సౌరభం వెల్లివిరిసింది. మూడురోజులపాటు సాగిన ఉత్సవంలో వందలాదిమంది తెలుగు రచయితలు, సాహితీ అభిలాషులు పాల్గొన్నారు. ఐదు వేదికల ద్వారా 50కి పైగా చర్చాగోష్టులు, పుస్తకావిష్కరణలు నిర్వహించారు. పలు సమీక్షల్లో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ భాగస్వాములయ్యారు. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మళయాళ భాషల ప్రముఖ రచయితలు పాల్గొన్నారు. చివరిరోజు ఆదివారం వేలాది మంది సందర్శకులతో బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆడిటోరియం కిటకిటలాడింది. 'నెమ్మి నీలం' పుస్తకావిష్కరణతోపాటు 'తెలుగు కథా ప్రపంచం' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. నాగర్‌కోయిల్‌కు చెందిన తమిళం, మళయాళ భాషల ప్రముఖ రచయిత జయమోహన్‌కు బుక్‌బ్రహ్మ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. రబ్బర్, కాడు, విష్ణుపురం, ఈజంపులగంతోపాటు ఎన్నో కృతులు ఆయన రచించారు. 2005లో ప్రసిద్ధమైన ఆధునిక మహాకావ్యం కొత్రవై ద్వారా గుర్తింపు పొందారు. జయమోహన్‌కు బుక్ బ్రహ్మ ఉత్సవ్ సాహిత్య పురస్కారం, జీవన సాఫల్య పురస్కారంతోపాటు రూ.2లక్షల నగదు అందజేశారు.

లోపాలకు అధికారులే బాధ్యులు..

» నిబంధనల ఉల్లంఘన తెలిసి ఉదాసీనం

» 'ఢిల్లీ కోచింగ్ సెంటర్' దుర్ఘటనపై నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఢిల్లీలోని ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో వరదల కారణంగా ముగ్గురు అభ్యర్థులు మృతి చెందిన ఘటనపై చేపట్టిన విచారణ దర్యాప్తు నివేదికను జిల్లా మెజిస్ట్రేట్ (సెంట్రల్) సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించి మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ), ఢిల్లీ అగ్నిమాపక సేవల (డీఎఫ్ఎస్) అధికారులే పెద్ద లోపాలకు బాధ్యులుగా దర్యాప్తు నివేదికలో పేర్కొన్నారు. సెంట్రల్ ఢిల్లీలోని సదరు కోచింగ్ సెంటర్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తెలిసినా ఆ రెండు విభాగాల అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని తేల్చారు. 'అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం లేకుండానే ఎంసీడీ భవన ప్లాన్‌ను ఆమోదించింది. విద్యా అవసరాలకు కాకుండా కార్యాలయ/వ్యాపార అవసరాలకు మాత్రమే ఆ భవనానికి అనుమతి ఉంది. దాని ఎత్తు 9 మీటర్లకు మించి ఉన్నందున అగ్నిమాపకశాఖ నిరభ్యంతర పత్రం తప్పనిసరి. భవన సెల్లార్‌లో లైబ్రరీ నిర్వహించడం కోచింగ్ సెంటర్, యాజమాన్యం నేరపూరిత నిర్లక్ష్యమే. అక్కడి కోచింగ్ సెంటర్లను రోహిణి, నరేలాకు మార్చాలి' అని నివేదికలో పేర్కొన్నారు.

లోకం తీరు



హిండెన్ బర్గ్ పెద్ద అబద్ధాల పుట్ట

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై అదానీ గ్రూప్ ఆదివారం రెగ్యులేటరీ సంస్థలకు ఒక వివరణ ఇచ్చింది. సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌తో తమ గ్రూప్‌నకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ ఆరోపణలు పచ్చి అబద్ధాలని విమర్శించింది. ఏ మాత్రం విశ్వసనీయత లేని సమాచారం ఆధారంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోందని తెలిపింది. వ్యక్తిగత లాభాపేక్షతోనే హిండెన్‌బర్గ్ ఈ దురాగతానికి పాల్పడుతోందని విమర్శించింది. తమ గ్రూప్‌పై గత ఏడాది జనవరిలో ఈ సంస్థ చేసిన ఆరోపణల్లో ఏమాత్రం పస లేకపోవడం వల్లే ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు కొట్టి వేసిందని స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలపై మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పరిశ్రమ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలు దేశ ఆర్థిక పురోగతిని దెబ్బతీసే ముప్పు ఉందని హెచ్చరించింది.

పైసా పెట్టుబడి పెట్టలేదు: 360 వన్

బుచ్ దంపతులపై హిండెన్‌బర్గ్ ఆరోపణలపై '360 వన్ ఫండ్' (గతంలో ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్) కూడా వివరణ ఇచ్చింది. ఐపీఈ ప్లస్ ఫండ్ 1 ద్వారా సమీరించిన నిధుల్లో పైసా కూడా అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టలేదని స్పష్టం చేసింది. ఈ ఫండ్ ద్వారా సమీకరించిన 4.8 కోట్ల డాలర్ల నిధుల్లో కేవలం ఒకటిన్నర శాతం మాత్రమే బుచ్ దంపతుల ద్వారా వచ్చినట్టు తెలిపింది. ఈ ఫండ్ నిధుల్లో 90 శాతానికిపైగా నిధులను రుణ పత్రాల్లో పెట్టుబడి పెట్టామే తప్ప, కంపెనీల షేర్లలో మదుపు చేయలేదని స్పష్టం చేసింది. కాగా, హిండెన్‌బర్గ్ ఆరోపణల ప్రభావం సోమవారం స్టాక్ మార్కెట్‌పైనా కనిపించే ప్రమాదం కనిపిస్తోంది. మదుపరులు ప్రశాంతంగా ఉండాలని సెబీ హెచ్చరించింది. హిండెన్‌బర్గ్ సంస్థకు అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో షార్ట్ పొజిషన్లు కూడా ఉండే అవకాశం ఉందని పరోక్షంగా హెచ్చరించింది.


ఐసీఏఆర్‌లో శాస్త్రవేత్తలతో మోదీ

109 రకాల కొత్త వంగడాలు విడుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఏ రకమైన వాతావరణాన్నయినా తట్టుకుని అధిక దిగుబడినిచ్చే 109 రకాల కొత్త వంగడాలను ప్రధాని మోదీ ఆదివారం విడుదల చేశారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఐసీఏఆర్)లో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా వంగడాలు, సేంద్రీయ వ్యవసాయ ప్రాముఖ్యత వంటి అంశాలపై రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఆయన చర్చించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను మోదీ ఈ సందర్భంగా వివరించారు. సేంద్రియ వ్యవసాయానికి డిమాండ్ పెరిగిందని ప్రజలు అటువంటి ఆహారాన్నే ఇష్టపడుతున్నారని వెల్లడించారు. కొత్త వంగడాలను అభివృద్ధి చేసిన వ్యవసాయ శాస్త్రవేత్తలను మోదీ అభినందించారు. అనంతరం కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, కొత్త వంగడాలు రైతుల ఆదాయాన్ని పెంచుతాయని, ప్రకృతి సిద్ధమైన వీటి విత్తనాలు మంచి దిగుబడినిస్తాయని చెప్పారు.

కులం వల్లే భారత సమాజంలో ఐక్యత: పాంచజన్య

న్యూఢిల్లీ, ఆగస్టు 11: భారతీయ సమాజాన్ని కుల వ్యవస్థే సమైక్యంగా ఉంచుతోందని ఆర్ఎస్ఎస్‌కు చెందిన 'పాంచజన్య' పత్రిక పేర్కొంది. మొగల్ పాలకులు దీనిని అర్థం చేసుకోలేదని.. బ్రిటిషర్లు మాత్రం కనిపెట్టి 'విభజించి-పాలించు' విధానంలో దెబ్బ తీసేందుకు ప్రయత్నించారని తెలిపింది. పాంచజన్య పత్రిక సంపాదకుడు హితేశ్ శంకర్ 'ఓ నేతా.. నీదే కులం!' శీర్షికన ఆ పత్రికలో సంపాదకీయం రాశారు. కులగణన చేపట్టాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై మండిపడ్డారు. హిందువుల ఐక్యతను చీల్చేందుకు ఇది సాధనమని కాంగ్రెస్ అనుకుంటోందని విమర్శించారు. బ్రిటిషర్ల మాదిరిగానే ఆ పార్టీ కూడా లోక్‌సభ స్థానాలను కులాల ప్రాతిపదికన వ్యవస్థీకరించాలని.. దేశంలో చీలికలను మరింత పెంచాలని అనుకుంటోందని ధ్వజమెత్తారు.

మహారాష్ట్రలో 'సీఎం' అభ్యర్థి లేకుండా ఎన్నికలకు!

» కాంగ్రెస్ ప్రతిపాదన.. పవార్, ఉద్ధవ్ సేన మద్దతు అనుమానమే

ముంబై, ఆగస్టు 11: ముఖ్యమంత్రి పదవికి ఎవరినీ అభ్యర్థిగా ప్రకటించకుండా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడదామని కాంగ్రెస్ ప్రతిపాదించింది. ఎన్నికల ఫలితాల తర్వాత ఖరారుచేద్దామని 'మహా వికాస్ అఘాడీ'లోని భాగస్వామ్య పక్షాలైన ఉద్ధవ్ శివసేన, శరద్ పవార్ ఎన్‌సీపీలకు సూచించింది. అయితే దీనిని ఉద్ధవ్ శివసేన అంగీకరించడం సందేహమేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే ఉద్ధవ్ ఠాక్రేను సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌సీపీ (పవార్) కూడా సమర్థిస్తున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాలకు అఘాడీ 30 చోట్ల గెలిచింది. ఇందులో కాంగ్రెస్ అత్యధికంగా 13 సీట్లు సాధించింది. కూటమికి తానే నాయకత్వం వహించాలని కాంగ్రెస్ ఆశపడుతోంది.

రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడే: సుబ్రహ్మణ్య స్వామి

న్యూఢిల్లీ, ఆగస్టు 11: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడేనని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. రాహుల్ గాంధీ 2003లో బ్రిటిష్ పౌరసత్వం తీసుకున్నారని, లండన్‌లో బ్యాక్‌ఆప్స్ అనే కంపెనీని కూడా స్థాపించారని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. రాహుల్ తన కంపెనీకి సంబంధించి బ్రిటిష్ ప్రభుత్వానికి యాన్యువల్ రిటర్న్‌లను కూడా సమర్పిస్తున్నారని తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను బయటపెట్టారు. ఆ కంపెనీకి రాహుల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని, ఆయన బ్రిటిష్ పౌరుడేననడానికి ఇంతకంటే ఆధారాలు అవసరం లేదని పేర్కొన్నారు. రాహుల్ పౌరసత్వానికి సంబంధించి తాను పూర్తి వివరాలు సమర్పిస్తున్నానని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు

ఒక్కో ఫిర్యాదుపై విచారణకు రూ.37.82 లక్షల ఖర్చు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: దేశంలో అవినీతిపై పోరాటానికి కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన లోక్‌పాల్ నిర్వహణ వ్యయం భారీగా ఉంటోంది. గత మూడేళ్లలో వచ్చిన ఫిర్యాదులు 739 మాత్రమే కాగా.. 2021-22, 22-23, 23-24 సంవత్సరాల్లో ఆ సంస్థ మొత్తం బడ్జెట్ రూ.329.17 కోట్లు. ఇందులో 279.52 కోట్లు ఖర్చుచేశారు. అంటే ఏడాదికి రూ.93.17 కోట్లు, ఒక్కో ఫిర్యాదు పరిష్కారానికి సగటున చేసిన వ్యయం రూ.37.82 లక్షలన్న మాట. 739లో 719 కంప్లయింట్లను లోక్‌పాల్ ప్రాథమిక దశలోనే కొట్టివేయడం గమనార్హం. పంజాబ్‌కు చెందిన సామాజిక కార్యకర్త కమల్ ఆనంద్ ఆర్‌టీఐ కింద అడిగిన ప్రశ్నలకు లోక్‌పాల్ ఇచ్చిన సమాధానాల్లో పై వివరాలు ఉన్నాయి. మూడేళ్లలో లోక్‌పాల్ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టిన కేసులు కేవలం 17 మాత్రమే.


క్రోమ్ బ్రౌజర్‌లో లోపాలు.. అప్‌డేట్ చేసుకోవాలన్న సెర్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: డెస్క్‌టాప్ కంప్యూటర్లలో గూగుల్ క్రోమ్ బ్రౌజర్ వాడేవారు జాగ్రత్తగా ఉండాలని భారత 'కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్)' తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఆ బ్రౌజర్‌లో ఉన్న లోపాల ఆధారంగా హ్యాకర్లు కంప్యూటర్‌లోకి చొరబడి డేటా, పాస్‌వర్డ్స్ దొంగిలించే ప్రమాదం ఉన్నదని పేర్కొంది. విండోస్, మ్యాక్ కంప్యూటర్లలో.. క్రోమ్ వెర్షన్ 127.0.6533.88/89 కన్నా ముందు వెర్షన్ ఉంటే వెంటనే లేటెస్ట్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

పశాంతంగా నీట్-పీజీ ప్రవేశ పరీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 11: నీట్- పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 170 నగరాల్లోని 416 కేంద్రాల్లో రెండు సెషన్లలో ఈ పరీక్ష జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. నీట్-యూజీ, యూజీసీ-నెట్ వంటి పరీక్షల విశ్వసనీయత విషయంలో వివాదాలు రేకెత్తడంతో... జూన్ 23న జరుగవలసిన పరీక్షను కేంద్రం వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

ఉత్తరాదిలో వర్ష బీభత్సం.. 28 మంది మృతి


ఆదివారం పట్నాలో ఓ ఆస్పత్రి వద్ద వరద

సిమ్లా, చండీగఢ్, ఆగస్టు 11: కుండపోత వర్షాలతో ఉత్తరాది అతలాకుతలమవుతోంది. ఆదివారం ఢిల్లీ, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు దంచి కొట్టాయి. ఉత్తరాదిలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల వల్ల తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో కనీసం 28 మంది మరణించారని తెలుస్తోంది. భారీ వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జమ్మూకశ్మీర్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో హిమాచల్‌ప్రదేశ్ వణికిపోతోంది. రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు 280పైగా రోడ్లు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో శనివారం ఒక రోజే 150పైగా రోడ్లను మూసివేశారు.

జేపీసీతో నిగ్గు తేల్చాలి!

(మొదటి పేజీ తరువాయి)



కుంభకోణంపై నిష్పక్షపాత దర్యాప్తు జరగనంతవరకూ ప్రధాని మోదీ.. ఏడు దశాబ్దాల కృషితో నిర్మించిన రాజ్యాంగబద్ధ సంస్థలను పక్కనపెట్టి తన స్నేహితుడిని కాపాడుకోవటానికి ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు కొనసాగుతూనే ఉంటాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. స్టాక్‌మార్కెట్ అక్రమాలపై దర్యాప్తు చేయాల్సిన సెబీపైనే ఆరోపణలు వచ్చాయి కాబట్టి, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని, స్వీయ పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తీవ్ర ఆరోపణలు వచ్చిన దృష్ట్యా మాధవి బుచ్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ మేరకు ఖర్గే ఆదివారం 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. అదానీపై సెబీ దర్యాప్తునకు సంబంధించి నెలకొన్న సందేహాన్నింటినీ తొలగించేలా కేంద్రప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు. '2023 జనవరిలో హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో అదానీ కంపెనీలపై దర్యాప్తు జరిపిన సెబీ.. ఎక్కడా తప్పు జరగలేదంటూ సుప్రీంకోర్టుకు తెలిపింది. కానీ, తాజాగా సెబీ చీఫ్‌తోనే క్విడ్ ప్రో కో జరిగినట్లుగా వెల్లడైంది. సెబీపై నమ్మకంతో తమ కష్టార్జితాన్ని స్టాక్‌మార్కెట్లో పెడుతున్న చిన్న, మధ్యస్థాయి ఇన్వెస్టర్లను కాపాడాలి. జేపీసీని ఏర్పాటు చేసి ఈ స్కాంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి' అని డిమాండ్ చేశారు. సెబీ చైర్‌పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో ఆ సంస్థ విశ్వసనీయత తీవ్రంగా దెబ్బతిన్నదని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. స్టాక్‌మార్కెట్లో తమ కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టిన చిన్న, మధ్య స్థాయి మదుపరులు నష్టపోతే దానికి మోదీ, సెబీ చైర్‌పర్సన్, గౌతమ్ అదానీ బాధ్యత వహిస్తారా అని నిలదీశారు. జేపీసీ దర్యాప్తునకు మోదీ ఎందుకంత భయపడుతున్నారని ప్రశ్నించారు.

సెబీ 'ఎక్స్' ఖాతాపై పలు ప్రశ్నలు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రమంత్రి జైరాం రమేశ్ కూడా ఎక్స్‌లో ఈ వ్యవహారంపై స్పందిస్తూ పలు ప్రశ్నలు లేవనెత్తారు. సెబీ 'ఎక్స్' ఖాతా ప్రజలకు అందుబాటులో లేదని, లాక్ అయి ఉందని జైరాం వెల్లడించారు. సెబీ అత్యున్నత అధికారులపైనే నీలినీడలు కమ్ముకున్న వేళ ఇది మరిన్ని సందేహాలకు తావిస్తోందన్నారు. సెబీ దేశ ప్రజానీకం ఆస్తి అని, దానిని ప్రజలకు కనిపించకుండా ఎలా దాచిపెడతారని జైరాం రమేశ్ ప్రశ్నించారు. మాధవి సెబీ చైర్‌పర్సన్ పదవి చేపట్టిన తర్వాత 2022లో గౌతమ్ అదానీ ఆమెను వెంటవెంటనే రెండుసార్లు కలిశారని చెప్పారు. ఆరోపణల నేపథ్యంలో సెబీ చైర్‌పర్సన్ పదవి నుంచి మాధవి వైదొలగాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. దీనిపై తక్షణం దర్యాప్తు జరిపించాలని, మోదీ, ఆర్థికమంత్రి నిర్మల మాట్లాడాలని పేర్కొన్నారు. దేశంలోని ఆర్థిక వ్యవస్థలను ఏ స్థాయిలో హైజాక్ చేశారో ఈ అవినీతి వ్యవహారం వెల్లడిస్తోందని ఆర్జేడీ విమర్శించింది.

దేశంలో ఆర్థిక అస్థిరతకు కుట్ర

దేశంలో ఆర్థిక అస్థిరత సృష్టించి కల్లోల పరిస్థితులను తీసుకురావాలనే విదేశీ కుట్రలో భాగంగానే కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని బీజేపీ విమర్శించింది. అదానీ గ్రూప్ మీద గతేడాది తీవ్ర ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్‌పై భారతీయ దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయని, పార్లమెంటు సమావేశాల సమయంలోనే విదేశాల నుంచి ఇటువంటి నివేదికలు వెల్లడవుతున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది చెప్పారు.

హిండెన్‌బర్గ్ ఆరోపణలు పచ్చి అబద్ధాలు



హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలను మాధవి పురి బుచ్, ఆమె భర్త ధవల్ బుచ్ తోసిపుచ్చారు. తాము ఎన్నడూ అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు లేదా రుణ పత్రాల్లో పెట్టుబడులు పెట్టలేదని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలు పచ్చి అబద్ధాలని, తమ వ్యక్తిత్వాన్ని, సెబీ విశ్వసనీయతను దెబ్బతీసేందుకే పనిగట్టుకుని ఆ సంస్థ ఈ ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. తమ ఆర్థిక లావాదేవీలు తెరిచిన పుస్తకమని తెలిపారు. గత నెలలో సెబీ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు సమాధానం దాటవేసేందుకే హిండెన్‌బర్గ్ ఈ ఆరోపణలకు దిగిందన్నారు. సింగపూర్ ప్రైవేట్ పౌరులుగా ఉన్నపుడు తన భర్త బాల్యమిత్రుడు అనిల్ అహూజా సలహాపై రెండు ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టిన విషయం మాత్రం నిజమన్నారు. అయితే అహూజా సిటీ బ్యాంక్ నుంచి తప్పుకున్న వెంటనే తాము కూడా ఆ పెట్టుబడుల నుంచి తప్పుకున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. మరోవైపు సెబీ కూడా తాజా పరిణామాలపై ఒక ప్రకటన విడుదల చేసింది. తమ చీఫ్ మాధవి పురి బుచ్ తన పెట్టుబడుల వివరాలను ఎప్పటికపుడు సెబీ బోర్డుకు వెల్లడించారని తెలిపింది. తనకు, తన కుటుంబ సభ్యులకు పెట్టుబడులు ఉన్న సంస్థల అంశాలు చర్చకు వచ్చినప్పుడు.. ఆమె అసలు ఆ చర్చల్లోనే పాల్గొనే వారు కాదని స్పష్టం చేసింది.

విదేశాంగ శాఖ మాజీ మంత్రి నట్వర్ సింగ్ కన్నుమూత



న్యూఢిల్లీ, ఆగస్టు 11: విదేశాంగ శాఖ మాజీ మంత్రి కే నట్వర్‌సింగ్(93) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన కొన్నాళ్లుగా గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. దౌత్య, రాజకీయ రంగాలతో పాటు రచనా వ్యాసంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. కాంగ్రెస్‌తో సుదీర్ఘ అనుబంధం ఉన్న ఆయన మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీతో సన్నిహితంగా మెలిగారు. 1931లో భరత్‌పూర్ (రాజస్థాన్) రాజ కుటుంబంలో జన్మించిన నట్వర్ సింగ్.. 1953లో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. విదేశాంగ శాఖ కార్యదర్శిగా కూడా పనిచేశారు. 1984లో ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. అదే ఏడాది నట్వర్ సింగ్ ఉద్యోగానికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. భరత్‌పూర్ నుంచి పోటీ చేసి గెలిచారు. కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2004లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంతో నట్వర్ సింగ్ విదేశాంగ మంత్రిగా నియమితులయ్యారు. అయితే 18 నెలలకే.. 'ఇరాక్ ఆయిల్ కుంభకోణం'లో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా లబ్ధి పొందిందంటూ ఐక్యరాజ్య సమితి స్వతంత్ర కమిటీ నివేదిక ఇవ్వడంతో ఆయన వైదొలగక తప్పలేదు. కొన్నాళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకీ రాజీనామా చేశారు. తర్వాత బీఎస్పీలో చేరినా నాలుగు నెలలకే క్రమశిక్షణా చర్యల కింద ఆయనను బహిష్కరించారు. నట్వర్‌సింగ్ దౌత్యరంగానికి విశిష్ట సేవలందించారంటూ ప్రధాని మోదీ, ఖర్గే నివాళులర్పించారు.

బంగ్లాలో అధికార మార్పునకు అమెరికా కుట్ర

మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు



న్యూఢిల్లీ, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో అధికార మార్పునకు అమెరికా కుట్ర పన్నిందని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు చేశారు. బంగ్లాలో తిరుగుబాటు, అల్లర్ల వెనుక కూడా అగ్రరాజ్యం హస్తం ఉందన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి ఢాకాలోని నివాసం నుంచి వెళ్లే ముందు జాతినుద్దేశించి ఈ అంశంపై ప్రసంగించాలని ఆమె భావించారు. అయితే ఆమెకు ఆ అవకాశం రాలేదు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న ఆమె.. తన సన్నిహితులతో పంచుకున్న ఆ ప్రసంగ పాఠాన్ని ఓ జాతీయ మీడియా చానెల్ బహిర్గతం చేసింది. "మృతదేహాల ఊరేగింపు చూడాల్సిన అవసరం రాకూడదనే రాజీనామా చేశాను. విద్యార్థుల మృతదేహాలపై వారు అధికారంలోకి రావాలనుకున్నారు. అందుకు నేను అనుమతించలేదు.సెయింట్ మార్టిన్ ద్వీపంపై సార్వభౌమత్వాన్ని అప్పగించి బంగాళాఖాతంపై అమెరికా ఆధిపత్యాన్ని చెలాయించడానికి అనుమతించి ఉంటే అధికారంలో కొనసాగి ఉండేదాన్ని. దయచేసి రాడికల్స్ చేతిలో మోసపోవద్దు' అని దేశ ప్రజలను ఆమె వేడుకున్నారు. 'ఒకవేళ నేను బంగ్లాదేశ్‌లోనే ఉండి ఉంటే మరింతమంది ప్రాణాలు పోయి ఉండేవి. మరిన్ని వనరులు ధ్వంసమయ్యేవి. అందుకే నా అంత నేనే రాజీనామా చేశా. మీరే నా బలం. మీరు వద్దనుకున్నారు కాబట్టి వెళ్లిపోతున్నాను' అని బంగ్లా ప్రజలను ఉద్దేశించి హసీనా పేర్కొన్నారు. త్వరలోనే తాను బంగ్లాదేశ్‌కు వెళ్తానని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ క్షేమం కోసం భగవంతుడిని ప్రార్థిస్తానని చెప్పారు. నిరసనలో ఉన్న విద్యార్థులను రజాకార్లు అని తానెప్పుడూ సంబోధించలేదన్నారు.

అల్ కాయిదా శుభాకాంక్షలు

షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసినందుకు బంగ్లాదేశ్ ప్రజలను అభినందిస్తూ అల్ కాయిదా ఉగ్రవాద సంస్థ తాజాగా 12 పేజీల ప్రకటన విడుదల చేసింది. దీన్ని ఈ ప్రాంతంలో ఇస్లామిస్టులు, జిహాదిస్టుల విజయంగా అభివర్ణించింది. ఇస్లామిస్టులు కొత్త ప్రభుత్వంలో భాగస్వాములయ్యే బదులు దేశంలో పూర్తి షరియా పాలన తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలని ఏక్యూఐఎస్(అల్ కాయిదా భారత ఉపఖండం) చీఫ్ ఒసామా మసూద్ సూచించారు. మరోవైపు... గ్రామీణ టెలికాం కార్మికులు, ఉద్యోగుల సంక్షేమ నిధిని దుర్వినియోగం చేసినట్లు అవినీతి నిరోధక కమిషన్ ఇదివరకు దాఖలు చేసిన కేసు నుంచి బంగ్లా ప్రభుత్వ ప్రధాన సలహాదారు మొహమ్మద్ యూనస్‌కు విముక్తి లభించింది. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన 11 మందిని బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. పశ్చిమబెంగాల్‌లో ఇద్దరిని, త్రిపురలో ఇద్దరిని, మేఘాలయలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసన

» ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆందోళనలు

ఢాకా, వాషింగ్టన్, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువుల ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడిని నిరసిస్తూ ఢాకా, చట్టగ్రాం నగరాలలో వరుసగా రెండోరోజూ వేలాదిమంది హిందువులు ఆందోళనలు నిర్వహించారు. వారికి సంఘీభావంగా వేలాదిమంది ముస్లింలు, విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొన్నారు. మైనారిటీలను వేధిస్తున్నవారిపై విచారణ వేగవంతానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని, పార్లమెంటులో 10 శాతం సీట్లను మైనారిటీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఢాకాలోని షాబాగ్ ప్రాంతంలో నిరసన సందర్భంగా మూడు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక దాడులు పెరగడాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తాయి. దాడులను ఖండిస్తూ లండన్, వాషింగ్టన్ డీసీ సహా ప్రధాన నగరాలలో ప్రదర్శనలు నిర్వహించారు. లండన్‌లోని పార్లమెంటు భవనం ఎదుట ఆందోళనకారులు బంగ్లాదేశ్ జెండా, చిహ్నాలతో నిరసన తెలిపారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వివిధ మానవహక్కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వద్ద కూడా శనివారం ఆందోళన నిర్వహించారు. కాగా, దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడుల్ని బంగ్లాదేశ్ తాత్కాలిక నేత మొహమ్మద్ యూనస్ ఖండించారు. హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులను కాపాడవలసిందిగా యువతను కోరారు.

అల్లుడు ఆరడుగులు ఉంటాడనుకున్నా

5.55 అడుగుల సచిన్‌ను చూసి ఆశ్చర్యపోయా.. క్రికెట్ దిగ్గజం అత్త అనాబెల్ మెహతా

(సెంట్రల్ డెస్క్)



పాలబుగ్గల పసివాడిగా క్రీజులో అడుగుపెట్టి.. మొనగాళ్లలాంటి బౌలర్ల పనిపట్టి.. రికార్డులను కొల్లగొట్టి.. చరిత్రలో తనకెవరూ సాటిలేరని చాటిన మేటి క్రికెటర్ సచిన్ టెండూల్కర్ గురించి క్రికెట్ అభిమానులందరికీ తెలిసిందే. అయితే, అతడి ప్రేమకు సంబంధించిన అత్యంత వ్యక్తిగత విషయం ఒకదాన్ని బయటపెట్టారు టెండూల్కర్ అత్త అనాబెల్ మెహతా. తన కుమార్తె డాక్టర్ అంజలి-సచిన్ ప్రేమ వివాహానికి ముందు జరిగిన ఈ ఘటనను 'మై పాసేజ్ టు ఇండియా: ఎ మెమోయిర్' పుస్తకంలో ఆమె వివరించారు. అప్పట్లో ఏం జరిగిందో అనాబెల్ మాటల్లోనే.. అంజలి ఓ కుర్రాడితో ప్రేమలో ఉందని తెలిసి అతడిని చూడాలనుకున్నా. నా సోదరుడు రిచర్డ్ ఇంట్లో కలిసేందుకు ఏర్పాటు చేశాం. వచ్చే కుర్రాడు ఆరడుగుల ఎత్తుతో, అందంగా ఉంటాడని ఊహించుకున్నా. కానీ, వచ్చింది 19 ఏళ్ల సచిన్ టెండూల్కర్. దీంతో ఆశ్చర్యపోయా. అతడు పిల్లాడిలా కనిపించాడు. మృదుస్వభావి, తక్కువగా మాట్లాడుతూ సిగ్గు పడుతున్నాడు. సచిన్‌తో ఒంటరిగా మాట్లాడేందుకు.. అంజలి, రిచర్డ్‌ను వెళ్లిపొమ్మన్నా. నా భర్త ఆనంద్ మెహతాకు సచిన్ గురించి తెలుసు కాబట్టి ఆయన నుంచి అభ్యంతరం లేదు. సచిన్ అప్పటికే సూపర్ స్టార్. ఇలా పేరువచ్చిన చాలామంది తర్వాత దారి తప్పడంతో నా మనసులో భయాందోళన నెలకొంది. ఇంతలో అసలు సంగతి గుర్తొచ్చింది. 'అంజలి గురించి నీ ఉద్దేశం ఏమిటి?' అని సచిన్ కళ్లలోకి చూస్తూ ప్రశ్నించా. "మేమిద్దరం పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం" అని చెప్పాడు. దీంతో కొంత ఆశ్చర్యపోయా. 5.5 అడుగులకు కొంచెం ఎక్కువగా సచిన్ మా అమ్మాయి కంటే కాస్త ఎత్తు అంతే. బహుశా అతడి రింగుల జుట్టు అంగుళం ఎత్తు ఎక్కువ కనిపించేలా చేస్తుందేమో? అంజలి హీల్స్ వేసుకుంటే మాత్రం సచిన్ కంటే ఎత్తుగా కనిపించడం ఖాయం. ఇక తనను చూసిన మొదటిసారే ప్రేమలో పడినట్లు సచిన్ చెప్పాడని అంజలి తెలిపింది. వారిద్దరూ గాఢమైన ప్రేమలో ఉన్నారని నాకర్థమైంది. కూతురు సంతోషమే కోరుకున్నా. కానీ, భారత్‌లో యువకులకు పెళ్లి వయసు 21. సచిన్‌కు అప్పటికి 19 ఏళ్లే. అంజలి మెడిసిన్ పీజీ పూర్తి చేయాల్సి ఉంది. అందుకనే మరో రెండేళ్లు ఆగాలని.. అప్పటివరకు ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని సచిన్‌ను కోరా.

దొంగచాటుగా మా ఇంటికి..

పెళ్లికి అంగీకారం తెలిపాక.. వార్డెన్ రోడ్‌లోని మా ఇంటికి సచిన్ వచ్చేవాడు. మా మరదలు తులసి ఒకసారి వాచ్‌మన్ కుమారుడు అనుకుని భ్రమపడింది. వీధిలో శనగలు అమ్మే వ్యక్తి, సమీపంలోని అమెరికన్ కాన్సులేట్ భద్రతా సిబ్బంది తప్ప టెండూల్కర్‌ను ఎవరూ గుర్తుపట్టేవారు కాదు. కానీ, వీరెవరూ మీడియాకు చెప్పలేదు. న్యూజిలాండ్ టూర్‌లో ఉన్న సచిన్ కాల్ చేయడంతో పెళ్లి గురించి అంజలి కాస్త గట్టిగా అడిగింది. దీంతో తన తల్లిదండ్రులతో మాట్లాడమని అతడు సూచించాడు. సచిన్ అన్నయ్య అజిత్ చొరవతో అంజలి వారి తల్లిదండ్రులను కలిసింది. మేము మాత్రం నిశ్చితార్థం ముందువరకు కలవలేదు. సమావేశమయ్యాక.. వారి కట్టుబాట్లు, మధ్య తరగతి, ప్రశాంత జీవితం చూసి మేం సంతోషించాం.

సరిగ్గా సచిన్ పుట్టిన రోజునే నిశ్చితార్థం

సచిన్-అంజలి నిశ్చితార్థం సరిగ్గా సచిన్ 21వ పుట్టిన రోజు (1994 ఏప్రిల్ 24)న జరిగింది. 25 మంది బంధువులనే పిలిచాం. తర్వాత మీడియాకు తెలియజేశాం. అంతే.. గగ్గోలు రేగింది. ఎవరీ అంజలి? అంటూ వెదుకులాట మొదలుపెట్టారు. 16 ఏళ్ల వయసులో అంజలి కాలేజీలో చేరినపుడు ఇచ్చిన ఫొటో మాత్రమే వారికి దొరికింది. ఇక తమ కలల రాకుమారుడు సచిన్‌కు పెళ్లి కుదిరిందని తెలిసి లక్షలమంది అమ్మాయిల హృదయం ముక్కలైంది. ఇప్పుడు తలుచుకుంటే చాలా ఆనందంగా ఉంది. కోట్లాదిమంది ఆరాధించే క్రికెటర్‌కు అత్తగా గర్వపడుతూ.. కూతురు ప్రేమను అంగీకరించిన తల్లిగా ఆనందిస్తున్నా.

p అనాబెల్ (84) బ్రిటన్‌కు చెందినవారు. సోషియాలజీ చదివారు. 1966లో ఆనంద్ మెహతాను పెళ్లాడాక ముంబైలో స్థిరపడ్డారు. అప్నాలయ పేరిట స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్నారు.

ప్రతీ 20 కిలోమీటర్లకు డయాలసిస్ కేంద్రం

- జిల్లాకు ఒక క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్
- నియోజకవర్గానికో ట్రామా కేర్ సెంటర్: రాజనర్సింహ



మదనాపురం, ఆగస్టు 11: ప్రతీ 20 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. వనపర్తి జిల్లా మదనాపురం మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం, కొన్నూరు గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాకు ఒక క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌తో పాటు ప్రతీ నియోజకవర్గంలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రతి 35 కిలోమీటర్లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రూ.580 కోట్లు అదనపు భారం పడుతున్నా ఆరోగ్యశ్రీ పరిధిని పది లక్షల వరకు పెంచనున్నట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను టీటీడీలో ఆమోదించండి

- ఏపీ సీఎం చంద్రబాబును కోరిన స్పీకర్ గడ్డం ప్రసాద్



హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): "దైవ దర్శనం కోసం తిరుమల కొండపైకి వెళ్లే తెలంగాణ భక్తుల కోసం ప్రజాప్రతినిధులు అందించే విజ్ఞప్తి పత్రాలను టీటీడీ ఆమోదించాలి. తెలంగాణ భక్తులకు సహకరించాలి" అని ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సభాపతి ఆదివారం చంద్రబాబును హైదరాబాదులో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలకు వెళ్లే భక్తులకు సంబంధించిన అంశాలపై ఆయనతో చర్చించారు.

సౌకర్యాలున్నా సేవలందకుంటే ఎలా ?

- కౌటాల పీహెచ్‌సీలో అర్ధరాత్రి హెల్త్ డైరెక్టర్ తనిఖీ

కౌటాల, ఆగస్టు 11: రాష్ట్రంలోనే అత్యుత్తమ పీహెచ్‌సీగా గతంలో అవార్డు అందుకున్న కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో పీహెచ్‌సీకి చేరుకున్న ఆయన అన్ని విభాగాలను తనిఖీ చేసిన అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. రోగులకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. కౌటాల పీహెచ్‌సీలో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదంటూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహకు ఇటీవల ఫిర్యాదు లు అందాయి. దీంతో మంత్రి ఆదేశాల మేరకు హెల్త్ డైరెక్టర్ స్వయంగా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు ఉన్నా ప్రజలకు సేవలు ఎందుకు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు సాధారణ ప్రసవాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన కౌటాల పీహెచ్‌సీలో నాలుగు నెలలుగా ఒక్క సాధారణ ప్రసవం ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. ఆసిఫాబాద్ మండలం బండగూడకి చెందిన ఆత్రం ధర్ముబాయి వాగు దాటే సమయంలో జరిగిన ఆలస్యంతో పురిటిలోనే శిశువు మృతిచెందిన ఘటనను గుర్తు చేసిన ఆయన.. అలాంటి పరిస్థితి మరొకరికి రాకుండా చూడాలని సిబ్బందిని కోరారు.

విదేశీ విద్యానిధి మరింత మందికి అందిస్తాం

- మంత్రి పొన్నం వెల్లడి.. ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖలో అమలు చేస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి (బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్) పథకాన్ని మరింత మందికి ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ ఏడాదికి సంబంధించిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ప్రక్రియను మార్చిలోనే పూర్తిచేయాల్సి ఉందని, కానీ ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగిందని చెప్పారు. విదేశీ విద్యానిధి స్కాలర్‌షిప్‌ను గతంలో ఏడాదికి 300మందికి అందించేవారని, కానీ తమ ప్రభుత్వం ఆ సంఖ్యను రెండు లేదా మూడింతలు పెంచాలనే ఉద్దేశంతో ఉందని తెలిపారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లకు కొంతమంది ఎంపిక జరిగిందని, వారికి సంబంధించిన నిధులన్నింటినీ ఒకేసారి విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. గత ఏడాది మొదటి విడత అందుకున్న వారికి రెండో విడతకు సంబంధించి త్వరలోనే నిధులు విడుదలవుతాయని పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యానిధి పథకంలో లబ్ధిదారుల సంఖ్యను పెంచనుందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. "మరింత మందికి విదేశీ విద్యానిధి" శీర్షికన 2024 మార్చి 28న కథనాన్ని ప్రచురించింది.



శ్రీవారి ఆలయం వద్ద డిప్యూటీ సీఎం భట్టి, కుటుంబ సభ్యులు

2 రాష్ట్రాల ప్రజలపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలి

- తిరుమలలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్టు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తిరుమల శ్రీవారి సుప్రభాత సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి కరువు కాటకాలు లేకుండా పాడిపంటలతో రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

'అమరరాజా' రాష్ట్రాన్ని వీడతాననడం బాధాకరం

- ప్రభుత్వ వైఖరి వల్లే సంస్థలు వెళ్లిపోతున్నాయి: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం తమకిచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోతామని అమరరాజా సంస్థ చెబుతున్నట్లుగా తెలుస్తోందని.. అలాంటి నిర్ణయం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి అర్థంకాక చాలా సంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయని, కేన్స్ టెక్నాలజీ అనే సంస్థ ఇక్కడి నుంచి గుజరాత్‌కు వెళ్లిపోయిందన్నారు. అదేవిధంగా కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించిందని, ఇప్పుడు అమరరాజా కూడా వెళ్లిపోతానని చెప్పడం తెలంగాణ బ్రాండ్‌కు తీవ్రనష్టం కలిగించనుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధులతో పోల్చడం ఆవేదన కలిగిస్తోందని, ఇలాంటి ప్రకటనలు చేయొద్దని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు. అమరరాజా సంస్థ తరలిపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మల్లన్న మూలవిరాట్టు చిత్రీకరణ నిషేధం

- నేటి నుంచి అమలు: ఆలయ ఈవో బాలాజీ శర్మ

చేర్యాల, ఆగస్టు 11: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం నుంచి మూలవిరాట్టు ఫొటో, వీడియో చిత్రీకరణను నిషేధిస్తున్నట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ ఆదివారం తెలిపారు. పలువురు స్వామివారి దర్శనానంతరం మూలవిరాట్టును చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ ప్రాశస్త్యం, పవిత్రతకు భంగం కలిగించకుండా ఉండేందుకు గర్భాలయంలో ఫొటోలు, వీడియో తీయడం ఇక నుంచి అనుమతించబోమని చెప్పారు.



కొత్తగుడెం జిల్లా గుండాల మండలంలో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో ట్యాంకులో పాకురుతోఉన్న నీరు



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఎస్సీ బాలుర గురుకులంలో తరగతి గదిలోనే విద్యార్థులకు వసతి

వసతి గృహా హింస

(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడంతో రక్షణ కరువైంది. తాగుబోతులు వచ్చి అక్కడే మందు కొడుతున్నారు. పాములు, విష పురుగులు లోపలికి వస్తున్నాయి. మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయి అసౌకర్యంగా ఉంది. ఇంకొన్నిచోట్ల భవనా లు కురుస్తున్నాయి. కొన్ని గదుల్లో వర్షానికి నాని పెచ్చు లు ఊడుతున్నాయి. అత్యధిక ప్రాంగణాలు దోమలు, ఈగలతో మురికి కూపాలుగా ఉన్నాయి. స్నానాల గదులకు డోర్లు కూడా లేవు. నేలపై కూర్చొనే భోజనాలు చేస్తున్నారు. ఉదాహరణకు, పాల్వంచలోని కిన్నెరసాని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో శిథిలావస్థకు చేరిన రేకుల షెడ్లలో విద్యార్థులు ఉంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో మురుగునీరు ప్రవహిస్తోంది. గుండాల ఎస్టీ గురుకులంలో మరుగుదొడ్లు, బాత్‌రూంలు అపరిశుభ్రంగా ఉన్నాయి. విద్యార్థులు స్నానాలు చేసే వాటర్ ట్యాంక్ మురికితో పాకురు పట్టి ఉంది. ఆ నీటినే విద్యార్థులు వాడుతున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకులం విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా మిట్టపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ ఆవరణలో అడుగు ఎత్తుకుపైగా గడ్డి ఉంది. దానిలోంచి పాములు, ఇతర విష పురుగులు తిరుగుతున్నాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకులంలో మరుగుదొడ్లు లేవు. విద్యార్థులు బహిర్భూమికి వెళుతూ విష పురుగుల బారిన పడుతున్నారు. ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలు భారీగా పెరగడంతో పాములు, ఇతర విష పురుగులు సంచరిస్తున్నాయి. జూలై 12న అక్షిత్ అనే ఏడో తరగతి విద్యార్థిని పాము కాటు వేయడంతో వారం రోజులపాటు ఆస్పత్రి పాలయ్యాడు. ఆదిలాబాద్ జిల్లాలోని వసతి గృహాలు, గురుకులాలు అధ్వానంగా ఉన్నాయి. దోమల బెడదతో రాత్రంతా కునుకు రావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవుతున్నారు. చర్మ వ్యాధులు ముట్టుముడుతున్నాయి. నల్లగొండ జిల్లా నిడమనూరు ఎస్సీ బాలికల గురుకులంలో పరిస్థితి దయనీయంగా ఉంది. నీటి కొరత వేధిస్తోంది. స్నానాలు చేసే పరిస్థితి లేదు. డిండి గురుకులంలో 16 మంది విద్యార్థులను ఎలుకలు కరవగా, దేవరకొండ తరలించి చికిత్స చేయించారు. ఆ తర్వాత కూడా నిర్వహణ లోపాలు సరిచేయలేదు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్‌లో రూ.20 కోట్లతో కొత్త భవనం నిర్మించినా ప్రారంభించడం లేదు. భువనగిరి పట్టణంలో దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. రూ.2 కోట్లతో ఆరేళ్ల క్రితం ప్రతిపాదించిన నాలుగంతస్తుల డార్మెటరీ భవన నిర్మాణ పనులు ఏడాదిన్నరగా పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. ఇక్కడే ఏప్రిల్ 16న కలుషిత ఆహారం కారణంగా 25 మంది అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆరో తరగతి విద్యార్థి ప్రశాంత్ (11) చికిత్స పొందుతూ మృతి చెందాడు. జగిత్యాల జిల్లా



ఈ ఫొటోలోని విద్యార్థి పేరు ప్రశాంత్. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కోలాం ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజులుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. సిక్ రూమ్‌లోనే ఏఎన్ఎం ద్వారా చికిత్సను అందిస్తున్నారు. అయినా నొప్పి తగ్గట్లేదు. అధికారులు మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లడం లేదని వాపోతున్నాడు. ఇక్కడే జూలై 30న ఒకేరోజు 16 మంది అస్వస్థతకు గురికావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స చేశారు.

మెట్‌పల్లి బీసీ గురుకులంలో విద్యార్థులు నేలపై నిద్రిస్తున్నారు. బెడ్ షీట్స్ పిల్లోస్ అందించలేదు. రేకుల షెడ్డులో బోధన జరుగుతోంది. డెస్క్ బల్లలు లేకపోవడంతో కిందే కూర్చుంటున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో బోరు నీటిని తాగుతున్నారు. కోతుల బెడద ఎక్కువగా ఉంది.

సోలార్‌తో నీటి సమస్యకు చెక్

చాలా గురుకులాల్లో వేడి నీటి సదుపాయం లేదు. దాంతో, వానాకాలం, చలికాలంలోనూ విద్యార్థులు చన్నీటి స్నానమే చేయాల్సి వస్తోంది. గురుకులాల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కొన్నిచోట్ల సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేసినా పని చేయడం లేదు. గురుకులాల ప్రాంగణాల్లోని గడ్డి, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తే విష పురుగుల బారి నుంచి రక్షణ పొందవచ్చు. మరికొన్ని గురుకులాల్లో ఇప్పటికీ నీటి సమస్య వేధిస్తోంది. అసంపూర్తి నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభించాలని, అసలు భవనాలు లేని చోట్ల కొత్తవి నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒకే ప్రాంగణంలో 8 గురుకులాలు

ఖమ్మం జిల్లా మధిర మండలం కృష్ణాపురంలో ఎనిమిది (వైరా, రఘునాథపాలెం, కూసుమంచి, కుంచపర్తి, వీవీ క్రిష్టారం, బోనకల్లు బీసీ గురుకుల కాలేజీలు, ముదిగొండ ఎస్సీ బాలుర పాఠశాల, కళాశాల) గురుకులాలను ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. రఘునాథపాలెం మండల పరిధిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో ఆరు గురుకులాలు నిర్వహిస్తున్నారు. ఆయా గురుకులాల్లో సమస్యలు పట్టిపీడిస్తున్నాయి.



గురుకుల రెసిడెన్షియల్ ఉప్పల్ బాలుర పాఠశాలలో న్యాణ్యత లేని భోజనం

చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాం



గత 20 రోజుల నుంచి చర్మ వ్యాధులతో బాధపడుతున్నాం. వైద్య సిబ్బంది మందులిచ్చినా తగ్గడం లేదు. దాదాపు 12 మందికి చర్మవ్యాధులు సోకాయి. ప్రభుత్వ వైద్య సిబ్బంది నామ్‌కే వాస్తేగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. కొంత మంది జ్వరాలు వచ్చి ఇంటికి వెళ్తున్నారు. కరెంట్ పోతే దోమల మోతతో ఇబ్బందులు పడుతున్నాం.

- యోగేశ్, 8వ తరగతి, ఝరి ఆశ్రమ హైస్కూల్, ఆదిలాబాద్ జిల్లా

హాస్టల్ ఆవరణలో చీకటి

హాస్టల్ ఆవరణలో లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంటోంది. బయటకు రావడానికి భయం వేస్తోంది. కొన్ని వాష్‌రూంలకు తలుపులు లేవు. ఉన్న వాటితోనే సర్దుకుంటున్నాం. న్యాపికిన్స్, దుప్పట్లు ఇవ్వలేదు. దోమలు ఎక్కువగా ఉన్నాయి. వైద్య పరీక్షలు జరపలేదు.

- శిరీష, హాస్టల్ విద్యార్థిని ఇల్లంతకుంట, సిరిసిల్ల జిల్లా

ఎప్పుడు కూలుతుందోనని భయం వేస్తోంది

బెల్లంపల్లి ఎస్సీ వసతి గృహంలోని హాస్టల్ భవనం స్లాబు పూర్తిగా పెచ్చులూడిపోయింది. వర్షాకాలంలో స్లాబు నుంచి నీళ్లు వస్తున్నాయి. ఎప్పుడు కూలుతుందోననే భయంతో అందరం ఒకే గదిలో నిద్రిస్తున్నాం.

- రవి కిరణ్, బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా

దోమలు కుడుతున్నాయి.. ఎలుకలు కొరుకుతున్నాయి

వసతి గృహంలో దోమలు విపరీతంగా ఉన్నాయి. నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు వచ్చి కాళ్లను కొరుకుతున్నాయి. సరిపడా బాత్‌రూంలు లేవు. దోమలు రాకుండా కిటికీలకు జాలీలను ఏర్పాటు చేయాలి. మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదు. పెడుతున్న భోజనం కూడా రుచిగా ఉండటం లేదు.

- పల్లవి, 9వ తరగతి, క్రీడా పాఠశాల, ఆసిఫాబాద్



అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఉపాధ్యక్షుడు కెర్రీ పర్సన్‌ను సన్మానిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.

హైదరాబాద్‌లో అమెజాన్ నాలుగో డేటా సెంటర్!

- మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చల అనంతరం సంస్థ ప్రకటన
- పెట్టుబడులను మరింత విస్తరిస్తాం: ఏడబ్ల్యూఎస్ ఉపాధ్యక్షుడు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే మూడు డేటా సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ (ఏడబ్ల్యూఎస్).. పెట్టుబడులను మరింత విస్తరించడంతో పాటు, నాలుగో డేటా సెంటర్ ఏర్పాటుకు సిద్ధమైంది. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ ఆధారిత సేవల నిమిత్తం.. కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం, రాష్ట్రంలో తమ పెట్టుబడుల విస్తరణ వంటి ప్రణాళికల గురించి ఆ సంస్థ ఉపాధ్యక్షుడు (ప్లానింగ్ అండ్ డెలివరీ) కెర్రీ పర్సన్ వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం ఆదివారం కెర్రీ పర్సన్‌తో సమావేశమయ్యారు. అమెజాన్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని, విజయవంతమయ్యాయని.. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారంతో పాటు అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చామని.. మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ సేవల వృద్ధికి హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందని.. కెర్రీ పర్సన్ ఆశాభావం వెలిబుచ్చారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ సహకారం తప్పకుండా ఉంటుందని.. అలాగే, ఏడబ్ల్యూఎస్ అభివృద్ధి వ్యూహంలో హైదరాబాద్ విడదీయలేని భాగమని ఆయన పేర్కొన్నారు. కొత్త డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన పెట్టుబడులపై కంపెనీ త్వరలో ప్రకటన చేసే అవకాశాలున్నాయి. కాగా.. కెర్రీపర్సన్‌తో జరిగిన సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, సీఈవో మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికే..

అమెజాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్‌లో ఉంది. గత ఏడాది.. అమెజాన్ సంస్థ డెడికేటెడ్ ఎయిర్‌కార్గో నెట్‌వర్క్ అయిన 'అమెజాన్ ఎయిర్'ను భాగ్యనగరంలోనే ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇక.. ఆ సంస్థకు చెందిన మూడు పెద్ద డేటా సెంటర్లు ఇప్పటికే ఇక్కడి నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి.

రూ. 31,532 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా, అభివృద్ధికి దోహదపడేలా ప్రఖ్యాత కంపెనీలు పెట్టుబడులకు ముందుకురావడం శుభసూచకమని తెలిపారు. మరోవైపు అమెరికా వ్యాపార సామ్రాజ్యానికి సరికొత్త తెలంగాణను పరిచయం చేశామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. రాష్ట్రంలో వివిధ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందించే సహకారాన్ని చాటి చెప్పేందుకు ఈ పర్యటన ఉపయోగపడిందని అభిప్రాయపడ్డారు. దీని ప్రభావంతో తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తడంతో పాటు అపారమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఆదివారం శాన్‌ఫ్రాన్సిస్కోలోని వేమోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు డ్రైవర్ రహిత కారు పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కారులో సీఎం కొంత దూరం ప్రయాణించారు.



డ్రైవర్ లెస్ కారు వద్ద సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

50 మందిపైగా వ్యాపారవేత్తలతో సమావేశం

రేవంత్, శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఐటీ, ఆర్థిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్‌రంజన్, రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ, సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం ఈ నెల 3న అమెరికాకు బయల్దేరింది. ఏడు రోజుల్లో 50 మందిపైగా వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, ఫార్మా-లైఫ్ సైన్సెస్, విద్యుత్తు వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ ఎలక్ట్రానిక్ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి కంపెనీలు ఆసక్తి చూపించాయి. కాగ్నిజెంట్, చార్లెస్ స్క్వాబ్, ఆర్సీసీఎం కార్నింగ్, అమెజాన్, జొయిటిస్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, వివింట్ ఫార్మా, థర్మో ఫిసర్, ఆరమ్ ఈక్విటీ, ట్రైజిన్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ కంపెనీలు రాష్ట్రంలో విస్తరణ, కొత్త కేంద్రాలు నెలకొల్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. హైదరాబాద్‌లో డేటా సెంటర్ విస్తరణకు అమెజాన్ తీసుకున్న నిర్ణయం మైలురాయిగా నిలిచింది. సీఎం బృందం యాపిల్, గూగుల్, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ప్రపంచబ్యాంక్ ప్రతినిధులతోనూ చర్చలు జరిపింది.

రైలు పట్టాలపై ఘోరం

- రైలు ఢీకొని ఇద్దరు కూతుళ్లతో సహా రైల్వే ట్రాక్‌మెన్ మృతి
- భర్త, కన్నబిడ్డలను కళ్లెదుటే కోల్పోయిన భార్య
- గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో దుర్ఘటన



భర్త, పిల్లల మృతితో రోధిస్తున్న కవిత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై దూరంగా రైలు వస్తోంది. విధి నిర్వహణలో ఉన్న ఓ ట్రాక్‌మెన్ పట్టాల సమీపంలో పెరిగిన గడ్డిని తొలగిస్తున్నాడు. ఆ ట్రాక్‌మెన్ చిన్న కూతురు.. నాన్నా అంటూ.. తండ్రి కోసం పరిగెడుతూ పట్టాలు దాటుతోంది. ఇది చూసిన ట్రాక్‌మెన్ పెద్ద కుమార్తె చెల్లెలను ఆపేందుకు పరుగెడుతూ కేకలు వేసింది. ఆ అరుపులు విన్న ఆ తండ్రి తన బిడ్డలను కాపాడుకునేందుకు యత్నిస్తుండగా రైలు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ ముగ్గురిని కబళించింది. మేడ్చల్ జిల్లా కేంద్రంలోని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగిన ఈ దుర్ఘటనలో కృష్ణ(42) అనే ట్రాక్‌మెన్, అతని కుమార్తెలు వర్షిత(12), వరిణి(7) ప్రాణాలు కోల్పోయారు.



కృష్ణ, వర్షిత, వరిణి(ఫైల్)

రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో ట్రాక్ మెన్‌గా పని చేసే కృష్ణ ఆదివారం విధులు ముగిసిన తర్వాత కుటుంబంతో కలిసి బయటికి వెళ్లేందుకు భార్యాబిడ్డలను రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చాడు. భార్యాపిల్లలను ప్లాట్‌ఫామ్‌పై ఉంచిన కృష్ణ పట్టాల వద్ద పని చేసుకుంటున్నాడు. మరోపక్క ప్లాట్‌ఫామ్‌పై ఆడుకుంటున్న వరిణి తండ్రిని చూసి అతని వద్దకు వెళ్లేందుకు పరుగు తీసింది. ప్లాట్‌ఫామ్ చివరికి వెళ్లి పట్టాలు దాటే యత్నం చేసింది. గమనించిన కృష్ణ పెద్ద కుమార్తె వర్షిత చెల్లెలను ఆపేందుకు ఆమె వెంట పరుగెత్తింది. మరోపక్క పిల్లలున్న ట్రాక్‌పై రైలు వస్తుండడాన్ని గమనించిన కృష్ణ వారిని కాపాడేందుకు పరుగుతీశాడు. అయితే, ఆ ట్రాక్‌పై సికింద్రాబాద్ వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టగా చెల్లాచెదురుగా ఎగిరిపడ్డ ఆ ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. కళ్ల ముందే తన ఇద్దరు పిల్లలు, భర్తను కోల్పోయిన కవిత ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంపై రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డైటీషియన్ పదోన్నతుల్లో వసూళ్ల పర్వం!

- ఇద్దరు యూనియన్ నేతల హస్తం?
- జోన్ 1లో 20 పోస్టులకు 35 మంది పోటీ
- ఈ ఫైల్ త్వరగా కదలాలంటే డబ్బులు ఇవ్వాలంటూ అభ్యర్థుల నుంచి వసూళ్లు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో డైటీషియన్ పోస్టుల పదోన్నతుల్లో వసూళ్ల పర్వం మొదలైంది. కొందరు యూనియన్ నేతలు సీనియారిటీ జాబితాలో ఉన్నవారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఫైల్ త్వరగా ముందుకెళ్లాలంటే సచివాలయంలో, వైద్య విద్య సంచాలకుల కార్యాలయ సిబ్బందికి డబ్బులివ్వాల్సి ఉంటుందని నమ్మబలికినట్లు తెలిసింది. ఈ వసూళ్ల పర్వంలో కరీంనగర్ జిల్లా, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు నేతలు ఉన్నట్లు సమాచారం. ఆ నేతల పేర్లు కూడా పదోన్నతుల జాబితాలో ఉన్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42 పోస్టులు ఉండగా... 42 మంది సీనియారిటీ జాబితాలో ఉన్నారు. జోన్ వన్‌లో 20 పోస్టులకు 35 మంది, రెండో జోన్‌లో 22 పోస్టులకు కేవలం 17 మందే సీనియారిటీ జాబితాలో ఉన్నారు. జోన్ వన్‌లో పోస్టులు తక్కువ, అభ్యర్థులు ఎక్కువ మంది ఉండడంతో వసూళ్లకు ఆస్కారం ఏర్పడింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి, వసూళ్లకు పాల్పడిన వారిని, డబ్బులిచ్చిన వారిని అనర్హులుగా ప్రకటించాలని మిగతా వారు డిమాండ్ చేస్తున్నారు. సీనియారిటీ జాబితాలో ఉన్న అభ్యర్థుల్లో కొంతమంది ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండానే డైటీషియన్ కోర్సులు చేసినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో ఉంటూ ఇతర విద్యా కోర్సులు చదవాలనుకుంటే కచ్చితంగా ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవాలి. కొంతమంది పరీక్షల సమయంలో కూడా సెలవు పెట్టకుండా విధుల్లోనే ఉన్నారని సమాచారం. పరీక్షలు రాయకుండానే కోర్సులు ఎలా పూర్తి చేశారో, అధికారులు వారి పేర్లను జాబితాలో ఎలా పెట్టారోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వ్యూస్ కోసం నెమలి కూర వండేశాడు?

- రాజన్నసిరిసిల్ల జిల్లాలో యూట్యూబర్ అరెస్టు
- కోడి కూర వండి తంబ్‌నైల్‌లో నెమలని పెట్టానంటున్న నిందితుడు

తంగళ్లపల్లి, ఆగస్టు 11: వ్యూస్, లైక్‌లు, సబ్‌స్క్రైబర్ల పిచ్చితో కొందరు యూట్యూబర్లు విచక్షణను మరిచి నచ్చిన కంటెంట్‌ను సోషల్ మీడియాలో పెట్టేస్తున్నారు. ఇదే కోవలో మన జాతీయ పక్షి అయిన నెమలిని ఎలా కూర చేసుకోవాలో చూపిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన కోడం ప్రణయ్ కుమార్ అనే యూట్యూబర్ వీడియో విడుదల చేశాడు. అనుకున్నట్టుగానే ఆ వీడియో వైరలయ్యింది కానీ సదరు యూట్యూబర్ మాత్రం కటకటాల పాలయ్యాడు. ప్రణయ్ కుమార్ శ్రీటీవీ పేరుతో ఓ యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నాడు. వంటలకు సంబంధించిన వీడియోలను ఈ చానల్‌లో పెడుతుంటాడు. ఇదే క్రమంలో తంబనైల్‌లో నెమలి బొమ్మ పెట్టి 'ట్రెడిషనల్ పీకాక్ కర్రీ రెసిపీ' పేరిట శనివారం ఓ వీడియో పోస్ట్ చేశాడు. నెమలి మాంసంతో కూర ఎలా వండుకావాలో ఆ వీడియోలో చూపించాడు. పోస్ట్ చేసిన కొద్ది గంటల తర్వాత వీడియోను యూట్యూబ్ నుంచి తొలగించాడు. ఈ లోపే వీడియో బాగా వైరలయ్యింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ప్రణయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని నెమలి కూర వండిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రణయ్ వండిన కూరను స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. అయితే, తాను వండింది నెమలిని కాదని కోడి కూర చేసి వ్యూస్ కోసం నెమలి కూర అని తంబ్‌నైల్ పెట్టానని ఆ యూట్యూబర్ చెబుతుండడం కొసమెరుపు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 1,390 గ్రాముల బంగారం పట్టివేత



శంషాబాద్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు ఎమిరేట్స్ విమానం ఈకే-528లో వచ్చిన ఓ వ్యక్తిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అతని ఎడమ కాలి షూ, వీపునకు వేసుకునే బ్యాగులో బంగారాన్ని గుర్తించారు. బ్యాటరీ ఆకారంలో ఉన్న రెండు బంగారం కడ్డీలను షూ, బ్యాగులో దాచాడు. ఒక గొలుసును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారం 1,390.85 గ్రాములుందని, దీని విలువ 1.06 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు.

ఇవేం కాకులు బాబోయ్..

- మగవారిని వెంటాడి నెత్తిమీద పొడుస్తున్న కాకులు
- సిరిసిల్ల జిల్లా కేంద్రం బస్టాండ్ వద్ద హడల్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 11: సిరిసిల్ల జిల్లా కేంద్రం పాత బస్టాండ్ పరిసరాల్లోంచి నడిచివెళ్లాలంటే తలమీద టోపీనో.. రుమాలో కట్టుకోవాల్సిన పరిస్థితి! ఎందుకంటే.. ఏ వైపు నుంచి ఏ కాకి వచ్చి తలమీద ఠపీ మని పొడుస్తుందోననే భయం జనాల్లో నెలకొంది! అయితే ఆ కాకులు పురుషులనే లక్ష్యంగా చేసుకున్నాయి. ఓ నలుగురైదుగురు కాకి 'పోట్ల'కు గురయ్యారు. వాయసాలు ఎందుకిలా పగబట్టాయి? అని జాగ్రత్తగా పరిశీలిస్తే.. సమీపంలో ఓ చెట్టుమీద నుంచి అప్పుడప్పుడే రెక్కలొస్తున్న దశలో ఉన్న కాకి పిల్లలు గూట్లోంచి పడిపోయాయని తెలిసింది. ఆ పిల్ల కాకులకు ఏమైనా చేస్తారనే భయంతోనే పెద్ద కాకులు ఇలా జనం వెంటబడుతున్నాయని తెలిసింది. ఈ దృశ్యాలను కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారాయి. అయితే.. నేలమీద పడ్డ ఆ కాకి పిల్లలు ఎగరడానికి ప్రయత్నించీ.. ప్రయత్నించీ.. చివరకు రివ్వున ఎగిరి మళ్లీ గూటికి చేరడంతో కాకులన్నీ శాంతించాయి.

సాగర్ క్రస్ట్ గేట్లు భద్రమేనా?

- తుంగభద్ర ఘటనతో అనుమానాలు
- రెండేళ్ల కిందట వరదల సమయంలో మొరాయించిన ఒకటో నెంబరు గేటు
- వరదలప్పుడే హడావుడిగా మరమ్మతులు
- మాములు రోజుల్లో కన్నెత్తి చూడని వైనం

నాగార్జునసాగర్, ఆగస్టు 11: రెండు తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా పేరొందిన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లు భద్రమేనా? అని నీటిపారుదల శాఖ విశ్రాంత నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలోని తుంగభద్ర ప్రాజెక్టు 19వ నెంబర్ క్రస్ట్ గేటు శనివారం అర్ధరాత్రి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో సాగర్ క్రస్ట్‌గేట్ల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవి ప్రతి ఏడాదీ వరద వచ్చే సమయానికి లీకేజీలతో ఉంటున్నాయి. రెండేళ్ల క్రితం (2022, ఆగస్టు 11న) వరద వచ్చి గేట్లు ఎత్తే సమయంలో ఒకటో నెంబరు గేటు మొరాయించింది. ఐదు అడుగులు ఎత్తేసరికి ఆగిపోయింది. గేటును పూర్తిగా (45 అడుగులు) ఎత్తడానికి ఇంజనీర్లు నానా తంటాలు పడాల్సి వచ్చింది. అంతేకాకుండా అదే ఏడాది ఆగస్టు 15న 26వ నెంబర్ క్రస్ట్ గేటును ఎత్తే క్రమంలో మోటారు ఫ్యాన్ విరిగి అజ్మతుల్లా అనే ఉద్యోగికి గాయాలయ్యాయి. క్రస్ట్ గేట్లను ఎత్తే సమయంలో అవి సగం లేచి మధ్యలో మొరాయిస్తే వరద ధాటికి కొట్టుకుపోయే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేటు కూడా అలాగే కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా 2022 అక్టోబరులో సాగర్ కుడి కాల్వ మొత్తం తొమ్మిది గేట్లు కాగా, 9వ నెంబరు గేటు వరద ధాటికి కొట్టుకుపోయింది. అప్పుడు ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉండటంతో ఎంత ప్రయత్నించినప్పటికీ నిపుణులు గేటును అమర్చలేకపోయారు. దీంతో ఆరు నెలలు నీరంతా వృథాగా కిందికి పోయింది. సాగర్ ప్రాజెక్టు అధికారులు వరద వచ్చినప్పుడు మాత్రమే క్రస్ట్‌గేట్లకు హడావుడిగా తూతూమంత్రంగా మరమ్మతులు చేస్తున్నారు. మిగతా రోజుల్లో వాటి వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. క్రస్ట్ గేట్లు కొట్టుకుపోవడం వంటి ప్రమాదం జరిగితే దిగువన ఉన్న వందలాది గ్రామాలు, లక్షలాది ఎకరాల భూముల జలమయమవుతాయి. అధికారులు ఎగువ ప్రాజెక్టుల పరిస్థితులను చూసిన తర్వాత అయినా సాగర్ ప్రాజెక్టు నిర్వహణను గాలికి వదిలేయకుండా సమర్థంగా చేపట్టాలని పలువురు నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజనీర్లు, నిపుణులు సూచిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదం నేపథ్యంలో ఈ ఏడాది ప్రాజెక్టు మరమ్మతులు, క్రేన్ ట్రాక్ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు.




2022లో గేట్లను ఎత్తే సమయంలో మొరాయించిన ఒకటో నెంబరు గేటు

తుంగభద్ర గేటు కొట్టుకుపోయింది

(మొదటి పేజీ తరువాయి)

ఉండేందుకు మిగిలిన 32 గేట్లను 2 నుంచి 3 అడుగుల మేర ఎత్తి 1.10 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వదులుతున్న నీరు సోమవారం ఉదయానికి లక్షన్నర క్యూసెక్కులకు పెరగొచ్చని.. తీరప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని బోర్డు అధికారులు హెచ్చరించారు. నీటి ఉధృతి కారణంగా మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడడంతో.. శాశ్వత మరమ్మతులు చేసేందుకు స్పిల్ లెవల్ వరకూ డ్యామ్‌ను ఖాళీ చేయాలని అధికారులు నిర్ణయించి 65 టీఎంసీల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. అయితే, భారీ వర్షాల కారణంగా ఇప్పటికే శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలు నిండిపోవడంతో తుంగభద్ర నుంచి వచ్చే నీరంతా సముద్రంలోకి వదిలిపెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. మరమ్మతులకు సంబంధించి సూచనలు చేసేందుకు.. హైదరాబాద్‌కు చెందిన డ్యామ్ గేట్ల నిపుణుడు కన్నయ్యానాయుడు, కర్ణాటక నీరావరి నిగమ్ లిమిటెడ్ (కేఎన్ఎన్ఎల్) ప్రాజెక్టు నిపుణుడు రాజేశ్ సహా హైదరాబాద్, బెంగళూరుకు చెందిన ప్రాజెక్టు నిపుణులు కూడా అక్కడకు చేరుకున్నారు. డ్యామ్ ఖాళీ చేయకుండా గేటు మరమ్మతుపై వీరు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాగా.. 65 టీఎంసీల నీరు కిందకు వెళ్లడానికి కనీసం మూడ్రోజులు పడుతుందని బోర్డు వర్గాలు తెలిపాయి. స్టాప్‌లాక్ ఏర్పాటు లేకపోవడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం. వీటి ఏర్పాటు సర్వే కోసం 2020లో నాటి ఎస్ఈ వెంకటరమణ ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేయడం గమనార్హం. మరోవైపు.. సమృద్ధిగా వానలు కురిసి జూలైలోనే జలాశయాలన్నీ నిండిపోవడంతో ఈసారి ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు, తాగునీటికి ఇబ్బంది లేదని రైతులంతా ఆనందంగా ఉన్నారు. ఇంతలోనే జరిగిన ఈ ఘటనతో వారి ఆనందం ఆవిరైంది.



రిస్కు తీసుకోవద్దు: జలసంఘం

డ్యామ్ గేట్లు పురాతనమైనవి కావడంతో పాటు మరమ్మతు చేసేందుకు పరిస్థితులు అనువుగా లేవు. ఆదివారం అప్పటికప్పుడు స్టాప్‌లాక్‌ను తయారుచేసి బిగించేందుకు అవకాశం లేకపోయింది. పైగా డ్యామ్ వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉందని కేంద్ర జల సంఘానికి బోర్డు అధికారులు, ఏపీ ఇంజనీరింగ్ అధికారులు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలియజేశారు. ఈ నేపథ్యంలో.. నది ప్రమాదకరంగా ప్రవహిస్తున్నందున రిస్కు తీసుకోవద్దని జలసంఘం సూచించింది. నిర్దిష్ట స్థాయి వరకూ జలాలు కిందకు వెళ్లిపోయేదాకా ఆగి.. అప్పుడు స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వచ్చే ఏడాది నీటి ప్రవాహం తగ్గాక డ్యామ్ గేట్లు మొత్తం మార్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని బోర్డుకు స్పష్టం చేసింది. కాగా.. క్రస్ట్ గేటు తయారీ బాధ్యతను విజయనగరంలోని తుంగభద్ర స్టీల్, హిందుస్థాన్ స్టీల్, నారాయణ స్టీల్ తయారీ కంపెనీలకు అప్పగించినట్లు ఏపీ అధికారులు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల వాటా 78 టీఎంసీలు..

ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు.. తెలంగాణలో జోగులాంబ గద్వాల జిల్లాలకు, కర్ణాటకకు సాగు, తాగునీరు అందించే జలజీవని తుంగభద్ర జలాశయం. దీని గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 135 టీఎంసీలు కాగా.. పూడిక చేరడంతో 105.788 టీఎంసీలకు కుదించారు. జూన్ 1 నుంచి మే 31 వరకు నీటి సంవత్సరంలో 212 టీఎంసీలు వినియోగించుకునేలా డిజైన్ చేశారు. కృష్ణా జలాల ట్రిబ్యునల్ అవార్డు-1 (బచావత్ అవార్డు) ప్రకారం..

- కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ వాటాగా 24 టీఎంసీలు, కేసీ కాలువ వాటా 10 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ కాలువ వాటాగా 35.5 టీఎంసీలు (మొత్తం 69.5 టీఎంసీలు)
- తెలంగాణ రాష్ట్రం ఆర్డీఎస్ కాలువకు 8.5 టీఎంసీలు కలిపి తెలుగు రాష్ట్రాల వాటాగా 78 టీఎంసీలు
- కర్ణాటక వాటాగా 134 టీఎంసీలు కేటాయించారు.
- డ్యామ్‌లో చేరే వరదను అంచనా వేసి ఈ దామాషా ప్రకారం ఏటా పంపిణీ చేస్తారు.

సాగర్‌లో పర్యాటకుల రద్దీ

ఎగువ నుంచి వరదనీరు వస్తున్న నేపథ్యంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుండడం.. అదే సమయంలో శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో చూసేందుకు వచ్చిన పర్యాటకులతో ఆ ప్రాంతం రద్దీగా మారింది. దీంతో ప్రధాన డ్యామ్, జలవిద్యుత్ కేంద్రం మార్గాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. పర్యాటకుల వాహనాలతో మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సాగర్ ప్రధాన డ్యామ్ పరిసరాలతోపాటు.. బుద్ధవనం, ఎత్తిపోతల, కొత్తవంతెన, అనుపు తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. నటి లయ తన స్నేహితురాలితో వచ్చి సాగర్ అందాలను వీక్షించారు.

వాక్ వేకు వెళ్లే గేటు తాళం పగలగొట్టిన ఏపీ అధికారులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై క్రస్ట్ గేట్లకు దిగువన ఉన్న వాక్ వే పైకి వెళ్లే గేటుకు వేసి ఉన్న తాళాన్ని ఏపీ రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో పగలగొట్టారు. సాగర్ ప్రాజెక్టు నిర్వహణ అంతా తెలంగాణ పరిధిలో ఉండటంతో 26వ నంబరు గేటు అవతల కంట్రోల్ రూం పక్కన ఉన్న వాక్ వేకు వెళ్లే దారికి గేటు ఉండగా, ఆ తాళం తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారుల వద్ద ఉంటుంది. ఏపీ నీటిపారుదల శాఖ అధికారులు ఎస్ఈ స్థాయి నుంచి నాలుగో తరగతి ఉద్యోగి వరకు సుమారు 20మంది డ్యాం పైకి వచ్చి వాక్ వే గేటు తాళం పగులగొట్టి వాక్ వే పైకి వెళ్లారు. ఆ గేటుకు కొత్త తాళం ఏర్పాటుచేసి తమ వద్దే ఉంచుకున్నారు. ఈ ఘటనపై ఈఈ మల్లికార్జున్ రావును ఫోన్ లైన్‌లో వివరణ కోరగా.. ఏపీ అధికారులు దౌర్జన్యంగా గేటు తాళం పగులగొట్టి వాక్‌వే పైకి వెళ్లారని ఉద్యోగుల ద్వారా తెలిసిందన్నారు. దీనిపై నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో పాటు కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఐదేళ్లలో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతలను పూర్తిచేయడమే లక్ష్యం

- "సీతారామ" జలాలతో ఖమ్మం సస్యశ్యామలం
- భద్రాద్రి జిల్లాలో సీతారామ ట్రయల్ రన్ ప్రారంభంలో మంత్రి ఉత్తమ్


పూసుగూడెం పంప్‌హౌస్ వద్ద సీతారామ ట్రయల్ రన్‌కు మోటార్ ఆన్‌చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కొత్తగూడెం, ఖమ్మం(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వైరా, దేవరకొండ, డిండి, దామరచర్ల, ఆగస్టు 11: వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 30-35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరివ్వడమే లక్ష్యమని భారీ నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వీలైనంత తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సాగులోకి తెస్తున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల బిల్లులను వెంటనే మంజూరు చేస్తామన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా 6.30 లక్షల ఎకరాలకు గోదావరి నీరందించి ఉమ్మడి ఖమ్మంను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా డిండి సాంఘిక సంక్షేమ గురుకులంలో దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల ప్రాజెక్టులపై సమీక్ష అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం గ్రామాల్లో సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్‌ను ఉత్తమ్ ప్రారంభించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీతారామ ట్రయల్ రన్ విజయవంతమైందని ఉత్తమ్ ప్రకటించారు. ఈ ఆగస్టు 15తో గోదావరి జలాల వినియోగం మొదలవుతుందన్నారు. 2026 ఆగస్టు 15 నాటికి పూర్తి ఆయకట్టుకు నీరందిస్తామని, ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలో 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించి సస్యశ్యామలం చేస్తామన్నారు. కాగా, సీతారామ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను పొంగులేటితో కలిసి ఉత్తమ్ పరిశీలించారు. 15న భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద ఒక పంపుహౌజ్‌ను సీఎం, మరో పంపుహౌజ్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి, ఇంకోదానిని జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సీతారామకు నెలాఖరులోగా పూర్తిస్థాయిలో అనుమతులు రాబోతున్నాయని ప్రకటించారు. సాగర్‌లో నీరు లేకపోయినా గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టుకు నీరిస్తామని చెప్పారు. వైరా సభలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. తుమ్మల మాట్లాడుతూ 2017లో ప్రారంభమైన సీతారామ పనులు మధ్యలో నత్తనడకన సాగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వేగం పెంచామని చెప్పారు. పొంగులేటి మాట్లాడుతూ సీతారామకు రూ.2,400 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యేదని, కానీ డిజైన్ మార్చి గత ప్రభుత్వం రూ.18 వేల కోట్లు ఖర్చుచేసిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చాక ఈ ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యం కల్పించామన్నారు.

ఎంత ఖర్చయినా ఎస్ఎల్‌బీసీ, డిండి పూర్తి

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల తన మనసుకు దగ్గరగా ఉన్నాయని, ఎంత ఖర్చయినా సరే వీటిని పూర్తిచేస్తానని, మంత్రి ఉత్తమ్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. సొరంగ మార్గం పనులకు అంచనాలు సవరించి రూ.460 కోట్ల మంజూరుకు క్యాబినెట్ ముందుకుతీసుకెళ్తామని తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఐదు ఎత్తిపోతలకు తక్షణమే రూ.490 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

రాజకీయాల్లో కువిమర్శలు తగదు

- కుటుంబసభ్యులను విమర్శించినందుకే.. గత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారు
- 75 ఏళ్ల ఆత్మీయ సంగమంలో వెంకయ్య



పెనమలూరు (కృష్ణా జిల్లా), ఆగస్టు 11 : గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుల కుటుంబ సభ్యులను విమర్శించారని, అందుకే ప్రజలు వారికి ఓట్ల రూపంలో బుద్ధి చెప్పారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వెంకయ్యనాయుడుకు 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా పోరంకి మురళీ రిసార్ట్‌లో ఆదివారం ఆత్మీయ సంగమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో కుటుంబ సభ్యులను విమర్శించే కుసంస్కృతి ఉండకూడదన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యావిధానంలో మార్పులు అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ మాతృభాషపై మమకారంతో ముందుకెళ్లాలని, మాతృభాష కంటిచూపు వంటిదని, పరాయి భాష రేబాన్ కళ్లజోడులాంటిదని అభివర్ణించారు. ప్రభుత్వం నుంచి కానీ, రాజకీయ నాయకుల వద్ద కానీ ఒక్క రూపాయి ఆశించకుండా తన మిత్రుల సహకారంతో స్వర్ణభారత్ ట్రస్టు నడుస్తోందని వెంకయ్య తెలిపారు. ప్రజా సిద్ధాంతం, విలువలు, సంప్రదాయాలు ప్రతి నాయకుడూ అలవరచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించిన పుస్తకాలను అతిథులకు అందించారు. అనంతరం ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.



జిల్లాలకూ ఎలక్ట్రిక్ బస్సులు

- కరీంనగర్, ఇందూరు డిపోలకు కేటాయింపు
- హైదరాబాద్ మార్గంలో సెమీ లగ్జరీ సేవలు
- ఒలెక్ట్రా, జేబీఎం సంస్థలతో ఆర్టీసీ ఒప్పందం
- అద్దె ప్రాతిపదికన నడిపేందుకు చర్యలు
- మరో వారం రోజుల్లో అందుబాటులోకి
- డిసెంబరు నాటికి మరిన్ని జిల్లాలకు విస్తరణ

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని నుంచి నిజామాబాద్, కరీంనగర్ జిల్లా కేంద్రాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం టీజీఎస్ఆర్టీసీ మరో వారం రోజుల్లో ఎలక్ట్రిక్ (సెమీ లగ్జరీ) బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటి వరకు విజయవాడ వెళ్లి వచ్చేందుకు పరిమితంగా ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్న ఆర్టీసీ.. ఇకపై జిల్లా కేంద్రాలకు కూడా ఆ సర్వీసులను విస్తరించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఒక్కో బస్సు సుమారు రూ.1.5కోట్ల నుంచి రూ.1.8 కోట్ల ఖరీదు చేస్తున్నందున.. ప్రస్తుతానికి అద్దె ప్రాతిపదికన బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు ఒలెక్ట్రా, జేబీఎం సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్కో సంస్థ నుంచి 500 చొప్పున బస్సులు తీసుకుని కరీంనగర్, నిజామాబాద్ డిపోలతో పాటు వరంగల్, నల్లగొండ, సూర్యాపేట, హైదరాబాద్-2 డిపోల నుంచి నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో డిపో నుంచి 75 బస్సుల చొప్పున ప్రవేశపెట్టాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. డిసెంబరు నాటికి సిటీతో పాటు జిల్లాల నుంచి వెయ్యి ఎలక్ట్రిక్ సెమీ లగ్జరీ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. బస్సులకు చార్జింగ్ పెట్టేందుకు ఆయా డిపోల వద్ద ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఆర్టీసీ వ్యయం చేస్తోంది. ఇటీవలే జేబీఎం 50 బస్సులను సమకూర్చగా.. ఆర్టీసీ అధికారులు కరీంనగర్ డిపోకు 33, నిజామాబాద్ డిపోకు 13 బస్సులను కేటాయించారు. మిగిలిన బస్సులను స్పేర్‌లో ఉంచారు. ఈ బస్సులకు డ్రైవర్లను జేబీఎం సంస్థనే నియమిస్తుంది.

విజయవాడ మార్గంలో విజయవంతం..

ప్రస్తుతం కంటోన్మెంట్, మియాపూర్ డిపోల నుంచి సుమారు వంద ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. ఇందులో పది బస్సులు విజయవాడ-హైదరాబాద్ మధ్య తిరుగుతున్నాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 300-320 కి.మీ దూరం వెళతాయి. విజయవాడ వెళ్లి వచ్చే బస్సుల కోసం సూర్యాపేటలో ఆర్టీసీ అధికారులు చార్జింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సర్వీసులు విజయవంతం కావడంతో అధికారులు తెలంగాణ జిల్లాలకు ఎలక్ట్రిక్ బస్సుల సేవలను విస్తరించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

కరీంనగర్ డిపోలో ఏర్పాట్లు..

రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ జిల్లా నుంచి ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించేందుకు ఆర్టీసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కరీంనగర్ డిపోలో ప్రత్యేకంగా 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పెట్టి 12 చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అలాగే నిజామాబాద్ డిపోలో కూడా చార్జింగ్ యూనిట్లను సిద్ధం చేస్తున్నారు. కరీంనగర్-జేబీఎస్, నిజామాబాద్-జేబీఎస్ మధ్య నడిచే బస్సుల కోసం కంటోన్మెంట్ డిపోలో చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.

28 ఏళ్లుగా మాతృభూమికి దూరం

- గల్ఫ్‌లో మగ్గిపోతున్న సిరిసిల్ల వలస కూలీ
- కంపెనీ నుంచి పారిపోవడంతో బ్లాక్‌లిస్ట్‌లోకి
- ఏడాది క్రితం బహ్రెయిన్‌లో అరెస్టు
- గుర్తింపు ధ్రువీకరణలో భారత సర్కారు జాప్యం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 28 ఏళ్లుగా మాతృభూమి ముఖం చూడకుండా ఎడారి దేశంలో మగ్గిపోతున్నాడు ఓ తెలుగు ప్రవాసీ. గత ఏడాది పోలీసులకు చిక్కి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన నిరుపేద దళితుడు మానువాడ నర్సయ్య ఉపాధి కోసం 1996లో బహ్రెయిన్ వెళ్లాడు. అప్పటి నుంచి ఒక్కసారి కూడా మాతృదేశానికి రాలేదు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసే నర్సయ్య అధిక జీతం కోసం కంపెనీ నుంచి పారిపోడంతో అతడి వీసాను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. 21 ఏళ్ల క్రితం వీసా గడువు, 13 ఏళ్ల క్రితం పాస్ పోర్టు గడువు ముగిసిపోయాయి. దీంతో అప్పటి నుంచి అతడు బహ్రెయిన్‌లో అక్రమంగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. గత ఏడాది పోలీసుల తనిఖీలో నర్సయ్య వీసా గడువు ముగిసినట్లు తెలియడంతో బహ్రెయిన్ పోలీసులు అతడిని జైలుకు తరలించారు. జైలులో ఉన్న నర్సయ్యను భారతీయుడిగా గుర్తించి స్వీకరించవలసిందిగా బహ్రెయిన్ ప్రభుత్వం భారతీయ అధికారులను కోరింది. నర్సయ్య పాస్ పోర్టు గడువు ముగియడంతో ఎమర్జెన్సీ పాస్ పోర్టు జారీ చేయడం కోసం నర్సయ్య ఫొటో, ఇతర వివరాలను హైదరాబాద్‌లోని అధికారులకు నివేదించారు. అయితే, నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు అతడిని అధికారులు చీర్లవంచ వాసిగా గుర్తించలేదు. దీంతో ఎమర్జెన్సీ పాస్ పోర్టు జారీ చేయడంలో జాప్యం జరుగుతోంది. 34 ఏళ్ల వయస్సులో వచ్చిన నర్సయ్యకు ఇప్పుడు 62 ఏళ్లు.

ఊరు లేకపోవడంతో గుర్తింపులో జాప్యం..

నర్సయ్య భార్య లక్ష్మి అనారోగ్యంతో మంచం పట్టింది. కుమారుడు మద్యానికి బానిసయ్యాడు. కూతురు మతాంతర వివాహం చేసుకుంది. ఆర్థిక, ఇతర సమస్యలతో కుటుంబం చెల్లాచెదురైనట్టు తెలిసింది. చీర్లవంచ మిడ్ మానేరులో ముంపునకు గురవడంతో ఆ గ్రామాన్ని మరో చోటుకు తరలించారు. ఈక్రమంలో అధికారులు అతడి గుర్తింపును ధ్రువీకరించడంలో జాప్యం జరుగుతోంది. నర్సయ్యను స్వదేశానికి పంపించడం కోసం బహ్రెయిన్‌లోని తెలుగు కళా సమితి కార్మిక సంక్షేమ విభాగం కన్వీనర్ సోముల మురళి ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాల నిర్ధారణలో జాప్యం జరుగుతుండటంతో అనేక మంది తెలుగు ప్రవాసీలు స్వదేశానికి రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీపీసీసీ గల్ఫ్ విభాగం కన్వీనర్ మంద భీంరెడ్డి వెల్లడించారు. గుర్తింపు నిర్ధారణకై ఎదురుచూస్తున్న బహ్రెయిన్‌తో పాటు ఇతర దేశాల్లోని జైళ్లలో మగ్గుతున్న ప్రవాసీలను స్వదేశానికి రప్పించడానికి వీలుగా గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

జైశంకర్‌కు కేటీఆర్ లేఖ..

హైదరాబాద్/సిరిసిల్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మానువాడ నర్సయ్యను దేశానికి రప్పించేలా చూడాలని కోరుతూ విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం లేఖ రాశారు. నర్సయ్యను భారత్‌కు పంపించాలంటే ఆయన భారతీయుడని తెలిపే ఆధారాలను సమర్పించాలని అక్కడి సర్కారు బహ్రెయిన్‌లోని భారత రాయబారికి లేఖ రాసిందని పేర్కొన్నారు. ఆయనకు తాత్కాలిక పాస్‌పోర్టు ఇప్పించేందుకు విదేశాంగ శాఖ చొరవ చూపాలని కోరారు. నర్సయ్యను రప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా శ్రద్ధ చూపాలని సీఎస్ కార్యాలయానికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.